అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శనివారం 28-10-2023

సంపుటి : 9 సంచిక : 297

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar

8 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50

గాజాపై ఆగని దాడులు

24 గంటల్లో భారీ సంఖ్యలో లక్ష్యాలపై దాడులు

- సిరియాలో అమెరికా దాడులు... ఉద్రిక్తతలకు ఆజ్యం




వివరాలు 2లో..

కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాంరాం

ప్రజాస్వామ్యాన్నే కొంటారట..!


మాటలు మార్చేటోళ్లకు ఓటేస్తే ప్రజలు ఓడుతారు..

- ఓడిపోయి ఇంట్లో కూర్చున్న తుమ్మలకు మంత్రి పదవిచ్చా..
- కమ్యూనిస్టులు పాలించిన చైతన్యవంత ప్రాంతం ఇదీ..
- ఎవరి వైఖరేంటో తెలుసుకుని ఓటేయాలి..
- ప్రధాని రాష్ట్రంలోనూ 24 గంటల కరెంటు లేదు..
- ఉపేందర్‌రెడ్డిని గెలిపిస్తే పాలేరు మొత్తానికి దళితబంధు : ప్రజా ఆశీర్వాద సభల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/ మహబూబాబాద్

"కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాంరాం.. కైలాసం వైకుంఠపాళి ఆటలో పెద్దపాము మింగినట్టే..! పదవుల కోసం పార్టీలు మారుతున్నారు.. జిల్లాలో నాయకులు డబ్బుల అహంకారంతో మాట్లాడుతున్నారు. కమ్యూనిస్టు ఎమ్మెల్యేల ఏలుబడిలో చైతన్యవంతమైన ప్రాంతం ఇదీ.. మాటలు మార్చేటోళ్లకు ఓట్లేస్తే ప్రజలు ఓడుతారు.. డబ్బు మదంతో ప్రజలను, ప్రజాస్వామ్యాన్నే కొంటామం టున్నారు. తుమ్మల ఎమ్మెల్యేగా ఓడిపోయి ఇంట్లో కూర్చుంటే నేను ఎమ్మెల్సీని చేసి, మంత్రి పదవిచ్చా..." అంటూ కాంగ్రెస్ నేతలపై ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మండిపడ్డారు. ప్రధాని మోడీ స్వరాష్ట్రంలోనూ 24 గంటల కరెంటు లేదని, సాగుకు, పరిశ్రమలకు 24 గంటలపాటు కరెంటునిచ్చేది కేవలం తెలంగాణ రాష్ట్రం మాత్రమేనన్నారు. శుక్రవారం మహబూబాబాద్, వర్ధన్నపేట పాలేరు నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొని మాట్లాడారు. పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కందాల ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కూసుమంచి మండలంలోని జీళ్లచెరువు వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. కందాల ఉపేందర్‌రెడ్డిని అసెంబ్లీ వాకిలి దాటిస్తే పాలేరు నియోజకవర్గం మొత్తానికి దళితబంధు అమలు చేస్తానని హామీ ఇచ్చారు. కోట్లు, నోట్లు పెట్టుకొని వచ్చేటోడు ఏమి చేయడు..? సంక్షేమ, అభివృద్ధి ...7లో



ఉల్లి మంట

కమలదళంలో కలవరం

- ఎన్నికల వేళ ఘాటెక్కుతున్న ఆనియన్
- గతంలో ప్రభుత్వాలనే కూల్చేసిన ప్రజాగ్రహం
- ధరలను అదుపు చేసేందుకు చర్యలు ప్రారంభించిన కేంద్రం

న్యూఢిల్లీ : నవంబర్‌లో ఐదు రాష్ట్రాల శాసనసభలకు, వచ్చే సంవత్సరం ఏప్రిల్-మే నెలల్లో లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఉల్లి ఘాటు తప్పేలా లేదు. కొద్ది నెలల క్రితం ఉల్లి ధరలు ఆకాశాన్ని తాకి ఆ తర్వాత దిగి వచ్చాయి. ప్రజలు ఊపిరి పీల్చుకునే లోపే టమాటా ధరలు కొండెక్కాయి. ఎట్టకేలకు అవి సాధారణ స్థాయికి చేరడంతో అంతా హమ్మయ్య అనుకున్నారు. ఇంతలోనే ఇప్పుడు ఉల్లి ధరలు మళ్లీ ఆకాశం వంక చూస్తూ మధ్య తరగతి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఉల్లి ధరల సెగకు గతంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురైన విషయం గుర్తుండే ఉంటుంది. 2010లో ఉల్లి ధరలు బాగా పెరిగాయి. దీంతో అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఎగుమతులను నిలిపేసి దిగుమతి సుంకాలను తగ్గించింది. అయినప్పటికీ చిల్లర వ్యాపారులు ఉల్లి ధరలను పెంచి విక్రయించారు. మూడు సంవత్సరాల తర్వాత కూడా ప్రజలు ఈ విషయాన్ని మరచిపోలేదు. 2013 ఆగస్టులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ...7లో

హస్తం గూటికి మాజీలు

మల్లికార్జున ఖర్గే సమక్షంలో చేరికలు

- కాంగ్రెస్ 70 నుంచి 80 స్థానాల్లో గెలుస్తుంది : కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- బీఆర్ఎస్‌ను ఓడించే సత్తా కాంగ్రెస్‌కే ఉంది : కపిలవాయి దిలీప్ కుమార్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో


తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ మాజీ నేతలు సొంత గూటికి చేరుకుంటున్నారు. రాష్ట్రంలో హస్తం హవా కన్పిస్తుండటంతో తరుణంలో... అధికార పార్టీ బీఆర్ఎస్ నుంచి కూడా పలువురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా, ఇతర పార్టీల్లో చేరిన కాంగ్రెస్ నేతలు తిరిగి 'ఘర్ వాపసీ' బాట పట్టారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, మాజీ ఎమ్మెల్యేలు రాజగోపాల్ రెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి, శాసన మండలి మాజీ ఉపాధ్యక్షులు నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీలకు కపిలవాయి దిలీప్ కుమార్, ఆకుల లలిత, బీఆర్ఎస్ నేతలు సంతోష్ కుమార్, నీలం మధు ముదిరాజ్‌లు కాంగ్రెస్‌లో చేరగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వారికి కండువా కప్పి ఆహ్వానించారు. శుక్రవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఇంచార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి, ఎంపి కోమటి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాను తప్పు చేశానని, సరిదిద్దుకునేందుకే తిరిగి కాంగ్రెస్‌లో చేరానని అన్నారు. బీజేపిలోకి వెళ్లినా, తిరిగి కాంగ్రెస్‌లో చేరినా... కేసీఆర్‌ను గద్దె దించేందుకే అని తెలిపారు. కేసీఆర్ అవినీతిపై బీజేపీ చర్యలు తీసుకుంటుందనే ఆ పార్టీలో చేరినట్లు చెప్పారు.కానీ ఆ దిశలో చర్యలు లేనందునే ఆ పార్టీని వీడినట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో హంగ్ వస్తే బీజేపీ, ఎంఐఎం ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తారని అన్నారు. తనకు పదవులు ముఖ్యం కాదని, ప్రజల కోసం వంద అడుగులైనా వెనక్కి వేస్తానని చెప్పారు. కాంగ్రెస్ ...2లో

45 మందితో కాంగ్రెస్ రెండో జాబితా

తుమ్మల, పొంగులేటి, రాజగోపాల్ రెడ్డి తదితరులకు అవకాశం

- ఇప్పటివరకు వంద స్థానాలకు ప్రకటన
- పెండింగ్‌లో 19 స్థానాలు

2లో..



బీజేపీ గెలిస్తే బీసీని సీఎం చేస్తాం

కాంగ్రెస్, బీఆర్ఎస్..కుటుంబ పార్టీలు


- దళితులకు మూడెకరాల భూమి ఏమైంది? : సూర్యాపేట జనగర్జన సభలో కేంద్రమంత్రి అమిత్ షా

నవతెలంగాణ-సూర్యాపేట

తెలంగాణలో బీజేపీకి అధికారం ఇవ్వాలని, పార్టీ గెలిస్తే బీసీ వ్యక్తిని సీఎంగా నియమిస్తామని బీజేపీ అగ్రనేత, కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తామని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్న సీఎం కేసీఆర్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో బీజేపీ నిర్వహించిన జనగర్జన సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్.. కుటుంబ పార్టీలని, ఎప్పటికీ తెలంగాణను అభివృద్ధి చేయలేవన్నారు. కేటీఆర్‌ను సీఎం చేయాలని కేసీఆర్ అనుకుంటున్నారని, రాహుల్‌ను ప్రధానిని చేయాలని సోనియా అనుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలోని పేదల బాగుకోసం బీజేపీ పని చేస్తుందని చెప్పారు. పేదల వ్యతిరేక పార్టీ, దళితులకు, బీసీలకు అన్యాయం చేసిన పార్టీ బీఆర్ఎస్ అని ఆరోపించారు. బీసీ సంక్షేమం కోసం ఏటా పది వేలకోట్ల ...7లో

ఆమోద యోగ్యం కాదు

ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో ఇండియా తొలగింపుపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో ఇండియా అనే పదాన్ని 'భారత్'తో భర్తీ చేయాలనే సిఫార్సులు ఆమోదయోగ్యం కాదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. పాఠ్యపుస్తకాల్లో 'ఇండియా' స్థానంలో 'భారత్'ను మాత్రమే వాడాలనే నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) ప్యానెల్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఆయన స్పందించారు.

ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల నుండి కొన్ని అధ్యాయాలను గతంలోనే మినహాయించడాన్ని గుర్తు చేస్తూ పాఠశాల పాఠ్యపుస్తకాల నుండి మొఘల్ చరిత్ర, గాంధీ హత్య తర్వాత ఆర్ఎస్ఎస్ నిషేధం వంటి ఏకపక్ష మినహాయింపులకు ఇది కొనసాగింపుగా చూడాలి అని పినరయి విజయన్ అన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ సంఘ్ పరివార్‌కు అనుకూలంగా ఉండే వ్యక్తులతో ఉందని, చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు.

"సంఘ్‌పరివార్ సృష్టించిన బూటకపు చరిత్రను తెల్లగా మార్చేందుకు పాఠ్యపుస్తకాల కమిటీ ఆసక్తిగా ఉంది. ఈ దేశం బహుళత్వం, సహజీవనంపై ఆధారపడి ఉండాలనే ఆలోచనకు సంఘ్ పరివార్ ఎప్పుడూ వ్యతిరేకం. దానికి తాజా ఉదాహరణ ఈ ప్రతిపాదన" అని పినరయి విజయన్ అన్నారు. ఎన్‌సీఇఆర్‌టీ కమిటీ సమర్పించిన "రాజ్యాంగ విరుద్ధ" ప్రతిపాదనకు వ్యతిరేకంగా ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఒకే రోజు..రెండు వికెట్లు

మరికొందరు బ్యాక్ టు పెవిలియన్

- అయోమయంలో బీజేపీ నాయకత్వం
- కేవలం ఒక్క అభ్యర్థితోనే రెండో జాబితా
- మహబూబ్‌నగర్ అభ్యర్థిగా ఏపీ మిథున్‌రెడ్డి
- తీవ్ర అసంతృప్తిలో డీకే అరుణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీలో రోజుకో కీలక వికెట్ పడిపోతున్నది. శుక్రవారం ఒక్కరోజే రెండు ముఖ్యమైన వికెట్లు పడ్డాయి. అచ్చిరాని మైదానం(ఎన్నికల గోదా)లోకి దిగి పరుగులు చేయలేక ఇబ్బంది పడటం ఎందుకనుకుంటున్నారో ఏమోగానీ ముందే పెవిలియన్ బాట(మళ్లీ సొంతగూళ్లకు) పట్టేందుకు సిద్ధం అవుతున్నారు. గెలుపు మీద ఆశలు వదులున్న బీజేపీ టెయిలెండర్లతో 2023 ఫైట్‌ను మమా అనిపించాలని చూస్తున్నది. తాము గెలవలేకపోయినా సరే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చి తెలంగాణలో కాంగ్రెస్ నెట్‌రన్‌రేట్‌ను వీలైనంత మేరకు తగ్గించే ప్రయత్నాల్లో మునిగింది. దీంతో నాయకత్వం తీరుపై క్షేత్రస్థాయి శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.కొంత కాలంగా బీజేపీ ముఖ్య నేతల తీరు పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న ఏనుగు రవీందర్‌రెడ్డి ఆ పార్టీని వీడి హస్తం గూటికి చేరారు. అసంతృప్తితో రగిలిపోతూ పలుమార్లు మీటింగ్‌లు ఏర్పాటు చేసిన సీనియర్లలో ఈయన కూడా ఒకరు కావడం గమనార్హం. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయమంటూనే ఆ పార్టీకే మేలు చేసేలా వ్యవహరిస్తున్న బీజేపీ తీరును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ కూడా పార్టీకి బైబై చెప్పేశారు. చెయ్యిని అందుకున్నారు. కేసీఆర్ మంచిచెడులన్నీ తెలిసిన దిలీప్‌కుమార్ బీజేపీని వీడటం ఆపార్టీకి పెద్దలోటే. దీంతో శుక్రవారం ఒక్కరోజే ఆ పార్టీ నుంచి ఇద్దరు కీలక నేతలు వెళ్లిపోయినట్టు అయింది. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు పార్టీని వీడుతున్న నేపథ్యంలో..కాంగ్రెస్ రెండో లిస్టుపై ఆధారపడి బీజేపీ ఆచితూచి అడుగులు వేస్తున్నది. హస్తం పార్టీలో సీటు దక్కని అసంతృప్త నేతలు తమవైపు వస్తారని ఆశతో ఎదురుచూస్తున్నది. అయితే, అది కూడా నెరవేరేటట్లు కనిపించడం లేదు.

బీజేపీ రెండో జాబితా ఒక్కరితోనే..డీకే పయనమెటో?

బీజేపీ జాతీయ నాయకత్వం శుక్రవారం రెండో జాబితాను వెల్లడించింది. ఆ జాబితాలో కేవలం ఒకే ఒక్క పేరు ఉండటం అందర్నీ ఆశ్చర్యపర్చింది. ఆ పేరూ ఆ పార్టీలో చిచ్చుపెట్టింది. మొదటి నుంచీ మహబూబ్‌నగర్ సీటు తనకు కేటాయించాలని డీకే అరుణ పట్టుబడుతూ వస్తున్నారు. అదే సమయంలో ఆ సీటు కోసం మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కూడా కాస్కోని కూర్చున్నారు. తన కొడుకు కోసం గట్టి ప్రయత్నాలు చేసి సఫలం అయ్యారు. అందులో భాగంగానే ఆ సీటును జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డికి కేటాయించింది. తండ్రీకొడుకులు పార్టీ మారుతారనే భయంతోనే ఆ సీటు కేటాయించినట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ కేటాయింపుపై డీకే అరుణ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆమె పయనమెటు? అనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ముఖ్యనేతలు రంగంలోకి దిగి ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిసింది. మల్కాజిగిరి నియోజకవర్గంలోనూ ఓ ముఖ్య నేత పువ్వు పార్టీకి బైబై చెప్పబోతున్నట్టు విశ్వసనీయ సమాచారం.

కరీంనగర్ కలెక్టర్, పోలీసు కమిషనర్‌లపై వేటు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కరీంనగర్ జిల్లా కలెక్టర్ బీ గోపీ, పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బారాయుడును బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) సిఫార్సు చేసింది. దీనితో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి వారిద్దరినీ బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు ...7లో

నాట్ బిఫోర్ మీ

చంద్రబాబు బెయిల్ కేసుల విచారణ నుంచి తప్పకున్న జడ్జి



అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన ప్రధాన బెయిల్ పిటిషన్, మధ్యంతర బెయిల్ అనుబంధ పిటిషన్ల విచారణ నుంచి జస్టిస్ ...7లో

కాంగ్రెస్ రనవుట్..బీజేపీ డకవుట్...

కేసీఆర్ సెంచరీ కొట్టటం ఖాయం : మంత్రి హరీశ్



- బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న సింగిరెడ్డి సోమశేఖరరెడ్డి, బిత్తిరి సత్తి

7లో..



కార్డులు సరే...ఓట్లేవీ?

ప్రతి ఎన్నికల్లోనూ ఓట్లు లేవంటూ ఓటర్ల గగ్గోలు

ప్రతి ఎన్నికలోనూ తమ ఓట్లు లేవంటూ పెద్ద సంఖ్యలో ఓటర్లు గుర్తింపుకార్డులు పట్టుకొని పోలింగ్ బూత్‌ల దగ్గర నిరసనలు వ్యక్తం చేస్తుండటం చూస్తూనే ఉన్నాం. ఈసారి కూడా అలాంటి సీన్లు తప్పేలా లేవు. ఎన్నికల సంఘం చాలా చేస్తున్నామని చెప్తున్నా...రికార్డుల్లోని రాతలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు జమీన్ ఆస్మాన్ ఫరక్ కనిపిస్తూనే ఉంది. ఇంతపెద్ద ప్రజాస్వామ్య ప్రక్రియలో అలాంటి చిన్న చిన్న సంఘటనలు సాధారణమే అనే అభిప్రాయాన్నీ అప్పుడప్పుడు వెల్లడిస్తూనే ఉంటుంది. అసలు ఓటింగ్ శాతం నమోదుపైనే అనేక సందేహాలు ఉన్నాయి.

- నివారణ చర్యలు అంతంతమాత్రమే
- 40 లక్షల మందికి కొత్త ఓటరు గుర్తింపు కార్డులు
- వారిలో సగం మందికి జాబితాలో ఓట్లు లేవు
- గుర్తింపు కార్డు...ఓటరు లిస్ట్‌లో పేరు...సంబంధం లేదంటున్న ఎన్నికల సంఘం

ఎస్ఎస్ఆర్ శాస్త్రి

బూత్ స్థాయిలో ఉన్న ఓటర్ల జాబితాలోని మొత్తం ఓట్లలో అడ్రస్ మారిన వారెంతమంది?చనిపోయిన వారు ఎంతమంది? డూప్లికేట్ ఓట్లు ఎన్ని? బోగస్ ఓట్లు ఉన్నాయా? కొత్త ఓటర్లు ఎంతమంది? వారికి మరోచోట ఓట్లు ఏమైనా ఉన్నాయా? 18 ఏండ్లు నిండినా ఓటు హక్కుకు దూరంగా ఉన్నవారెందరు? అనే స్పష్టమైన రికార్డులు ఎన్నికల సంఘం వద్ద లేవు. తాము చేసేది చేసేసి... వాటిపై ఏదైనా ఫిర్యాదులు వస్తే... కేస్ టు కేస్ స్టడీ... అంటూ దాటవేత ధోరణినే అవలంబిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం గడచిన పది నెలల్లో 40 లక్షల ఓటరు గుర్తింపు కార్డుల్ని జారీ చేసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే వాటిలో సగం మందికి ఓటర్ల జాబితాల్లో పేర్లే లేవని తెలిసింది. కొత్త ఓటరు గుర్తింపు కార్డులు ఇచ్చిన ఎన్నికల సంఘం 'దయచేసి గమనించండి' అనే కాలమ్‌లో ఆరు అంశాలను ప్రస్తావించింది. దానిలో మొదటిది "ఈ-ఎపిక్ అనేది ఎన్నికల ప్రయోజనం కోసం గుర్తింపు రుజువు" అని పేర్కొంది. రెండో కాలమ్‌లో "ఎపిక్ (ఓటరు గుర్తింపుకార్డు) ఉన్నంతమాత్రాన ఓటర్ల జాబితాలో పేరు ఉంటుందని హామీ లేదు. దయచేసి ప్రతి ఎన్నికలకు ముందు ప్రస్తుత ఓటర్ల జాబితాలో మీ పేరును తనిఖీ చేసుకోండి" అని తెలిపింది. అంటే ఓటరు గుర్తింపు కార్డు ఉన్నంతమాత్రాన జాబితాలో మీ పేరు ఉంటుందనే గ్యారెంటీ లేదని స్పష్టంగానే చెప్పేసింది. దీనివల్లే ప్రతి ఎన్నికల సమయంలో ఓట్లు లేవనీ, బోగస్ ఓట్లనీ, దొంగ ఓట్లనే చర్చ కొనసాగుతూనే ఉంది. దీనిపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఎన్నికల సంఘం రాజకీయపార్టీల ప్రతినిధులతో భేటీ అయ్యింది. ఆ సమావేశంలో పార్టీలు ...7లో

డీఎస్సీ దరఖాస్తుకు నేడే ఆఖరు

ఇప్పటి వరకు 1.71 లక్షల మంది అప్లై

ఎస్జీటీకి 64,770, ఎస్ఏకు 88,424 దరఖాస్తులు

2లో..

హస్తం గూటికి మాజీలు

(మొదటిపేజీ తరువాయి)

వల్లనే తెలంగాణ ఆకాంక్షలు నెరవేరతాయని, 70 నుంచి 80 స్థానాల్లో పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌ను ఓడించే సత్తా కాంగ్రెస్‌కే ఉంది

ప్రస్తుతం బీఆర్ఎస్‌ని ఓడించే పరిస్థితిలో బీజేపీ లేదని, ఆ సత్తా కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. కేసీఆర్‌ను ఓడించేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చెప్పారు.

బండి సంజయ్ తొలగింపు తరువాత బీజేపి బలహీన పడిందన్నారు. 2009లో కేసీఆర్‌ను మొట్ట మొదట విభేదించి బీఆర్ఎస్ నుంచి తాను బయటకి వచ్చానన్నారు. ఆనాడే కేసీఆర్ ఎలాంటి వాడో ప్రజలకు చెప్పానని గుర్తు చేశారు. ఏదీ ఆశించి పార్టీలో చేరలేదని, కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందని ఆకుల లలిత అన్నారు. బీసీ మహిళగా నిజామాబాద్ అర్బన్‌లో పోటీకి తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. నిజామాబాద్ లో గట్టి అభ్యర్థి ఉంటే కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

45 మందితో కాంగ్రెస్ రెండో జాబితా

- తుమ్మల, పొంగులేటి, రాజగోపాల్ రెడ్డి తదితరులకు అవకాశం
- ఇప్పటివరకు వంద స్థానాలకు ప్రకటన
- పెండింగ్‌లో 19 స్థానాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

45 మందితో కాంగ్రెస్ రెండో జాబితా విడుదల చేసింది. అనేక చర్చలు, భేటీల తరువాత ఎట్టకేలకు శుక్రవారం కాంగ్రెస్ రెండో జాబితాను విడుదల చేసింది. 119 అసెంబ్లీ స్థానాలకు గాను అక్టోబర్ 15న 55 స్థానాలతో మొదటి జాబితా విడుదల చేసిన కాంగ్రెస్, శుక్రవారం మరో 45 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. దీంతో ఇప్పటి వరకు మొత్తం 100 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసింది. ఇంకా 19 స్థానాలకు అభ్యర్థుల ఖరారు చేయాల్సి ఉన్నది. ఇందులో నాలుగు స్థానాలు వామపక్షాలకు కేటాయించనున్నట్టు సమాచారం. మిగిలిన స్థానాలకు కూడా త్వరలోనే జాబితా ప్రకటించనున్నారు.

రెండో జాబితాలో ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన తుమ్మల నాగేశ్వరరావుకు ఖమ్మం, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పాలేరు కేటాయించారు. అలాగే శుక్రవారమే బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మునుగోడు కేటాయించారు. ఎల్.బి.నగర్ నుంచి మధుయాష్కీ గౌడ్, జూబ్లీహిల్స్ నుంచి ఇండియా క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్, హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి జీ.వి. వెన్నెల (గద్దర్ కుమార్తె), ఖైరతాబాద్ నుంచి పి. విజయారెడ్డి, వరంగల్ తూర్పు నుంచి కొండా సురేఖ పోటీ చేయనున్నారు.

నియోజకవర్గం	అభ్యర్థి
1. సిర్పూర్	రావి శ్రీనివాస్
2. ఆసిఫాబాద్ (ఎస్టీ)	అజ్మీరా శ్యామ్
3. ఖానాపూర్ (ఎస్టీ)	ఎడమ భొజ్జు
4. ఆదిలాబాద్	కంది శ్రీనివాసరెడ్డి
5. బోథ్	వెన్నెల అశోక్
6. ముధోల్	భోస్లే నారాయణ రావ్ పాటిల్
7. ఎల్లారెడ్డి	కె. మదన్‌మోహన్‌రావు
8. నిజామాబాద్ రూరల్	రేచులపల్లి భూపతిరెడ్డి
9. కోరట్ల	జువ్వాది నరసింగరావు
10. చొప్పదండి	మేడిపల్లి సత్యం
11. హుజూరాబాద్	వడితల ప్రణవ్
12. హుస్నాబాద్	పొన్నం ప్రభాకర్
13. సిద్ధిపేట	పూజల హరికృష్ణ
14. నరసాపూర్	ఆవుల రాజిరెడ్డి
15. దుబ్బాక	చెరుకు శ్రీనివాస్‌రెడ్డి
16. కూకట్‌పల్లి	బండి రమేష్
17. ఇబ్రహీంపట్నం	మల్‌రెడ్డి రంగారెడ్డి
18. ఎల్.బి.నగర్	మధుయాష్కీ గౌడ్
19. మహేశ్వరం	కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
20. రాజేంద్ర నగర్	కస్తూరి నరేందర్
21. శేరిలింగంపల్లి	వీ. జగదీశ్వర్‌గౌడ్
22. తాండూరు	బి.మనోహర్‌రెడ్డి
23. అంబర్‌పేట్	రోహిన్ రెడ్డి
24. ఖైరతాబాద్	పి. విజయారెడ్డి
25. జూబ్లీహిల్స్	మహ్మద్ అజారుద్దీన్
26. సికింద్రాబాద్ కంటోన్మెంట్	జీ.వి. వెన్నెల (గద్దర్ కుమార్తె)
27. నారాయణ్‌పేట్	పర్ణిక చిట్టెంరెడ్డి
28. మహబూబ్‌నగర్	ఎన్నెం శ్రీనివాసరెడ్డి
29. జడ్చర్ల	జే. అనిరుధ్‌రెడ్డి
30. దేవరకద్ర	గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి
31. మక్తల్	వాకిటి శ్రీహరి
32. వనపర్తి	జి. చిన్నారెడ్డి
33. దేవరకొండ	నేనావత్ బాలూ నాయక్
34. మునుగోడు	కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
35. భువనగిరి	కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి
36. జనగాం	కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి
37. పాలకుర్తి	యశస్వినీ ఎం.
38. మహబూబాబాద్	డాక్టర్ మురళీనాయక్
39. పరకాల	రేవూరి ప్రకాశ్‌రెడ్డి
40. వరంగల్ పడమట	నాయని రాజేందర్‌రెడ్డి
41. వరంగల్ తూర్పు	కొండా సురేఖ
42. వర్ధన్నపేట	కే.ఆర్. నాగరాజు
43. పినపాక	పాయం వెంకటేశ్వర్లు
44. ఖమ్మం	తుమ్మల నాగేశ్వరరావు
45. పాలేరు	పొంగులేటి శ్రీనివాసరెడ్డి

గాజాపై ఆగని దాడులు



జెరూసలేం : గాజాపై రెండోసారి భూతల దాడికి ఇజ్రాయిల్ దిగింది. గాజా నగర శివార్లలోని లక్ష్యాలపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు, డ్రోన్‌లు దాడులకు పాల్పడ్డాయని మిలటరీ శుక్రవారం తెలిపింది. గాజాపై తీవ్రస్థాయిలో, పెద్ద ఎత్తున పదాతిదాడులు జరపాలని ఇజ్రాయిల్ సైన్యం సిద్ధమై, గురువారం తెల్లవారుజామున మొదటిసారిగా భూతల ఆపరేషన్ మొదలుపెట్టింది. గత 24గంటల్లో తమ పదాతి దళాలు గాజాలో డజన్ల సంఖ్యలో మిలిటెంట్ లక్ష్యాలపై దాడులు చేసినట్లు మిలటరీ ప్రకటించింది. గాజా శివారులోని షిజయాపై ఇజ్రాయిల్ విమానాలు, శతఘ్నులు బాంబు దాడులు జరిపాయి. తమ సైనికులు దాడులు ముగిసిన తర్వాత ఎలాంటి నష్టం జరగకుండానే సరిహద్దు దాటి వచ్చేశారని మిలటరీ తెలిపింది. గురువారం తెల్లవారు జామున ఉత్తర గాజాలో చేపట్టిన ఆపరేషన్ కొద్ది గంటల పాటు సాగింది. శత్రువును బయటకు వచ్చేలా చేయడం ఈ దాడుల లక్ష్యమని, మిలిటెంట్లను హతమార్చి, పేలుడు పదార్థాలను, లాంచ్‌పాడ్‌లను తొలగించారని ఇజ్రాయిల్ మిలటరీ ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారి తెలిపారు. తదుపరి దశ యుద్ధానికి తగినట్లుగా పరిస్థితులను సన్నద్ధం చేయడం ఈ ఆపరేషన్ లక్ష్యమని చెప్పారు. గత మూడు వారాలుగా గాజాలో కొనసాగుతున్న విధ్వంసకాండ, బాంబు దాడులతో జరుగుతున్న వినాశనం ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా తెలుస్తోంది. పలు ప్రాంతాలకు సంబంధించి యుద్ధానికి ముందు, ఇటీవలి రోజుల్లో తీసిన ఫోటోలు చూస్తుంటే విధ్వంసం ఏ స్థాయిలో వుందో స్పష్టమవుతోంది. వరుసగా వున్న నివాస భవనాలు ఒక్కసారి కనుమరుగై కేవలం దుమ్ము ధూళితో కూడిన శిధిలాల గుట్టగా మారడం ఆ ఫోటోల్లో కనిపిస్తోంది.

ఇదిలావుండగా, మరోవైపు అమెరికా యుద్ధ విమానాలు తూర్పు సిరియాలోని లక్ష్యాలపై దాడులు చేశాయని పెంటగన్ ప్రకటించింది. దాడులు జరిగిన రెండు ప్రాంతాలు మిలిటెంట్లకు ఇరాన్ ఆయుధాలు అందించే ప్రాంతాలేనని సిరియా ప్రతిపక్ష కార్యకర్తలు తెలిపారు. దాడులకు ముందుగా ఆ ప్రాంతాల నుండి ప్రజలను ఖాళీ చేయించారు. మూడు వారాల నుండి కొనసాగుతున్న గాజా యుద్ధంతో ఇప్పటికే పెచ్చరిల్లుతున్న ప్రాంతీయ ఉద్రిక్తతలకు ఈ దాడులు ఆజ్యం పోశాయి. ఇజ్రాయిల్‌తో గల సరిహద్దులోని తాబా పట్టణంలోని మెడికల్ బిల్డింగ్‌పై రాకెట్ దాడితో ఆరుగురు గాయపడ్డారని ఈజిప్ట్ ప్రభుత్వ మీడియా తెలిపింది.

ఇజ్రాయిల్ విచక్షణారహితంగా పాశవిక దాడులు కొనసాగిస్తుండడంతో ఇప్పటికే 7వేల మందికి పైగా పాలస్తీనియన్లు మృతిచెందారు. గురువారం మరణించిన వారి పేర్లు, ఐడి నెంబర్లతో ఒక జాబితాను పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. మృతి చెందిన వారిలో 2,900మంది మైనర్లు కాగా, 1500మందికి పైగా మహిళలు వున్నారు. గతంలో ఇజ్రాయిల్, హమస్ మధ్య సాగిన ఘర్షణలు, యుద్ధాల్లో మరణించిన వారి కన్నా ఈసారి ఎక్కువమంది మరణించారు. గాజాలో ఎక్కువ భాగం నేలమట్టమై, ఎక్కడ చూసినా విధ్వంసమే కనిపిస్తోంది. ఇప్పటికే 10లక్షల మందికి పైగా తమ ఇండ్లను వీడి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు.

కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేటా ముంచుడే

- తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్‌ను నమ్మితే ప్రజల్ని నట్టేట ముంచుతుందని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు.ఆ పార్టీ ఇచ్చే అబద్ధపు హామీలతో కర్ణాటక రైతులు అరిగోస పడుతున్నారని తెలిపారు. రైతులను నరకయాతన పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఏ ముఖం పెట్టుకుని తెలంగాణకు వస్తున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోనందుకు ముందు కర్ణాటక రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ దరఖాస్తుకు నేడే ఆఖరు

- ఇప్పటి వరకు 1.71 లక్షల మంది అప్లై
- ఎస్జీటీకి 64,770, ఎస్ఏకు 88,424 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) దరఖాస్తు చేసే గడువు శనివారంతో ముగియనుంది. శుక్రవారంతో ఫీజు చెల్లింపు గడువు ముగిసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 1,76,599 మంది దరఖాస్తు ఫీజు చెల్లించారనీ, వారిలో 1,71,564 మంది దరఖాస్తులను సమర్పించారని వివరించారు. 2,575 సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పోస్టులకు 64,770 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. 611 లాంగ్వేజ్ పండితులు (ఎల్పీ) పోస్టులకు 11,899 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. 164 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టులకు 6,471 దరఖాస్తులొచ్చాయని వివరించారు. 1,739 స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులకు 88,424 మంది కలిపి మొత్తం 5,089 ఉపాధ్యాయ పోస్టులకు 1,71,564 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు.

5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సెప్టెంబర్ ఆరో తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే. గతనెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వచ్చేనెల 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో జరిగే రాతపరీక్షలను విద్యాశాఖ వాయిదా వేసింది. వచ్చే ఏడాది జనవరి చివరి వారంలో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో డీఎస్సీ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు సమాలోచన చేస్తున్నారు. త్వరలోనే వాటికి సంబంధించిన తేదీలను ఖరారు చేసి ప్రకటించే అవకాశమున్నది. ఎన్నికల నేపథ్యంలో వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో జరగాల్సిన గ్రూప్-2 రాతపరీక్షలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వాయిదా వేసిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జనవరి ఆరు, ఏడు తేదీల్లో గ్రూప్-2 రాతపరీక్షలను తిరిగి నిర్వహిస్తామని ప్రకటించింది.

అధికారంలోకి వస్తే ఉచిత విద్య : కిషన్‌రెడ్డి

- బీజేపీలో చేరిన కేఎస్ రత్నం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య అందిస్తామనీ, పంట బీమా అమలు చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత కేఎస్.రత్నం ఆ పార్టీలో చేరారు. ఆయనకు కిషన్‌రెడ్డి కాషాయం కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీకేఆర్ మాట్లాడుతూ...గ్యారంటీల పేరుతో కాంగ్రెస్‌పార్టీ కర్నాటకను భ్రష్టు పట్టించిందని విమర్శించారు. రాహుల్‌గాంధీ హామీలు అమలు చేయాలంటే కాగితం మీద రాసినంత సులువు కాదని చెప్పారు. కాంగ్రెస్ అమ్ముడుపోయే పార్టీ అనీ, బీఆర్ఎస్ కొనుక్కునే పార్టీ అని ఆరోపించారు. అసవుద్దీన్ ఓవైసీ రాసిచ్చిన స్క్రిప్టును రాహుల్, కేసీఆర్ చదువుతారని విమర్శించారు. మజ్లిస్‌తో దోస్తానా ఉన్న బీఆర్ఎస్‌తో కలిసిపోయే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థులకు కేసీఆర్ డబ్బులు పంపిస్తున్నారని ఆరోపించారు. ప్రగతిభవన్ కేసీఆర్ కుటుంబ భవన్ అయిందని విమర్శించారు. కేఎస్.రత్నం మాట్లాడుతూ.. తనకు ఏడు నెలల పదవీ కాలమున్నా రాజీనామా చేసి జలదృశ్యంలో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావంలో పాలుపంచుకున్నానని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పనిచేశానన్నారు. తాను గట్టిగా మాట్లాడే వ్యక్తిని కాబట్టే పదవులు రాలేదని భావిస్తున్నానని చెప్పారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..తనను కాంగ్రెస్‌లోకి రమ్మన్నా వెళ్లట్లేదని చెప్పారు. చేవెళ్లతో తమకు కాంగ్రెస్‌తోనే పోటీ అన్నారు. రాష్ట్ర కేంద్రంలో ఒక కుటుంబ పాలన ఉంటే, చేవెళ్లలో మరో కుటుంబ పాలన నడుస్తున్నదని విమర్శించారు. కేఎస్. రత్నంను దగ్గరి గెలిపిస్తానని చెప్పారు.

నేటి నుంచి కాంగ్రెస్ విజయభేరి యాత్ర

- తాండూరులో ప్రారంభించనున్న డీకే శివకుమార్
- రేపు సంగారెడ్డిలో ఖర్గే ప్రచారం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ రెండో దశ విజయభేరి యాత్రను చేపట్టనుంది. తాండూరు నియోజకవర్గంలో కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ యాత్రను ప్రారంభించనున్నారు. తాండూరు, పరిగి, చేవెళ్ల నియోజకవర్గాల్లో వివిధ సభల్లో ప్రసంగించనున్నారు. చేవెళ్లలో మధ్యాహ్నం గంటపాటు ఆయన పాదయాత్ర చేయనున్నారు. అదేవిధంగా సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల్లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఆయానియోజకవర్గాల్లో కార్నర్ మీటింగ్‌ల్లో ఆయన ప్రసంగించనున్నారు. ఈనెల 30, 31 తేదీల్లో, నవంబర్ 1, 2 తేదీకు సంబంధించిన షెడ్యూల్‌ను కాంగ్రెస్ పార్టీ విడుదల చేయనుంది. ఈనెల 31న కొల్లాపూర్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనుంది. మొదటి దఫా విజయభేరి యాత్ర... ములుగులో ప్రారంభించి మహబూబాబాద్, భూపాలపల్లి, ఆర్మూర్ తదితర నియోజకవర్గాల్లో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ప్రచారం చేశారు.

30 రోజులు...30 ప్రశ్నలు

- బీఆర్ఎస్‌కు సంధిస్తాం : ఏఐసీసీ మీడియా ఇంచార్జి అజయ్‌కుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రానున్న 30 రోజుల్లో బీఆర్ఎస్ సర్కారుకు 30 ప్రశ్నలు సంధిస్తామని ఏఐసీసీ మీడియా ఇంచార్జి అజయ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వార్ రూమ్ ఇంచార్జి రోహన్ గుప్తా, ఏఐసీసీ అధికార ప్రతినిధి రమణి, మీడియా కో ఆర్డినేటర్ చామల కిరణ్ కుమార్ రెడ్డి తదితరులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. శనివారం నుంచి ప్రతి రోజు ఏదో ఒక అంశంపై బీఆర్ఎస్ నేతలను నిలదీస్తామన్నారు. 'తెలంగాణ అడుగుతోంది' అనే పేరుతో మధ్యాహ్నం ఒంటిగంటకు విలేకర్ల సమావేశంలో ఈ ప్రశ్నలు అడుగుతామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా.. ఎవ్వరిని ప్రశ్నించినా కూడా 'సారు.. కారు.. మళ్లీ రారు' అని అంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళతామని చెప్పారు.

కళాకారులను గుర్తిస్తూ... హస్త కళలను బతికించాలి

- టీటీడీ బోర్డు మెంబర్ గడ్డం సీతా రంజిత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అపురూప కళలతో తయా రైన హస్త కళాకృతులు తయారు చేసిన కళాకారులను గుర్తిస్తూ... ఆ కళలను బతికించాల్సిన అవస రం ఉందని టీటీడీ బోర్డు మెం బర్ గడ్డం సీతా రంజిత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ క్రాఫ్ట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అంగడి క్రాఫ్ట్ కార్య క్రమాన్ని తెలంగాణ హండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ డైరెక్టర్ డాక్టర్ అలుగు వర్షిణి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యత, పనితనం, ధరలు అన్ని చూసి వారి కళను ప్రోత్సహించే విధంగా తమ కౌన్సిల్ పనిచేస్తున్నదని పేర్కొ న్నారు. ఎగ్జిబిషన్‌లో ఉచితంగా స్టాల్‌ను పెట్టుకునేందుకు అన్ని విధాల సహకరిస్తున్నట్టు తెలిపా రు. కార్యక్రమంలో సీసీటీ చైర్మెన్ అనురాధ బిస్నాయ్, హేమలత కెంఖా తదితరులు పాల్గొన్నారు.



గడ్డాలు, టోపీలు ఉన్నవారిని

కనిపిస్తే కొడతాం

జార్ఖండ్ బీజేపీ ఎమ్మెల్యే విద్వేషపూరిత వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : గడ్డం, టోపీ పెట్టుకున్నవారు, గొడ్డు మాంసం తిన్నవారు హిందూ మత స్థలాల దగ్గర కనిపిస్తే దాడులు చేస్తామని జార్ఖండ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. ఒక వర్గం వారిని ఉద్దేశిస్తూ పరోక్షంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఎమ్మెల్యే కుష్వాహా శశి భూషణ్ మెహతా చేసిన ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఇది వివాదంగా మారింది. వార్తా కథనాల ప్రకారం.. విజయ దశమి నాడు జరిగిన కార్యక్రమంలో పలమావు జిల్లాలోని పంకి నియోజకవర్గ ఎమ్మెల్యే మెహతా పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ముస్లింల పేర్లను స్పష్టంగా చెప్పనప్పటికీ "ఈ వ్యక్తులు" మొదట హిందూ మతపరమైన కార్యక్రమాలలో పాల్గొంటారనీ, ఆపై వాటికి అంతరాయం కలిగిస్తారని అన్నారు. అయితే, ఆయన చేసిన ద్వేషపూరిత ప్రసంగాల విషయంలో మెహతాపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవటం గమనార్హం. "మేము వీడియోను పరిశీలిస్తున్నాం. ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయనందున ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు" అని పలామావు పోలీసు సూపరింటెండెంట్ రీష్మా రమేసన్ అన్నారు. వీడియోను పరిశీలించిన తర్వాతే మేము చర్య తీసుకుంటామని తెలిపారు. కాగా, జార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్ పార్టీలు రెండూ మెహతా ప్రకటనలను ఖండించాయి.

రాజస్థాన్‌లో ధనప్రవాహం

వెయ్యి కోట్లకుపైనే రికవరీ

జైపూర్: రాజస్థాన్ ఎన్నికల్లో ధనప్రవాహం ముంచెత్తుతోంది. గెహ్లాట్ సర్కార్ మరోసారి గద్దెనెక్కటానికి ప్రయత్నిస్తుంటే...ఎలాగైనా ఆ పీఠాన్ని దక్కించుకోవటానికి దారులు వెతుకుతోంది. దీంతో గతంలో కన్నా ఎక్కువగా నోట్ల కట్టలు తెరుచుకుంటున్నాయి. గత మూడేండ్లుగా వందల కోట్ల మేర నగదు స్వాధీనం చేసుకుంటే.. రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు, గత 15 రోజుల్లో 244 కోట్ల రూపాయల నగదును ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్నాయి. అక్రమ నగదు, మద్యం, డ్రగ్స్, బంగారం, వెండి స్వాధీనంలో పోలీసులు, ఆదాయపు పన్ను, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు సరికొత్త రికార్డు సష్టించాయని అధికారులు తెలిపారు. 2023లో రాష్ట్రంలో రూ.1,021 కోట్లకు పైగా రికవరీ చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఇది మూడు రెట్లు ఎక్కువ. రాజస్థాన్‌లో 2021లో రూ.322 కోట్లు, 2022లో రూ.347 కోట్లు రికవరీ అయ్యాయి.20 కోట్ల విలువైన 10 లక్షల లీటర్లకు పైగా మద్యం,మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో...
నిరుద్యోగం తగ్గింది

పలు చర్యలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం



దేశంలోనే అత్యల్పం

- అంతకుముందు బీజేపీ హయాంలో గరిష్ట స్థాయిలో నిరుద్యోగం
- మాటల్లో కాదు చేతల్లో చూపాం : ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ బాఘేల్

రాయ్‌పూర్ : గిరిజనుల ప్రాబల్యం అధికంగా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని 90 శాసనసభ స్థానాలకు రెండు దశలుగా ఎన్నికలు జరగబోతున్నాయి. నవంబర్ ఏడున 20 స్థానాలకు, 17న మిగిలిన 70 స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ తేదీ సమీపిస్తున్నప్పటికీ ఎన్నికల ప్రచారం ఇంకా లఊపందుకోలేదు. బరిలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలే ప్రధాన పక్షాలు. ఆమ్‌ఆద్మీ పార్టీ రెండోసారి పోటీ పడుతూ అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది.

రాష్ట్రంలో అధికారంలో ఉన్న భూపేష్ బాఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి రమణ్ సింగ్ నాయకత్వంలోని బీజేపీ సవాలు విసురుతోంది. రమణ్ సింగ్ 2003 నుంచి 2018 వరకూ వరుసగా మూడు సార్లు రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ నెల 25న బీజేపీ ప్రదర్శించిన ఓ కారికేచర్ వివాదానికి దారితీసింది. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా బాఘేల్‌ను ఆ కారికేచర్‌లో రావణుడిగా చిత్రీకరించారు. 'ఈసారి అవినీతి రావణుడు దగ్ధమవుతాడు' అని వ్యాఖ్యానించారు. దీనిపై బాఘేల్ ఘాటుగానే స్పందించారు. 'నాకు సంబంధించినంత వరకూ కమీషన్లు తీసుకోవడం, నిరక్షరాస్యత, పౌష్టికాహార లోపం, రైతుల సమస్యలు, నక్సలిజం వంటివి రావణుని రూపాలు' అని తిప్పి కొట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రుణమాఫీ చేస్తామని పునరుద్ఘాటించారు. నిరుద్యోగ యువత ఖాతాల్లో నేరుగా రూ.2,500 జమ చేస్తామని అంటూ ఇందుకోసం రూ.250 కోట్లు కేటాయిస్తామని చెప్పారు.

నిరుద్యోగులకు అలవెన్సు

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి దేశంలోనే అతి తక్కువగా ఛత్తీస్‌ఘర్‌లో 0.8శాతం నిరుద్యోగ రేటు నమోదైంది. నిరుద్యోగ అలవెన్సు పథకం కింద 12వ తరగతి ఉత్తీర్ణులైన, కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.5 లక్షల కంటే తక్కువగా ఉన్న 18-35 సంవత్సరాల మధ్య వయసున్న నిరుద్యోగులకు నెలకు రెండున్నర వేల రూపాయల అలవెన్సు అందజేస్తోంది. రాష్ట్రంలో నమోదైన 1.29 లక్షల మంది నిరుద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో అలవెన్సులు జమ అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాల కోసం శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తోంది.

ఆర్‌బీఐ ప్రశంసలు

గత సంవత్సరం డిసెంబర్‌లో సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) విడుదల చేసిన సమాచారం ప్రకారం గత సంవత్సరం నవంబరులో రాష్ట్రంలో నిరుద్యోగ రేటు కేవలం 0.1శాతం మాత్రమే. ఇది దేశంలోనే అత్యల్పం. అదే నెలలో దేశంలో సగటు నిరుద్యోగ రేటు 8.2%గా నమోదైంది. ఛత్తీస్‌ఘర్ మాతృ రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో నిరుద్యోగ రేటు 6.2శాతంగా ఉంది.

ఈ గణాంకాలనే కాంగ్రెస్ తన ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకుంటోంది. పట్టణ-గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సమతూకం చేసేందుకు, నూతన ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితంగానే నిరుద్యోగం తక్కువగా ఉందని తెలిపింది.

కోవిడ్ సమయంలో దేశంలో విధించిన లాక్‌డౌన్ కారణంగా 2020 ఏప్రిల్‌లో దేశంలో నిరుద్యోగ రేటు అత్యధిక స్థాయికి అంటే 23.5శాతానికి కి పెరిగింది. ఆ సమయంలో సైతం ఛత్తీస్‌ఘర్‌లో 3.4శాతం నిరుద్యోగ రేటు మాత్రమే నమోదైందని సీఎంఐఈ తెలిపింది. కోవిడ్, లాక్‌డౌన్ కారణంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలలో ఛత్తీస్‌గఢ్ అగ్రస్థానంలో నిలిచిందని ఆ సమయంలో ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేసిన శక్తికాంత దాస్ ప్రశంసించారు. రాష్ట్రంలో పెరిగిన వరి సాగు కారణంగా ఆహార ధాన్యాల నిల్వలు పెరిగాయని, ఈ పరిణామం దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపకరించిందని ఆయన చెప్పారు.

తీసుకున్న చర్యలివే



2019 సెప్టెంబర్ నుంచి ఛత్తీస్‌గఢ్ లో నిరుద్యోగం తక్కువగానే ఉంటోంది. అంతకుముందు రమణ్ సింగ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ రేటు అత్యధికంగా 22.2%గా ఉంది. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటో ఓసారి పరిశీలిస్తే...

రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం, రుణమాఫీలు, కనీస మద్దతు ధరల అమలు కారణంగా నిరుద్యోగం తగ్గిపోయిందని కాంగ్రెస్ తెలిపింది. వ్యవసాయం ద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. రాష్ట్రంలో రైతుల సంఖ్య 15 లక్షల నుంచి 26 లక్షలకు పెరిగింది. ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించి గిరిజనుల నుంచి 65 రకాల అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసింది. తద్వారా వారికి ఆర్థిక స్వావలంబన చేకూరింది. అంతేకాక తునికాకు సేకరణ ధరను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పెంచింది. మత్స్య పరిశ్రమకు, లక్క ఉత్పత్తికి వ్యవసాయ హోదా కల్పించింది. సంప్రదాయ వృత్తులు నిర్వహించే వారికి, చేనేత కళాకారులకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందించింది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం జరిపింది. గోధన్ న్యాయ్ యోజన పథకాన్ని విస్తరించింది. గో మూత్రం కొనుగోలును ప్రారంభించింది. గ్రామీణ పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసి వాటిలో ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పింది. ఐదు వేల మందికి పైగా నిరుద్యోగ ఇంజినీర్లను నమోదు చేసి, వారిలో 1,500 మందికి రూ.200 కోట్ల విలువైన పనులు కల్పించింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 26 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించింది. అదే విధంగా రాష్ట్రంలోని అడవుల ద్వారా 14 లక్షల కుటుంబాలకు పనులు కల్పించింది.

రాజకీయ రొచ్చులోకి సైన్యం?

మత రాజకీయాలతో గట్టెక్కే యత్నం

ఎన్నికల ప్రయోజనాలకు సైనికులను వాడుకోజుస్తున్న కేంద్రం

మాజీ అధికారులు, రక్షణ నిపుణుల ఆగ్రహం

ప్రతిపక్షాల మండిపాటు

హిందూత్వ ఎజెండా అమలుకే ఈ ఎత్తుగడలని ధ్వజం



ప్రజల అభివృద్ధిని, అకాంక్షలను ఎన్నికల ఎజెండాగా మోడీ బృందం అస్సలు గుర్తించదు. ఎన్నికలు రాగానే మత రాజకీయాలతో గట్టెక్కాలనుకుంటుంది. తాజాగా పార్లమెంటుకు సెమీఫైనల్స్‌గా భావిస్తున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనూ అదే విధానాన్ని సాగిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ అధికారులను రథ్ ప్రభారీలుగా మార్చి తను ప్రచారానికి వినియోగించుకోవాలనుకుంటోంది. చివరికి సైన్యాన్ని కూడా ఈ రొచ్చులోకి లాగాలనుకుంటోంది. ఇది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దిగజారుడు తనానికి నిదర్శమని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

న్యూఢిల్లీ : సాయుధ దళాలకు, రక్షణ మంత్రిత్వ శాఖకు ఇటీవలి కాలంలో మోడీ ప్రభుత్వం జారీ చేస్తున్న అధికారిక ఆదేశాలపై మాజీ సైనికాధికారులు, రక్షణ రంగ నిపుణులు, ప్రతిపక్ష పార్టీలు మండిపడుతున్నాయి. సైన్యాన్ని రాజకీయ రొచ్చులోకి లాగడమేమిటని నిలదీస్తున్నాయి. సైన్యాన్ని ఎన్నికల ప్రయోజనాల కోసం వాడుకునే ఉద్దేశంతో జారీ చేస్తున్న ఆదేశాలపై వారు విమర్శలు సంధిస్తూ బీజేపీ నేతలు తమ హిందూత్వ ఎజెండాను అమలు చేసేందుకే ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారని ధ్వజమెత్తారు.

సాయుధ దళాలను రాజకీయాలకు దూరంగా ఉంచడం ప్రజాస్వామ్యంలో ఎంతో అవసరమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ప్రధానిని ఉద్దేశించి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఓ లేఖ రాస్తూ సైనికులను ప్రభుత్వ పథకాల ప్రచారానికి మార్కెటింగ్ ఏజెంట్లుగా వాడుకోవడం సాయుధ దళాల రాజకీయీకరణ దిశగా ప్రమాదకరమైన అడుగు అని అభివర్ణించారు. ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం సైనిక దళాల సేవలను నిస్సిగ్గుగా వినియోగించుకుంటోందని ఓ సీనియర్ అధికారి విమర్శించారు. ప్రభుత్వ పెద్దల ప్రాపకం కోసం అర్రులు చాస్తున్న ఉన్నతాధికారులు ఈ ఎత్తుగడలకు వంతపాడుతున్నారని చెప్పారు. సైనిక దళాలలో నియామకాలు, పదోన్నతులు ప్రభుత్వ పెద్దల అభీష్టం మేరకే జరుగుతున్నాయని మాజీ లెఫ్టినెంట్ జనరల్ హెచ్ఎస్. పనాగ్ తెలిపారు. సాయుధ దళాలను కేంద్ర ప్రభుత్వం నియంత్రిస్తోందని, ప్రభుత్వ చర్య ఫెడరల్ నిర్మాణాన్ని ఆక్రమించడమే అవుతుందని ఉత్తర, మధ్య సైనిక దళాల మజీ కమాండర్ ఒకరు వ్యాఖ్యానించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గత వారంలో ప్రాజెక్ట్ ఉద్భవ్‌ను ప్రారంభించారు. ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక సైనిక పద్ధతులతో మేళవించి, ఆధునిక భద్రతా సవాళ్లను అధిగమిం చేందుకు ఓ విధానాన్ని రూపొందించడమే ఈ ప్రాజెక్ట్ ఉద్దేశం. భారత సైనిక దళాలు, న్యూఢిల్లీ లోని యునైటెడ్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్ (యూఎస్ఐ) సంయుక్తంగా దీనిని నిర్వహి స్తాయి. అయితే ఈ ప్రాజెక్టును పలువురు మాజీ సైనిక ఉన్నతాధికారులు వ్యతిరేకించారు. ఆధు నిక కాలానికి ప్రాచీన విజ్ఞానం పనికిరాదని రిటైర్డ్ మేజర్ జనరల్ బీఎస్ ధానోవా అభిప్రాయపడ్డారు. ఆధునిక సైనిక వ్యూహాలకు ప్రాచీన విజ్ఞానంతో పని ఏముందని ప్రశ్నించారు.

ప్రభుత్వ ఘనతలను ప్రచారం చేసేందుకు దేశవ్యాప్తంగా 822 సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటన కూడా విమర్శలకు దారితీసింది. ఇక మేలో న్యూఢిల్లీలోని సైనిక దళాల ప్రధాన కార్యాలయం అధికారికంగా ఓ సూచన చేస్తూ సెలవులో ఉన్న సైనికులందరూ తమ స్వస్థలాలలో 'జాతి నిర్మాణం' గురించి ప్రచారం చేయాలని తెలిపింది. జాతి నిర్మాణం అంటే మోడీ ప్రభుత్వ ఘనకార్యాలేనని వేరుగా చెప్పనక్కర లేదు. ఈ విధంగా మోడీ ప్రభుత్వం సైనిక దళాలను తమ విజయాల ప్రచారం కోసం వినియోగించు కోవడం, అది కూడా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ఎత్తుగడ వేయడంపై రక్షణ నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

డిసెంబర్ 5 వరకూ అలాంటి చర్యలు వద్దు

'రథ్ ప్రభారీ'ల నియామకంపై కేంద్రానికి ఈసీ నోటీసు

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ప్రచారం కోసం ప్రభుత్వాధికారులను 'రథ్ ప్రభారీలు'గా నియమించాలని భావిస్తున్న మోడీ ప్రభుత్వానికి కేంద్ర ఎన్నికల కమిషన్ షాక్ ఇచ్చింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండే నియోజకవర్గాల్లో డిసెంబర్ ఐదవ తేదీ వరకూ ఇలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని ఆదేశించింది. 'ప్రతిపాదిత వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కోసం సీనియర్ అధికారు లను ప్రత్యేక అధికారుల హోదాలో జిల్లా రథ్ ప్రభారీలుగా నియమించాలని అన్ని మంత్రిత్వ శాఖలకు లేఖలు పంపినట్లు మా దృష్టికి వచ్చింది. ఛత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికల కోసం కమిషన్ ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసింది. నాగాలాండ్‌లోని తాపీ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేం దుకు కూడా నోటిఫికేషన్ జారీ అయింది. షెడ్యూల్ ప్రకటించిన అక్టోబర్ 9వ తేదీ నుండి డిసెంబర్ 5వ తేదీ వరకూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుంది. కనుక అప్పటి వరకూ నియోజక వర్గాల్లో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టరాదని కమిషన్ ఆదేశించింది' అని ఈసీ తన నోటీసులో తెలిపింది. అయితే కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం లేదని సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర ప్రకటించారు. సీనియర్ ప్రభుత్వాధికారులను 'రథ్ ప్రభారీలు'గా పిలవడం సరికాదని, అందుకే వారిని నోడల్ అధికారులుగా పిలుస్తామని వివరించారు.

రథ్ ప్రభారీలు కాదు...నోడల్ అధికారులు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ప్రభుత్వం తలపెట్టిన వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమం కోసం ప్రభుత్వాధికారులను రథ్ ప్రభారీలుగా నియమించడంపై నెలకొన్న వివాదం నేపథ్యంలో కేంద్రం దీనిపై వివరణ ఇచ్చింది. సీనియర్ అధికారులను రథ్ ప్రభారీలు అని పిలవడం సబబు కాదని, వారిని నోడల్ అధికారులుగా పిలుస్తామని తెలిపింది. ప్రభుత్వ విజయాల ప్రచారానికి సీనియర్ అధికారులను వినియోగించుకోవడంపై తొలుత కాంగ్రెస్ స్పందించింది. ఎన్నికలకు ముందు ప్రభుత్వం తరఫున రాజకీయ ప్రచారం చేయాలని అధికారులను ఎలా అడుగుతారంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది.



వికసిత్ సంకల్ప యాత్రను ప్రధాని నరేంద్ర మోడీ నవంబర్ 15న 'బిర్సా ముండా జయంతి-జన్ జాతి గౌరవ్ దివస్' సందర్భంగా ప్రారంభిస్తారు. జార్ఖండ్‌లోని కుంతీలో సమాచార, విద్య, కమ్యూనికేషన్ (ఐఈసీ) వాహనాలకు ఆయన పచ్చజెండా ఊపుతారు. అయితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టరాదని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. దీనిపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ

కేంద్రం బుకాయింపు..

కార్యదర్శి అపూర్వ చంద్ర స్పందిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నంత కాలం ఆయా నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టబోమని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా చూడడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. సంకల్ప యాత్రలో భాగంగా 2.6 లక్షల గ్రామ పంచాయతీలు, 3700 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రచారం నిర్వహిస్తారు. ప్రజలకు శిక్షణ ఇచ్చేందుకు క్షేత్ర స్థాయి నిపుణులు ఉంటారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై కూడా రైతులకు అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వ పథకాల లబ్దిదారులను కలుసుకొని, వారి అభిప్రాయాలు తెలుసుకుంటారు. వివిధ పథకాలలో లబ్దిదారులను చేర్చేందుకు అక్కడికక్కడే రిజిస్ట్రేషన్లు కూడా చేస్తారు.

'అక్బర్' వ్యాఖ్యలపై అసోంకు ఈసీ షోకాజ్ నోటీస్

30న హాజరు కావాలని పిలుపు



గౌహతి : అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వాస్ శర్మ ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచార సభలో చేసిన 'అక్బర్' వ్యాఖ్యలపై ముఖ్యమంత్రికి ఈసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 18న శర్మ చేసిన ప్రసంగాన్ని చూసినట్లైతే ఆయన ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లు తేలుతోందని ఈసీ పేర్కొంది. ఈ నెల 30వ తేదీన సాయంత్రం 5గంటల్లోగా తమ ముందు హాజరు కావాల్సిందిగా శర్మను కోరింది. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు మీపై ఎందుకు చర్య తీసుకోరాదో తెలియచేయాలని కోరింది. శర్మ హాజరు కాని పక్షంలో ఇసి సముచితమైన నిర్ణయం లేదా చర్య తీసుకుంటుందని పేర్కొంది. ఛత్తీస్‌గఢ్‌లోని కవర్ధాలో హిమంత బిశ్వాస్ శర్మ తన ప్రసంగంలో, అక్బర్‌ను పంపకపోతే మాత కౌసల్య భూమి అపవిత్రం అవుతుంది అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "ఒక అక్బర్ ఎక్కడికైనా వస్తే, అతను 100 మంది అక్బర్లను పిలుస్తాడు. కాబట్టి వీలైనంత త్వరగా అతన్ని పంపించి వేయండి, లేకపోతే మాత కౌసల్య భూమి అపవిత్రమవుతుంది, "అని అతను చెప్పాడు. రాముని తల్లి అయిన మాతా కౌశల్య ఆధునిక ఛత్తీస్‌గఢ్‌కు చెందినదని హిందువులు నమ్ముతారు.

హిమంత బిశ్వాస్ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం రేగింది. శర్మ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ గురువారం ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించింది. ఈ వ్యాఖ్యలు చేయడం ద్వారా శర్మ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించింది. కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు పెడుతూ ఈ విషయం తెలియచేశారు. ఈసీఐ దీనిపై చర్య తీసుకోగలదని భావిస్తున్నట్లు చెప్పారు. రాజకీయ నేతలు, ముఖ్యంగా రాజ్యాంగ పదవుల్లో వున్నవారు ఎన్నికల నిబంధనలను ఇలా అతిక్రమించడానికి అనుమతించరాదని అన్నారు.

దీనిపై అసోం సీఎం స్పందిస్తూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కవర్ధ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి పేరు మహ్మద్ అక్బర్ అన్న సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు తెలియచేయకుండా కాంగ్రెస్ దాచిపెట్టిందని విమర్శించారు. ఒక అభ్యర్థిని చట్టబద్ధంగా విమర్శించడమనేది మతోన్మాద రాజకీయాల కిందకు రాదన్నారు. ఇంతటి కీలకమైన వాస్తవాన్ని దాచిపెట్టినందుకు కాంగ్రెస్ చట్టపరమైన పర్యవసానాలు ఎదుర్కొనాల్సి వుంటుందన్నారు. ఎన్నికల కమిషన్ విజ్ఞతకే ఈ విషయాన్ని వదిలివేస్తున్నట్లు తెలిపారు.

చైనా మాజీ ప్రధాని

లీ కెకియాంగ్ కన్నుమూత

చైనా అధ్యక్షుడికి సన్నిహితుడిగా గుర్తింపు


(ఫైల్)

బీజింగ్: చైనా మాజీ ప్రధాని లీ కెకియాంగ్ (68) కన్నుమూశారు. గుండెపోటుతో శుక్రవారం తెల్లవారుజామున కెకియాంగ్ మృతి చెందినట్టు స్థానిక మీడియా తెలిపింది. 2013 నుంచి మార్చి 2023 వరకు చైనా ప్రధానిగా ఉన్నారు. ప్రస్తుత చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు ఆయన అత్యంత సన్నిహితుడిగా పేరుంది. ఈ ఏడాది మార్చిలో ప్రధాని పదవి నుంచి వైదొలిగారు. అనంతరం ఆయన షాంఘైలో విశ్రాంతి తీసుకొంటున్నారు. పేకింగ్ యూనివర్శిటీలో లీ కెకియాంగ్ ఆర్థికవేత్తగానూ పనిచేశారు. సాధారణంగా సిసిపిలో ఇంజినీర్ల ఆధిపత్యం ఎక్కువ. కానీ, లీ ఆర్థిక వేత్త కావడం గమనార్హం. చైనాలోని అన్హుయి ప్రావిన్స్‌లో గల ఓ కమ్యూనిస్టు పార్టీ అధికారి ఇంట్లో లీ కెకియాంగ్ జన్మించారు. చిన్నతనంలో వ్యవసాయంపై ఆకర్షితులైనా, ఆ తర్వాత చైనా కమ్యూనిస్టు పార్టీలో శక్తిమంతమైన నేతగా ఎదిగారు.

సంపాదకీయం

ఔరా..!

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. యోగేంద్రయాదవ్ లాంటి ఎన్నికల గణాంక స్పెషలిస్టులు (సిఫాలజిస్టులు) మన రాష్ట్రానికొచ్చి ఎన్నికల తేదీకి నలభై రోజుల ముందు నుండే ఏరులై పారుతున్న మద్యాన్ని గణించి, ఆనకట్టల పునాదుల్ని కదిలిస్తున్న అవినీతి లెక్కలు గుణించి, సదరు ఆనకట్టల పైనుండి దుంకుతున్న నోట్లకట్టలు లెక్కించి మన తెలంగాణ 'సామర్థ్యాన్ని' వెల్లడించడం మనకు 'గర్వ కారణమే'. ఏమైనా సామ్రాట్‌కున్న వెసులుబాటు సామంతరాజులకు ఉండదు. రాష్ట్రాల కడుపులు కొట్టి, రాజ్యాంగ ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బ తీసింది బీజేపీ. రాష్ట్రాల ఆదాయాన్ని కైంకర్యం చేస్తూ జీఎస్టీ తెచ్చింది. 2017 జూలై నుండి కేంద్రం వద్ద లక్షల కోట్ల రూపాయలు జీఎస్టీ రూపంలో సంపద పోగుబడింది. సేల్స్‌టాక్స్ రాష్ట్రాలకున్న ఏకైక ఆదాయ వనరు. దాన్ని కబ్జా చేసి పోగేసుకున్న నిధియే అది. ఇటు వంటి ఎన్నింటినో కలిపి మోడీ ఘనకార్యాల క్యాంపెయిన్‌ను నిర్వహించబోతున్నారు. మోడీ కటౌట్లతో అలంకరించిన వాహనాలు దేశంలోని 765 జిల్లాలు తిరుగుతాయి. జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారుల నుండి కింది అధికారులు దానిలో కూర్చొని పంచాయతీల వరకు డప్పుకొట్టి ప్రచారం చేస్తారట. విపక్షాలు విమర్శించడమే కాదు, ఇది చట్ట విరుద్ధమని మాజీ ఐఏఎస్ అధికారులు 70మందికి పైగా రాష్ట్రపతికి విన్నవించారు. ఈ 'రథ్ ప్రభారీలు' విషయం విని, చదివి దేశం యావత్తు 'ఔరా' విస్తుపోతున్నది. వ్యవ హారం అక్కడితో ఆగలేదు. సాయుధ దళా ల్లో పనిచేసేవారికి ఏడాదికి రెండు నెలలు సెలవులిస్తారు. ఆ సమయంలో వారిని వట్టిగా ఉంచడం ఎందుకు అనుకున్నాడో ఏమో మోడీ సాబ్ వారికి 'సైనిక దూత' లని పేరుపెట్టి వారివారి ఊళ్లలో మోడీ ప్రభుత్వ ప్రచారం చేయాలని ఒక సర్క్యులర్ విడుదల చేశారు. సైన్యాన్ని నేరుగా ప్రభుత్వ ప్రచారకులుగా వాడుకోవడం మన రాజ్యాంగానికే వ్యతిరేకం. రక్షణశాఖ పైత్యం మరో వైపరీత్యానికి దారితీస్తోంది. దేశవ్యాపితంగా 822 సెల్ఫీపాయింట్లు ఏర్పాటు చేస్తారట. మోడీ ప్రభుత్వం సైనికపరంగా సాధించిన విజయాలను పెద్ద పెద్ద హోర్డింగుల్లో పెడతారట. వాటిలో మోడీ బొమ్మ తప్పనిసరిగా ఉండాలని రక్షణ శాఖ పేర్కొంది. భారతదేశంలో గత 75 ఏండ్లలో కనీవినీ ఎరు గని ఇటువంటి వింతలను చూసి దేశం ఔరా అని నోరు నొక్కుకుంటోంది. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అనే మాటను జర్రంత మార్చి సామ్రాటే తలుచుకుంటే ఓట్లకు కొరవా అని చదువు కుంటే పై విషయాలన్నీ అర్థమవుతాయి.



దుబ్బాక, హుజురాబాద్‌లలో గెలుపు, జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో దేశ హోంమంత్రే వచ్చి హైదరాబాద్ ఓల్డ్ సిటీపై సర్జికల్ స్ట్రైక్ చేస్తామనడం వంటి వికృత చేష్టలతో ఓట్లు పోలరైజ్ చేశారు. తమ సీట్లను నాలుగు పదులు దాటించుకున్నారు. కర్నాటక అయిపోయింది. ఇక తెలంగాణే తమ లక్ష్యం అని ఢిల్లీ నాయకుల నుండి గల్లీ నాయకుల వరకు ఊదరగొట్టారు. ఒక 'చేరికల కమిటీ' వేశారు. బీఆర్ఎస్ నుండి దొల్లుకుంటూ వచ్చి కాషాయ తీర్థం పుచ్చుకున్నాయనే దానికి చైర్మెన్. నేటి పరిస్థితేమిటంటే బీజేపీ నుండి బయటటికి పోయే వారే తప్ప లోనికొచ్చే వారే దొరకట్లేదు. ఈ వివరాలు రోజూ మీడియాలో చూస్తున్నాం. బయటికి పోయే వారి లిస్టు ఇంకా చాంతాడంతుంది.

మునుగోడు ఉప ఎన్నికల్లో వామపక్షాలు తీసుకున్న లైనే నేటి బీజేపీ దుర్గతికి కారణమని ఆలోచనా పరులెవరికైనా అర్థమౌతుంది. నిరం తరం బీఆర్ఎస్ కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీ వ్యతిరేక విధానాలపై పోరాడుతున్నా మునుగోడులో బీఆర్ఎస్‌ను బలపరిచాయి. కేవలం ఆ ఓట్లతోనే బీజేపీ మునుగోడులో ఓడింది. అదే జరి గుండకపోతే రాష్ట్రంలో సీన్ వేరే ఉంటుండే. 'వీరి బలమెం తం'టూ వామపక్షాలను గేలిచేసే వారికి ఆచరణలో ఇచ్చిన సమాధానం ఏమంటే 'కాషాయ సునామీ నుండి తెలంగాణను కాపాడగలిగింత' అని.

మునుగోడు ఉప ఎన్నికల్లో వామపక్షాలు తీసుకున్న లైనే నేటి బీజేపీ దుర్గతికి కారణమని ఆలోచనా పరులెవరికైనా అర్థమౌతుంది. నిరం తరం బీఆర్ఎస్ కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీ వ్యతిరేక విధానాలపై పోరాడుతున్నా మునుగోడులో బీఆర్ఎస్‌ను బలపరిచాయి. కేవలం ఆ ఓట్లతోనే బీజేపీ మునుగోడులో ఓడింది. అదే జరి గుండకపోతే రాష్ట్రంలో సీన్ వేరే ఉంటుండే. 'వీరి బలమెం తం'టూ వామపక్షాలను గేలిచేసే వారికి ఆచరణలో ఇచ్చిన సమాధానం ఏమంటే 'కాషాయ సునామీ నుండి తెలంగాణను కాపాడగలిగింత' అని.

అంగలార్చుకుంటూ బీజేపీ వైపు పరుగులెత్తిన వారంతా నేడు అటూ ఇటూ పరిగెత్తి కండువాలు మార్చుకుంటూంటే రాష్ట్ర ప్రజలు విస్తుపోయి 'ఔరా' అని చూస్తున్నారు. ఒక నేత కార్మికుడు వివిధ పార్టీ చర్చించుకుంటున్న ప్యానల్ డిస్కషన్ వద్దకెళ్లి తాను కష్టపడి తయారు చేసిన కండువాను వారి ముందు పెట్టాడట! దాని ప్రత్యేకత ఏమంటే ఏ పార్టీ వాండ్లు వేసుకుంటే వారి రంగులోకి మారుతుందట! ఇది జోకే అయినా నేటి పరిస్థితికి అద్దం పట్టట్లేదా?

నేడు మన రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు, ప్రజా సమస్యలు చర్చలోకొస్తున్న స్థితే లేదు. ప్రజల కోసం తపించే వారి గొంతులు జీరపోతున్నాయి. నోట్లకట్టల మాయాబజార్‌లో మం త్రాలు తెలీని, తాంత్రికులు కాలేని మానవులుగా మిగిలిపోరాదంటే పెద్దఎత్తున రాష్ట్రంలో వర్గపోరాటాలను నిర్మించడమొక్కటే మార్గం. ■

సమగ్ర హిందూత్వం - నిజమైన సామాజిక న్యాయం



హరీష్ ఎస్. వాన్‌ఖెడే

గత నాలుగు దశాబ్దాల సరళీకరణ విధానాలు కొత్త కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించాయి. పట్టణ మధ్య తరగతిని పెంచాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో సాంకేతిక నిపుణులుగా అనేక మంది ప్రవాస భారతీయులు కొలువు తీరారు. అయితే ప్రస్తుతం మన దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని ఇవి కనపడ నీయకుండా చేస్తున్నాయి. దేశంలోని పెద్ద జనాభా అత్యంత వెనుకబడ్డ కులాలకి (ఈబీసీ) సంబంధించిన వారుగా ఉన్నారు. దేశ అభివృద్ధి ఫలాలు వీరికి అందటం లేదు. ఈబీసీల్లో అత్యధికులు గ్రామాల్లో నివసిస్తున్నారు. చివరికి ఎన్నికల విధానాల అంచున నివసిస్తున్నారు. తక్కువ ఆదాయాల్లో నివసిస్తుంటారు. వర్గ అసమానతలు, విద్యాపరమైన వెనుకబాటుతనాన్ని అంచనా వేసేందుకు, జనాభా గణాంక వివరాల ప్రాతిపదికన వివిధ కులాలు, మతాల లెక్కలు అధ్యయనం చేయడానికి 1955లో కాకా కేల్కర్, 1980లో మండల్, 2006లో సచార్ కమిషన్‌లను ఆనాటి ప్రభుత్వాలు నియమించాయి. వాటి అధ్యయనంపై ఆధారపడే చట్టపరంగా ఎటువంటి చర్యలు తీసుకోవాలో సామాజికంగా వెనుకబడ్డవారికి ఏ విధంగా రక్షణ కల్పించాలో తేలుతుంది.

ఇటీవల బీహార్ ప్రభుత్వం విడుదల చేసిన కుల గణాంక నివేదిక (2023) జనాభాలో వెనుకబాటుకు గురైన ప్రజలు ఎవరు? దానికి కారణాలేంటి? బీసీల్లో వెనుకబాటుకు కారణాలేంటి? వాటికి పాలనా పరంగా ఎటువంటి చర్యలు చేపట్టాలి వంటి వాటిని ఆ నివేదిక పేర్కొంది. ఆ నివేదిక ప్రకారం ఓబీసీ.లు 27.12 శాతం ఉండగా, అత్యంత వెనక బడిన కులాలు (ఈబీసీలు) 36.01 శాతం. మొత్తంగా వెనక బడ్డ కులాలు బీహార్ జనాభాలో 63.13 శాతం. దళితులు, ఓబీసీ, ఈబీసీలు తక్కువ ఆదాయాలొచ్చే వ్యవసాయ కార్మి కులుగాను, పట్టణ కార్మికులుగాను బతుకులీడుస్తున్నారు.

అంతకుముందు భూ యజమాన్యాల గురించి చేసిన అధ్యయనంలోనూ సామాజికంగా ధనిక కులాలైన బ్రాహ్మ ణులు, భూమిహారు, రాజ్‌పుత్‌లు బీహార్‌లోని అతి పెద్ద భూ యజమానులుగా ఉండగా, సంఖ్యారీత్యా బలంగా వున్న ఓబీసీ, ఈబీసీలు భూ యాజమాన్యంలోనూ, ఇతర ఆర్థిక సౌకర్యాలలోనూ చాలా బలహీనంగా ఉన్నారని తేలింది.

బీహార్ సర్వే అక్కడి ప్రభుత్వం కొన్ని పాలనాపరమైన చర్యలకుపక్రమించేలా చేయడమే కాక జాతీయస్థాయిలో ఒక పెద్ద చర్చకు దారితీస్తుంది. అధిక ఓబీసీ జనాభా ఉన్న యూపీ, మహారాష్ట్ర, హర్యానాలో ఇలాంటి సర్వేల కోసం ఆందోళనలు రేగవచ్చు. వాస్తవానికి ఆ రాష్ట్రాల్లో అటువంటి సర్వేలు ఇబీసీల కదలికల్ని వేగవంతం చేసి ఆ రాష్ట్రాల శాసనసభల్లో వారి ప్రాతినిధ్యాన్ని పెంచాలని పెట్టుబడిదారీ వ్యవస్థలో వారి వాటా కోసం డిమాండు ముందుకు రావచ్చు. ప్రస్తుతం నిద్రాణంగా ఉన్న సామాజిక న్యాయం డిమాండును ప్రతిపక్ష పార్టీలు ముందుకు తెచ్చి బీజేపీ 'హిందూత్వ' పాలనకు సవాలు విసరొచ్చు. ప్రస్తుతం సామాజిక న్యాయం పేరున జరుగుతున్న రాజకీయాలను అట్టడుగునున్న ఇబీసీలు నిజమైన వారసులుగా ఉద్యమంతో ముందుకొస్తాయి.

సాంస్కృతిక ఎత్తుగడల ద్వారా, శక్తివంతమైన సోషల్ ఇంజనీరింగ్ చర్యల ద్వారా మితవాద బీజేపీ గత రెండు దశాబ్దాల్లో ఇబీసీలను బాగా కదిలించగలిగింది. ఉత్తర భారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడం వెనుక ఈ ఇబీసీలున్నారు. బీజేపీ అగ్రకులాల రాజకీయ పార్టీ అనే విమర్శను దాంతో అది వదిలించుకుంది. దాంతో సమగ్ర హిందూ (ఇంక్లూజివ్ హిందూత్వ) ను వివిధ సాంస్కృతిక చర్యలు సామాజిక ఆచారాలు, ఆయా కులాల్లోని అత్యున్నత నాయకులను ముందుకు నెట్టి అది సాధించగలిగింది.

ముఖ్యంగా యాదవులు మిగిలిన వారి పదవులను కూడా దోచుకుని రాజ్యాన్ని దోచు కుందన్న బీజేపీ విమర్శకు ఇబీసీలు బాగా ఆకర్షితులైనారు. కులాలకతీతంగా బీజేపీ గ్రామీణ పేదలకు, పట్టణ కార్మిక వర్గానికి సాయపడిందనే వాదనకు ఆధారాల్లేవని వివిధ ఈబీసీలకు అదిచ్చిన హామీలు అమలుకు నోచుకోకపోవడాన్ని బట్టి చూడవచ్చు. ఇబీసీలు ఒక బలమైన సామాజిక, రాజకీయ శక్తిగా ఆవిర్భవించి సాంప్రదాయక సంస్థలను ప్రజాతంత్రీకరిస్తుందనేది నిజం కాదని బీజేపీ పాలన రుజువు చేసింది.


ప్రభుత్వ రంగ సంస్థల్లో అత్యంత వెనుకబడ్డ కులాల సరైన ప్రాతినిధ్యం బీజేపీ పాలనలో రాలేదు. ఒక విషయం స్పష్టం. ఈబీసీల వంటి వెనకబడ్డ కులాలకు కొద్దిగా నైవేద్యం పెడుతున్న కీలకమైన సంస్థలన్నీ ఆధిపత్య కులాల చేతిలోనే ఉన్నాయి.

ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పైపైన సర్వే చేసినా మనకి కన్పడే వాస్తవమేమంటే జ్యుడీషియరీ, దేశంలోని అత్యున్నత స్థాయి అధికార యంత్రాంగం, మీడియా, సాంస్కృతిక రంగాలన్నీ ఆధిపత్య కులాల చేతిలోనే ఉన్నాయి. పేదలు, అత్యంత బలహీన కులాలకు సంబంధించిన బాధలను పట్టించుకోవడంలో ప్రభుత్వ సంస్థలు వైఫల్యం చెందాయి.

బీహార్ కులసర్వే నివేదిక మితవాద శక్తుల గుండెల్లో రైళ్లు పరిగెట్టేలా చేస్తోంది. దానికి ప్రధాన కారణం అత్యంత వెనుకబడ్డ కులాల్లో ఇది చైతన్యాన్ని రగిలిస్తుంది. రాజ్యం తమకు దక్షిణగా నిలవాలని వారు డిమాండు చేసేలా చేస్తోంది. ఇబీసీలకు సమాన ప్రాతినిధ్యం, వారి దారుణ వర్గ పరిస్థితులు, రాజకీయంగా నాయకత్వ స్థానాల్లో లేకపోవడం, వంటి వాటిని ప్రతిపక్ష పార్టీలు ముందుకు తేవడం ద్వారా బీజేపీ ఇంతకాలం చెప్పుకుంటున్న 'సమ్మిళిత అభివృద్ధి' డొల్లతనం బయటపడుతుంది.

బీహార్ కులసర్వే నివేదిక మితవాద శక్తుల గుండెల్లో రైళ్లు పరిగెట్టేలా చేస్తోంది. దానికి ప్రధాన కారణం అత్యంత వెనుకబడ్డ కులాల్లో ఇది చైతన్యాన్ని రగిలిస్తుంది. రాజ్యం తమకు దక్షిణగా నిలవాలని వారు డిమాండు చేసేలా చేస్తోంది. ఇబీసీలకు సమాన ప్రాతినిధ్యం, వారి దారుణ వర్గ పరిస్థితులు, రాజకీయంగా నాయకత్వ స్థానాల్లో లేకపోవడం, వంటి వాటిని ప్రతిపక్ష పార్టీలు ముందుకు తేవడం ద్వారా బీజేపీ ఇంతకాలం చెప్పుకుంటున్న 'సమ్మిళిత అభివృద్ధి' డొల్లతనం బయటపడుతుంది.

నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ సంస్థలన్నీ పట్టణ ధనిక సామాజిక గ్రూపుల వారి ఆధ్వర్యంలో ఉండటం వల్ల దళిత, బహుజన ప్రజలు అట్టడుగుకు నెట్టి వేయబడ్డామనే భావనలో ఉన్నారు. బీహార్ సర్వే విడుదల ప్రభుత్వ ప్రయివేటు సంస్థల అధికార నిర్మాణాల్లో తమకు మరింత సమానమైన వాటా దక్కాలనే డిమాండు ముందుకొస్తుంది. సామాజికంగా పై నుండే వారు అతి పెద్ద భూ యజమానులుగా ఉండటంతో పాటు సాంప్రదాయకంగా ఉండే ఫ్యూడల్ అధికారాలు, మధ్య తరగతి వారికుండే విశేషాధికారాలు తరతరాలుగా సంక్రమించిన శక్తివంతమైన సామాజిక సంబంధాలు వారికుపయోగపడ్తున్నాయి. గతం నుండి ఉంటున్న పద్ధతిలోనే వీరు విధానాలను రూపొందించే అధికార వర్గాన్ని, సీఈఓలను, వ్యాపారవేత్తలను, సామాజిక, సాంస్కృతిక ప్రభావాలను వేసేవారిని ఈ నయా ఉదారవాద విధానాలు సృష్టిస్తున్నాయి. అట్టడుగునున్న ఈ ప్రజా సమూహాలకు ఉపయోగపడే రీతిలో ఉదార విధానాలు నిర్మించిన నిర్మాణాలను ప్రజాస్వామికీకరణ చేసే ప్రయత్నాలు చాలా తక్కువగా జరిగాయి.



ఆందోళనకరమైన అంశమేమంటే సామాజిక న్యాయం కోసం పోరాడే శక్తులుగా చెప్పుకునే ఆర్‌జేడీ యునైటెడ్ బీహార్‌లోనూ, సమాజ్‌వాది పార్టీ యూపీలోనూ పగ్గాలు చేపట్టిన సందర్భాల్లో కూడా బాగా వెనుకబడ్డ ప్రజలకు విధానాల రూపకల్పనలో గాని, ఆర్థికాభివృద్ధిలో గాని, పెద్ద ఉపయోగం కలుగలేదు. సైద్ధాంతికమైన అంశాలపై తప్ప ఈ అట్టడుగు ప్రజలకు సంబంధించిన కీలకాంశాలను ఈ పార్టీలు పట్టించుకున్నది లేదు. నిరంతర ఆధిపత్యంలో ఉన్న సామాజిక వర్గాలను వ్యతిరేకించేందుకు ప్రజల్ని తయారు చేసుకున్నదీ లేదు.

సాధారణంగా రాజకీయ చర్చలో ఈబీసీలను పేద కష్ట జీవులతో కలిపి ప్రభుత్వాలు అందించే సంక్షేమ ఫలాలు అందుకునే వారిగా భావిస్తున్నారు. ఇబీసీలు రాజ్యానికి, అంటే ఆధిపత్య కులాల దాతృత్వంపై ఆధారపడే వారిగా మిగలడం ప్రజాస్వామ్య నిర్మాణానికే నష్టం చేస్తుంది. ప్రస్తుతం బీహార్, యూపీల్లో ఇబీసీల గొంతులు విడివిడిగా చిన్న కుల సంస్థలుగా చీలి ఉన్నాయి. అణగారిన కులాల సమస్యలు పరిష్కారం చేసే దిశలో అవి లేవు. ఈ దశలో సర్వే నివేదిక ఈ కులాలను స్వతంత్ర రాజకీయ వేదికలుగా మారేలా ఒత్తిడి చేస్తుంది. ఇది హిందూత్వ పునాదులను కదిలిస్తుంది. అంతేకాదు, ఇంతకాలం సామాజిక న్యాయం కోసం పోరాడేవారిగా ఫోజులు పెడ్తున్న వారి అసలు రూపాన్ని బహిర్గతం చేస్తుంది. ఇబీసీల నిజమైన ఆవేదనను అర్థం చేసుకుని వారి సమస్యలకు న్యాయబద్ధమైన పరిష్కారం చూపేలా ఆ సామాజిక న్యాయం కోసం నిలబడ్డామని చెప్పుకునే వారిపై ఒత్తిడి చేస్తుంది. సామాజికంగా ఆధిపత్యంలో ఉన్న వారిపై ఒక ప్రజాస్వామ్యయుతమైన ఉప్పెనను లేవదీస్తుంది. ఆర్‌జేడీ, ఎస్‌పీ, బీఎస్‌పీ, డిఎంకే వంటి పార్టీలు తాము సామాజిక న్యాయం కోసం నిలబడ్డామని చెప్పుకుంటూ ఉంటాయి. అవి తమ విశ్వాసాన్ని మరోసారి పునరుద్ఘాటించి వారి మేనిఫెస్టోలో రాజకీయ కార్యకలాపాల్లో ఈబీసీలకు తగు స్థానాన్ని కల్పిస్తాయని ఆశిద్దాం. ఇబీసీల కోసం నిలబడ్తున్న శక్తులతో ఐక్య కార్యాచరణకు పైపార్టీలు తగు చొరవ చూపాలి.

సాధారణంగా రాజకీయ చర్చలో ఈబీసీలను పేద కష్ట జీవులతో కలిపి ప్రభుత్వాలు అందించే సంక్షేమ ఫలాలు అందుకునే వారిగా భావిస్తున్నారు. ఇబీసీలు రాజ్యానికి, అంటే ఆధిపత్య కులాల దాతృత్వంపై ఆధారపడే వారిగా మిగలడం ప్రజాస్వామ్య నిర్మాణానికే నష్టం చేస్తుంది. ప్రస్తుతం బీహార్, యూపీల్లో ఇబీసీల గొంతులు విడివిడిగా చిన్న కుల సంస్థలుగా చీలి ఉన్నాయి. అణగారిన కులాల సమస్యలు పరిష్కారం చేసే దిశలో అవి లేవు. ఈ దశలో సర్వే నివేదిక ఈ కులాలను స్వతంత్ర రాజకీయ వేదికలుగా మారేలా ఒత్తిడి చేస్తుంది. ఇది హిందూత్వ పునాదులను కదిలిస్తుంది.

'ఇండియా' కూటమి ఈ విషయ ప్రాధాన్యతన వెంటనే అర్థం చేసుకుని జాతీయ స్థాయిలో తాము కుల సర్వే చేపడ్తామని ప్రకటించింది. ఇండియా కూటమి ఇబీసీ నాయకులకు సరైన స్థానాలు కల్పించి కొత్త రాజకీయ నిర్ణయాల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తే ఆర్థిక సాధికారత, సామాజిక న్యాయం అందుకోగల్గుతారు. అటువంటి విశ్వాసపాత్రమైన చర్యలే హిందూత్వ రాజకీయాలను, పెట్టుబడిదారీ అనుకూల ఎజెండాను ధ్వంసం చేయకలదు. ■

'ఇండియా' కూటమి ఈ విషయ ప్రాధాన్యతన వెంటనే అర్థం చేసుకుని జాతీయ స్థాయిలో తాము కుల సర్వే చేపడ్తామని ప్రకటించింది. ఇండియా కూటమి ఇబీసీ నాయకులకు సరైన స్థానాలు కల్పించి కొత్త రాజకీయ నిర్ణయాల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తే ఆర్థిక సాధికారత, సామాజిక న్యాయం అందుకోగల్గుతారు. అటువంటి విశ్వాసపాత్రమైన చర్యలే హిందూత్వ రాజకీయాలను, పెట్టుబడిదారీ అనుకూల ఎజెండాను ధ్వంసం చేయకలదు.

అనువాదం : ఆరెస్బీ

ఓటరు.. తస్మాత్ జాగ్రత్త!

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా నేటికీ దేశ ప్రజల్లో నూటికీ మూడోవంతు జనాభాకు మూడూ పూటలా తిండి లేదు. సగం మందికి పైగా మంచినీరు లేదు. ఇక విద్యా, వైద్యం అందని ద్రాక్షే. ఇటువంటి పరిస్థితుల్లో 1952 నుంచి దేశవ్యాప్తంగా పార్లమెంటు , వివిధ రాష్ట్రాల్లో ప్రతీ ఐదేండ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజాబద్ధంగా అనేక పార్టీలు విజయం సాధించి, ప్రభుత్వాలు ఏర్పాటు చేసి, పాలన కొనసాగిస్తున్నాయి. అయినప్పటికీ అనేక మందికి కనీస అవ సరాలు అందక పోవడానికి కారణం ఏమిటి!? ఇది ఆందోళన కలిగించే అంశం. దేశంలో ఉన్న దాదాపు అన్ని రాజకీయపార్టీలు (వామపక్షాలు మినహా) ఓట్లు దండుకునే క్రమంలో దేశ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులకు మించి ఒకరికి మించి మరొకరు తాయిలాలు ప్రకటిస్తూ ఓటర్లకు గాలం వేసి గద్దెనెక్కుతున్నారు. పథకాలతో ప్రజలు ఎంతోకొంత ఉపశమనం పొందుతున్న మాట వాస్తవం. కానీ వారికే కొనుగోలు శక్తి కలిగించేలా చేయడం ద్వారా మాత్రమే వారి అభివృద్ధి సాధ్యమవుతుందన్న విషయం పాలకులు గ్రహించాలి. సాధారణంగా ఎన్నికల సమయంలో పేదలకు బడుగు బల హీన వర్గాలకు కొన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడం, ప్రచారంలో ఉచిత పథకాలు ప్రకటించడం సహజం. కానీ ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటుందో వారి కింది స్థాయి లీడర్లు, కార్యకర్తలకే ఈ పథకాలు ఉపయోగపడుతున్నా యనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇకపోతే పాలకులు ఇచ్చే హామీ లు, వాగ్దానాలు అమలు చేసే క్రమంలో వివిధ రాష్ట్రాల ఖజానాలు ఖాళీ అయి, వివిధ బ్యాంకులు, కేంద్రం చుట్టూ ప్రతీరోజూ అప్పుల కోసం తిరిగే పరిస్థితి ఉంటుంది. ఉన్న ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం (లేదా) అమ్మటం ద్వారా నిధులు సమకూర్చే విధానం పరిపాటిగా మారుతున్నది. ఇది దేశానికి, రాష్ట్రాలకు అత్యంత ప్రమాదకరం.



ముఖ్యంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నది. దేశంలో ఎన్నడూ లేనంతగా "నిరుద్యోగం" తాండ విస్తుంది. అధిక ధరలు సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నాయి. ఎన్నికలవేళ ప్రజల జీవితాల్లో నిజమైన సుస్థిర అభివృద్ధికి విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇచ్చే కార్యక్రమాలు రాజకీయ పార్టీలు తమ అజెండాలో చేర్చాలి. ముఖ్యంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే పథకాలు ప్రకటించాలి. అధిక ధరలకు కళ్లెం వేసే నియంత్రణ చట్టాలకు హామీ ఇవ్వాలి. దేశంలో ప్రతీ సంవత్సరం కొన్ని లక్షల మంది యువత గ్రాడ్యుయేషన్, బి.టెక్ వంటి చదువులు చదివి బయటకు వస్తుంటే, వారి బతుకులకు భరోసా ఇచ్చే ఉద్యోగ ఉపాధి అవకాశాలు రూపొందించాలి. ముఖ్యంగా పారిశ్రామిక, సేవా రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులు పెట్టి, మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఇక వ్యవసాయ రంగంలో రైతులకు, కౌలు రైతులకు లాభసాటిగా ఉండే పథకాలకు శ్రీకారం చుట్టాలి. అసంఘటిత కార్మికుల జీవితాలను మెరుగుపరిచే విధంగా చూడాలి. మద్యం, డబ్బులు, వివిధ రకాల బహుమతులకు ఆశపడకుండా తమ భవిష్యత్తును తామే స్వతంత్రంగా ఓటు ద్వారా నిర్మించుకోవాలి. అంకెలు ర్యాంకులు సంఖ్యలు చూసి భుజాలు చరుచుకోరాదు. నిజంగా అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందితే, ఇంకా ఉచితాలు, రాయితీలు ఎందుకు!? ఆకలి సూచిలో ఎలా ఉన్నామో అంతర్జాతీయ సర్వేలు చెబుతున్నాయి కదా!? అందుకే వాస్తవాలు అందరూ గ్రహిం చాలి. మబ్బుల్లో విహరించరాదు.

ముఖ్యంగా రాజకీయ పార్టీలు నేడు దేశంలో ఉన్న నిరుద్యోగం, అధిక ధరలు, వ్యవసాయ సంక్షోభం, అసంఘటిత కార్మికుల సమస్యలు, ఉద్యోగుల సీపీఎస్ సమస్యలు, పర్యావరణ పరిరక్షణ, మహిళల ఇబ్బందులు, ఆకలి కేకలు, మంచినీరు, విద్యా, వైద్యం వంటి విషయాలపై పరిష్కారం కోసం ఒక పటిష్టమైన అజెండాతో భవిష్య త్తుకు భరోసా ఇచ్చే ప్రణాళికలతో ప్రజల ముందుకు రావాలి. బడా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వరంగ సంస్థలను ధారాదత్తం చేసే పార్టీలకు చెల్లు చీటినివ్వాలి. ప్రోత్సాహకాల పేరుతో బకాయిలు మాఫీ వంటి చర్యలు మానుకోవాలి. ప్రజలు, ఓటర్లు కూడా దీర్ఘకాలిక మంచి భవిష్యత్తు ఇచ్చే పార్టీలకు మద్దతు తెలపాలి. అంతేకానీ తాత్కాలిక ఉపశమనాల వలలో చిక్కుకుని భవిష్యత్తును ఛిద్రం చేసుకోరాదు. అందుకే ఓటరు మహాశయా..తస్మాత్ జాగ్రత్త!

- రావుశ్రీ

ప్రతిఘటన నిత్యం సత్యం

అణచివేతలు - ఆక్రమణలు ఉన్నప్పుడు తిరుగుబాట్లు - ప్రతిఘటనలు తప్పవు. అవి హింస అయితే ఇవి కూడా హింస అవుతాయి. రాజ్యహింసకు ప్రతిహింస చెలరేగకమానదు. ఆత్మ రక్షణా పోరాటం అనేది మానవ స్వభావంలోనే ఉంటుంది. ఒక్కో సారి ఈ దాడులు– ప్రతిదాడులు చిలికి చిలికి గాలివానగా మారి యుద్ధరూపాలుగా సంతరించుకుంటాయి కూడా.



కె. శాంతారావు
9959745723

అందుకే ఇజ్రాయల్ - పాలస్తీనా యుద్ధ పోరును తక్షణం భేషరతుగా శాంతింపజేయాలని ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది. యుద్ధం జరుగుతున్న వేళ అమాయిక ప్రజలు వేలాదిగా ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులు గావడం, కొంపా గోడు వదలి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ పారిపోవడం, చూస్తుండగానే కట్టడాలు నేలమట్టం కావడం అంతా క్షణాల్లో జరిగిపోతుంది. ఈ భయంకర విధ్వంసం క్షణక్షణం పెరగడమేకాదు, ఇతర ప్రాంతాలకూ ఈ యుద్ధం విస్తరిస్తుంది. యుద్ధజ్వాలలు, దావాగ్నిలా మారకముందే ఆర్పడం విచక్షణకు పరాకాష్ట.

శవాలపై బొగ్గులు ఏరుకున్న చందంగా కొందరు నేతలు తమ స్వార్థ ప్రయోజనం కోసం ఈ యుద్ధ మంటల్లో సైతం చలికాచుకోడానికి వెనుకాడరు. అందుకే అన్నాడు మహాకవి శ్రీశ్రీ 'బలవంతుడు బలహీనుల దుర్బలు గావించిరి.నరహంతకులే ధరాధిపతులై చరిత్ర ప్రసిద్ధి కెక్కిరి'

ఎప్పటికప్పుడు వారు తమ పబ్బం గడుపుకుంటూ మీనమేషాలు లెక్కిస్తుంటారు. ఉగ్రవాదాన్ని కేవలం ఆయుధాలతో అణచివేయగలమని మూర్ఖత్వంతో వెర్రిప్రేలా పనులు పేలుతుంటారు. ఉగ్రవాదం పుట్టుకకు, పెరుగుదలకు తామూ పరోక్ష కారకులమన్న విషయమే తెలుసుకోరు.

ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటిరెస్ ఈ విషయంలో సరిగానే స్పందించారు. ఇజ్రాయిలుపై పాలస్తీనా ప్రజాపోరు సంస్థ 'హమాస్' దాడి (20 రోజుల క్రితం) ఒక్కసారిగా జరిగింది కాదని, శూన్యం నుండి అకస్మాత్తుగా ఊడిపడిన పిడుగుపాటు అసలేకాదని కుండబద్దలు కొట్టారు. ఐ.రా.స దినోత్సవ సందర్భంగా భద్రతా మండలి మంత్రుల సదస్సులో ఆయన మాట్లాడుతూ తన ఆవేదనను వెలిబుచ్చారు.

'ఇజ్రాయిల్ ఆక్రమణలతో గత 56 ఏళ్ళుగా పాలస్తీనియులు అణచివేతకు గురౌతున్నారు. సెటిల్‌మెంట్లు, దందాలు, భయపెట్టే హింసాత్మక చర్యలతో వారు తమ భూమిని కోల్పోయారు. ఇళ్ళు లేక నిరాశ్రయులయ్యారు. తమ సమస్యకు న్యాయమైన పరిష్కారం లభిస్తుందనే ఆశను వారు కోల్పోయారు. అందుకే హమాస్ దాడులు. అయితే దాడులు పరిష్కారం కాదు. అదే సందర్భంలో హమాస్ దాడులు చేసిందనే పేరుతో పాలస్తీనియులను యుద్ధరూపేణా శిక్షించాలని ఇజ్రాయిలు నేతలు భావించడం సరికాదు. సమర్థనీయంకాదు, తక్షణం యుద్ధాన్ని ఆపి శాంతిని నెలకొల్పండి అని విజ్ఞప్తి చేసారు. ఇరుదేశాల ఏర్పాటు (ఇజ్రాయిల్–పాలస్తీనా) మాత్రమే సమస్యకు పరిష్కారమని ఆయన సూచించారు.

యూదు వ్యతిరేకతను, ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టే స్వమత ఛాందసశక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని ఉద్బోధించారు. ఇజ్రాయిలు వారు తమ రక్షణ కోసం నిర్మాణాత్మ కంగా వ్యవహరించాలని, అదేవిధంగా పాలస్తీనియులు తమ స్వతంత్ర దేశ ఆకాంక్షలు నెరవేరేలా హమాస్ ఆచితూచి అడుగేయాలని కోరారు. ఉభయులు అంతర్జాతీయ ఒప్పందాలను గౌరవించి నడుచుకోవాలని, లేని పక్షంలో క్షణక్షణం గాజా పరిస్థితి యుద్ధ ఊబిలో కూరుకుపోతుందని హెచ్చరించారు. యుద్ధం పశ్చిమాసియా అంతటా విస్తరించే పెను ప్రమాదం ఎంతో దూరంలో లేదని, దగ్గర్లోనే పొంచి ఉన్నదని, మరిన్ని ప్రాణాలు బలికాకముందే మేలుకొమ్మని నేతలకు సూటిగానే చెప్పారు.

గాజాలో పౌరులు, పసిపిల్లలు నేలకొరగడం, కట్టడాలు నేలమట్టం కావడం క్షంతవ్యం కాదని అంటూనే పౌరులను రక్షించడం అంటే యుద్ధ ప్రాం తాలను ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు కట్టుబట్టలతో పారి పొమ్మని చెప్పడం కాదని చురకంటించారు. సరైన ఆశ్రయము, ఆహారం, నీరు, విద్యుత్, మందులు లేకుండా శరణార్థులు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు? కాగా ఆ శరణా ర్థుల శిబిరాలపై, ఆస్పత్రులపై కూడా బాంబులు వేయడం ఏం యుద్ధనీతి? ఏం మానవీయత? అని కూడా ఆక్రోశించారు.

బ్రెజిల్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఇజ్రాయిల్, పాలస్తీనా మంత్రులతో పాటు అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాల మంత్రులు పాల్గొనడం గమనార్హం

ఈజిప్టు–మధ్యధరా సముద్రం మధ్యన ఉండే పాలస్తీనీయుల గాజా ప్రాంతం 41 కి.మీ. పొడవు 20 కి.మీ. వెడల్పు గల చిన్న భూభాగం అది. కేవలం 23 లక్షల జనాభా. ఒంటె – గుడారం కథ మాదిరి యూదులు పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రా యిల్‌గా ఆక్రమించుకున్నారన్న విషయం ఎల్లరకూ తెలిసిందే. అమెరికా, దాని మిత్రదేశాలు పాలస్తీనాను గుర్తించకుండా కేవ లం ఇజ్రాయిల్‌ను మాత్రమే ఒక దేశంగా గుర్తిస్తూ 1948లో ఐక్యరాజ్యసమితిలో ప్రకటన చేయడమే సమస్యకు బీజం. తమ సొంత భూభాగంలోనే తాము పరాయి వాళ్ళుగా, పరాధీనులుగా బ్రతకడం ఎంత నరకమో అది అనుభవించేవారికే తెలుస్తుంది. ఇజ్రాయిల్ సైన్యం అవకాశం దొరికి నప్పుడల్లా పాలస్తీనీయులపై ఆంక్షలను, అణచివేతను ప్రయోగించడం పరిపాటైపోయింది. చివరకు గాజాలోని అల్‌అక్సా మసీదుకు వెళ్ళాలన్నా ఇజ్రాయిల్ సైన్యం అనుమతి తీసుకోవడం వారికి భరింప రాకున్నది.

కనుకనే దీనిని కేవలం రెండు మతాల మధ్య లేదా రెండు ప్రాంతాల మధ్య జరిగే పైపై ఘర్షణగా చూడరాదని, పాలస్తీనీయుల భౌగోళికమైన ఉనికి, అస్తిత్వం, ఆత్మగౌరవం, మానవ హక్కులు మిళితమైన ప్రధానమైన సమస్యగా పరిగణించాలనేది విశ్లేషకుల భావన. ఎక్కడైనా, ఎప్పు డైనా శాంతి భద్రత లతో జీవించే స్వేచ్ఛే నిజమైన స్వేచ్ఛ.

అయితే ఈ యుద్ధాన్ని వాడుకుని రానున్న ఎన్నికల్లో లబ్ది పొందాలని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు వ్యూహమని, అందుకే కాల్పుల విరమణకు ముందుకు రావడం లేదని వారు విమర్శిస్తున్నారు.

అక్టోబరు 7న, ఆకాశ మార్గాన, జలమార్గాన, భూ మార్గాన అకస్మాత్తుగా ఇజ్రాయిల్ పై హమాస్ ముప్పేట దాడి జరి గింది. అదీ బాంబుల తూటాల వర్షంతో. ఏం జరిగిందో తెలుసు కునేలోపునే జరగాల్సిందంతా జరిగిపోయింది. వందలాదిమంది నేలకొరిగారు. దాదాపు 200 మందిని బందీలుగా హమాస్ పట్టుకుపోయింది.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో నైపుణ్యం ఉండి, పెగాసిస్ గూఢ చర్యత్వానికి పెట్టని కోటగా నిలిచిన ఇజ్రాయిల్‌కు ఇప్పుడు ఇది మింగుడు పడటంలేదు. ఈ దాడి పట్ల ఇజ్రాయిలేకాదు యావత్ ప్రపంచమే నివ్వెరపోయింది. ఇజ్రాయిల్ పాలకుల నిర్లక్ష్యం అహంభావమే ఈ దాడికి కారణమని పరిశీలకులు దుమ్మెత్తిపోస్తున్నారు.

ఇజ్రాయిల్‌పై ఎప్పటికైనా దాడి చేయాలనే ధృఢ సంకల్పంతో హమాస్ ఉన్నది. గాలిగుమ్మటాలు (పారాగ్లైడర్) వంటి సాయంతో సహా ఆకాశమార్గాన వచ్చి, దాడిచేసి బందీలను పట్టుకుపోవాలనే ఎత్తుగడలతో హమాస్ ఉన్నట్టు, అందుకు సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్టు దాదాపు పదేళ్ళ క్రితమే వెబ్‌సైట్‌లో కథనం ప్రచురితమైంది. గతంలోని చిన్నచిన్న దాడులకంటే ఇది అనూహ్యమైన పెద్దదాడి. లెక్కలేని ఏమరుపాటుతనం తమ పాలకులకు ఎందుకు వచ్చిందని ఇజ్రాయిలు ప్రశ్నిస్తున్నారు.

దాడికి ప్రతీకారంగా ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రాంతం గాజా పై యుద్ధం చేస్తుంటే, హమాస్‌కు మద్దతుగా లెబనాన్, సిరియాల హిజ్బుల్లా మిలిటెంట్లు రంగంలోకి వస్తున్నారు. గాజాను పూర్తిగా ఆక్రమించి, హమాస్‌ను కనుమరుగు చేయాలని ఇజ్రాయిల్ భావిస్తుంటే, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు సన్నాయి నొక్కులు నొక్కుతూ వంతపాడుతున్నాయి.

ఇజ్రాయిల్ హెచ్చరికతో ఉత్తర గాజాలోని పదకొండు లక్షల ప్రజానీకం పిల్లా, మేకాతో దక్షిణ గాజావైపు ఆకలి దప్పులతో వలస పోవడం ఈనాటి మహావిషాదం.

ఆదిలో హమాస్ దాడి పట్ల వ్యతిరేకత వ్యక్తమైనా, క్రమేణా ఇజ్రాయిల్ భీకర యుద్ధదాడుల పట్ల జుగుప్స కలుగుతున్నది. నేతలు ఇంత అమానవీయంగా ఉంటారా! అన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అందుకే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయిల్ పర్యటన సందర్భంగా ఇజ్రాయిల్‌కు మద్దతునిస్తూనే, గాజాపై ఆక్రమణ మంచిది కాదని సలహా ఇచ్చారు. అగ్రదేశాల్లో ఇజ్రాయిల్ సంపన్న యూదుల పెట్టుబడుల దృష్ట్యా ఆ దేశాల మద్దతు తాత్కా లికంగా లభించినప్పటికీ, అంతిమంగా శ్రమించే మానవాళి, మానవత్వమే ప్రపంచ గతికి మూలం అని ఈ నేతలు ఎప్పటికి గ్రహిస్తారో.. ■

ఆదిలో హమాస్ దాడి పట్ల వ్యతిరేకత వ్యక్తమైనా, క్రమేణా ఇజ్రాయిల్ భీకర యుద్ధదాడుల పట్ల జుగుప్స కలుగుతున్నది. నేతలు ఇంత అమానవీయంగా ఉంటారా! అన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అందుకే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయిల్ పర్యటన సందర్భంగా ఇజ్రాయిల్‌కు మద్దతునిస్తూనే, గాజాపై ఆక్రమణ మంచిది కాదని సలహా ఇచ్చారు. అగ్రదేశాల్లో ఇజ్రాయిల్ సంపన్న యూదుల పెట్టుబడుల దృష్ట్యా ఆ దేశాల మద్దతు తాత్కా లికంగా లభించినప్పటికీ, అంతిమంగా శ్రమించే మానవాళి, మానవత్వమే ప్రపంచ గతికి మూలం అని ఈ నేతలు ఎప్పటికి గ్రహిస్తారో..



పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలి

- 31న వామపక్ష పార్టీల సంఘీభావ సభ, ప్రదర్శన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఆ యుద్ధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశాయి. పాలస్తీనాకు సంఘీభావంగా ఈనెల 31న ఉదయం పది గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ, అనంతరం ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించాయి. ఈ సభలో ప్రముఖులు, వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు ప్రసంగిస్తారు. ప్రజలు, ప్రజాతంత్ర వాదులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరాయి. రాష్ట్రంలోని వామపక్ష పార్టీల సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో డిజి నర్సింహారావు (సీపీఐఎం), ఎన్ బాలమల్లేష్ (సీపీఐ), హన్మేష్ (సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా), ఎన్ శ్రీనివాస్ (సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ), జెవి చలపతిరావు (సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ), జి రవి (ఎంసీపీఐయూ), సిహెచ్ మురహరి (ఎస్‌యూసీఐసీ), బి ప్రసాద్ (ఫార్వర్డ్‌బ్లాక్), జానకిరాములు (ఆర్‌ఎస్‌పీ), ప్రసాదన్న (సీపీఐఎంఎల్), రాజేష్ (సీపీఐ(ఎంఎల్) లిబరేషన్) తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. అమెరికా అండతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధకాండ, అమానుష దాడులను తీవ్రంగా ఖండించారు. పశ్చిమ దేశాల అండతో ఇజ్రాయిల్ ఈనెల ఏడు నుంచి పాలస్తీనాపై దాడులను ప్రారంభించిందని తెలిపారు. ఈ దాడులను తక్షణమే నిలిపేయాలంటూ ఐక్యరాజ్య సమితి అనేక తీర్మానాలు చేసినప్పటికీ, అమెరికా తన వీటో అధికారాన్ని ఉపయోగిస్తూ, కుట్రలకు తెగబడిందని విమర్శించారు. వేలాది మంది పాలస్తీనియన్లను హత్య చేసిందని పేర్కొన్నారు. పాఠశాలలు, ఆస్పత్రులపై సైతం దాడులు చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. చివరికి ఆహారం, తాగునీరు అందకుండా చేయడమే కాక ఇతర దేశాలు పాలస్తీనాకు పంపుతున్న సహాయాన్ని కూడా అందకుండా చేస్తున్నాయని తెలిపారు.

క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు జనరేటర్లకు కావాల్సిన ఇంధనాన్ని కూడా అడ్డుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఇప్పటికే మూడు వేల మంది చిన్నారులతో సహా ఏడు వేల మంది మరణించారని వివరించారు. 10 వేలకు పైగా గాయాలపాలయ్యారని తెలిపారు. లక్షల సంఖ్యలో శరణార్థులుగా మారారని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలన్నీ ముక్తకంఠంతో ఈ యుద్ధాన్ని ఖండిస్తున్నాయని తెలిపారు. ఈ యుద్ధాన్ని వెంటనే విరమించి పాలస్తీనా ఉనికిని గుర్తించాలని వారు డిమాండ్ చేశారు.

దేశభవిష్యత్ యువత చేతుల్లో ఉంది

- గవర్నర్ తమిళిసైసౌందరరాజన్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యానించారు. మన దేశం యువ దేశంగా అవతరించిదని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో భారత ప్రభుత్వ నెహ్రూ యువక కేంద్ర సంఘటన్, కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ, తెలంగాణ ప్రభుత్వం, సీఆర్‌పీఎఫ్, ఎన్‌ఎస్‌ఎస్, సీఎస్‌ఈ, నవోదయ విద్యాసంస్థలు తదితర సంస్థల ఆధ్వర్యంలో 'నామట్టి-నాదేశం' కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి మట్టి తెచ్చారనీ, అది ఢిల్లీలోని వార్ మెమోరియల్ నిర్మాణానికి ఉపయోగిస్తారని చెప్పారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ మూలంగానే దేశంలో హైదరాబాద్ విలీనమైందన్నారు. ఇప్పుడు తెలంగాణలో ఉందన్నారు. స్వాతంత్రోద్యమ కాలంలో సుభాష్ చంద్రబోస్ సేవలు గొప్పవనీ కొనియాడారు. బర్మా సింగపూర్, మలేసియా దేశాల నుంచి జనాన్ని పోగేసి బారత్‌లో అడుగుపెట్టేటప్పుడు భారతీయుల రక్తతర్పణతోనే స్వాతంత్రం రావాలని కోరుకున్నారని చెప్పారు. దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. ప్రధాని నరేంద్రమోడీ దార్శనీతతో ముందుకుసాగుతున్నామని వివరించారు. స్వాతంత్రోద్యమకారుల చరిత్రలు చదవాలని పిలుపునిచ్చారు. దేశానికి ప్రజలంతా అంకితం కావాలని అభిప్రాయపడ్డారు. పారామిలిటరీ దళాలు దేశాన్ని కాపాడుతున్నాయని అన్నారు. సీఆర్‌పీఎఫ్ అదనపు డైరెక్టర్ జనరల్ రవిదీప్‌సింగ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో నామట్టి-నాదేశం కార్యక్రమం నడుస్తున్నదన్నారు. 75వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఆజాదీకా అమృత్‌మహోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామాల నుంచి మట్టిని తెప్పించి ఢిల్లీలోని కర్తవ్య మార్గ్‌కు పంపిస్తున్నట్టు వివరించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడి త్యాగాలు చేసుకున్న వారి గురించి గుర్తుచేసుకోవాల్సిన సమయం వచ్చిందని తెలిపారు.

అంతర్గత భద్రత పరిరక్షణకు టెక్నాలజీని ఐపీఎస్‌లు వినియోగించాలి

- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- 75వ ఐపీఎస్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న హోం మంత్రి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



దేశ అంతర్గత భద్రత పరిరక్షణలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐపీఎస్ అధికారులు విరివిగా వినియోగించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సర్దార్ వల్లాభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ 75వ ఐపీఎస్ ట్రైనీ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయనీ, వాటిని అరికట్టే విషయంలో ఎప్పటికప్పుడు పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక వ్యూహరచన చేసి అమలు పర్చాలని సూచించారు. ముఖ్యంగా వామపక్ష తీవ్రవాదం, టెర్రరిజంను ఎదుర్కోవడంలో దేశవ్యాప్తంగా పోలీసులు అనుసరిస్తున్న వ్యూహాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని ఆయన అన్నారు. వీటిని అరికట్టే విషయంలో నూతన ఎత్తుగడలను ఐపీఎస్ అధికారులు అనుసరించాలని ఆయన కోరారు. దేశంలో జమ్మూకశ్మీర్‌లో మొదలుకుని ఇతరత్రా అంశాలకు సంబంధించిన చట్టాల్లో తీసుకొచ్చిన మార్పులు మంచి ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. పేదలకు న్యాయం చేయడంలో ఐపీఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధను వహించాలనీ, ఈ విషయంలో ఏమాత్రం ఏమరపాటు తగదని హెచ్చరించారు. దేశంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు సాధిస్తున్న ప్రగతిపై విదేశాల్లో కూడా మంచి ప్రశంసలు అందుతున్నాయని ఆయన చెప్పారు. నార్కోటిక్ డ్రగ్, హవాలా, క్రిప్టో కరెన్సీ వంటి నేరాలు విస్తృతం కాకుండా దేశవ్యాప్తంగా పోలీసులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సైబర్ నేరాల్లో వస్తున్న మార్పులు, నేరస్తులు అనుసరిస్తున్న నూతన ఎత్తుగడలు, వారు పాటిస్తున్న నూతన టెక్నాలజీని నిర్వీర్యం చేసే దిశగా పోలీసుల వ్యూహాలు నిరంతరం సాగాలని సూచించారు. 75వ బ్యాచ్‌లో 34 మంది మహిళా ఐపీఎస్ అధికారులుండటం పోలీసు శాఖలో మహిళలకు ప్రాధాన్యతకు నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా ఇండోర్, అవుట్ డోర్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన యువ ఐపీఎస్ అధికారులకు అమిత్‌షా బహుమతులు, అవార్డులను ప్రదానం చేశారు. 75వ బ్యాచ్ శిక్షణా సమయంలో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబర్చిన అనుస్త కాలియా ప్రతిభాపురస్కారాన్ని హోంమంత్రి అమిత్‌షా అందజేశారు. ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్ గర్గ్ మాట్లాడుతూ..75వ బ్యాచీలో 155 మంది దేశవాళీ ఐపీఎస్‌లుండగా...20 మంది రాయల్ భూటాన్, మాల్దీవులు, నేపాల్ దేశాలకు చెందిన అధికారులున్నారని తెలిపారు. ఈ బ్యాచ్‌లో ఎనిమిది అధికారులు తెలంగాణకు, ఐదుగురు ఆంధ్రాకు కేటాయించబడ్డారని చెప్పారు. అంతకుముందు యువ ట్రైనీ ఐపీఎస్ అధికారులు శిక్షణాంతర ముగింపు కవాతు అత్యంత ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై తో పాటు పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

పని గ్యారంటీ "ప్రశ్నార్థకం"

- ఏటేటా 'ఉపాధి హామీ' నిధుల కుదింపు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వీర్యం
- వంద రోజుల పనిదినాలు అందని ద్రాక్ష
- జాబ్ కార్డుల కోత.. సభ్యుల తొలగింపు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



గ్రామీణ పేదలకు వరప్రదాయినిగా ఉన్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వీర్యం చేస్తున్నాయి. పేదలకు పని కల్పించేందుకు ఇవ్వాల్సిన నిధులు రాష్ట్రంలోనూ దారి మళ్లుతున్నాయి. ఐదారు నెలలైనా వేతన బకాయిలివ్వడం లేదు. కూలీలకు మాత్రమే పని కల్పించే పనులు చేయాల్సింది పోయి యంత్రాలతో చేసే పనులకు నిధుల్ని ఖర్చు చేస్తున్నారు. ఏటేటా నిధుల్ని తగ్గిస్తు న్నారు. కొత్త జాబ్ కార్డులివ్వ కపోగా పాత కార్డుల్ని రద్దు చేస్తున్నారు. నమోదైన కూలీల పేర్లను తొలగిస్తున్నారు. ఏడాదిలో కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించాలని చట్టంలో ఉన్నా ఏ ఒక్క కుటుంబానికి పని చూపలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టే అనేక పథకాలకు ఉపాధి హామీ నిధుల్ని మళ్లిస్తూ కూలీలకు పని చూపట్లేదన్న విమర్శలున్నాయి. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలనే పేదల డిమాండ్‌ను పాలకులు విస్మరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల వేల ఉపాధి హామీ పథకంలో పేదలకు పని గ్యారంటీ లేని వైనాన్ని చర్చించాల్సిన అవసరం ఉంది. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఉపాధి హామీ చట్టం అమలు తీరు.. దాని ఉనికికే ప్రశ్నార్థకంగా మారింది. సంగారెడ్డి జిల్లాలో 2.19 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులుండగా వీటిల్లో 4.8 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. మెదక్ జిల్లాలో 1.10 లక్షల జాబ్‌కార్డులుండగా వీటిల్లోనూ 2 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో 2.10 లక్షల జాబ్‌కార్డులుండగా వీటిల్లో 4.10 లక్షల మంది కూలీల పేర్లు నమోదై ఉన్నాయి. జాబ్‌కార్డులు, కూలీల సంఖ్యల వివరాలు అధికారిక రికార్డుల్లో నమోదై ఉన్నప్పటికీ వారందరికీ వంద రోజుల పాటు పని దినాలు కల్పిస్తున్న పరిస్థితి లేదు. పైగా జాబ్‌కార్డుల్ని రద్దు చేస్తూ వస్తున్నారు. దాంతో నమోదైన కూలీల పేర్లు కూడా తొలగించబడుతున్నాయి. జాబ్‌కార్డు కోసం తెల్లకాగితంపై దరఖాస్తు ఇస్తే వెంటనే కార్డు ఇవ్వాలని చట్టం చెబుతున్నా అధికారులు మాత్రం అనేక కొర్రీలు పెట్టి కార్డులివ్వడంలేదు. పని చేయగల్గిన కుటుంబాలకు వంద రోజుల పనిదినాలు తగ్గకుండా కల్పించాల్సి ఉన్నా ఏ ఒక్క ఊర్లోనూ వంద రోజుల పని కల్పించడంలేదు. ముఖ్యంగా కూలీలతో చేయించే పనులకు కాకుండా యంత్రాలతో చేసే పనులకు ఈజీఎస్ నిధుల్ని వెచ్చిస్తున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, రైతులకు కల్లాలు, రైతు వేదికలు, వర్మీ కంపోస్టు, నీటి గుంతల తవ్వకం, పశువులు, మేకల పాకల నిర్మాణం, క్రీడా ప్రాంగణాలు, ప్రకృతి వనాలు, మన ఊరు మన బడి పేర స్కూళ్ల అభివృద్ధి వంటి పనులకు జాతీయ ఉపాధి హామీ నిధుల్ని ఖర్చు చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

నిధుల్లో కోత.. మళ్లింపు

ఉపాధి హామీ చట్టం అమలు కోసం ఏటా బడ్జెట్‌లో పెట్టే నిధుల్ని తగ్గిస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో కోత పెడుతుంది. ఆ మేరకు రాష్ట్రం వాటాను కూడా తగ్గిస్తుంది. నిధుల్ని తగ్గించడమే కాకుండా ఇతర పథకాల అమలు పేరిట నిధుల్ని దారి మళ్లిస్తున్నారు. రాష్ట్రంలో మూసీ ఆధునీకరణ, హరిత హారం వంటి పథకాల కోసం ఈజీఎస్ నిధుల్ని మళ్లించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటు కోసం బోర్డుల తయారీ, మైదానం ఏర్పాటు పనుల్లో ఏ ఒక్క కూలీకి కూడా పని చూపలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రకృతి వనాల్లోనే కూలీలకు కొన్ని రోజుల పని దొరికింది.

జాబ్‌కార్డుల రద్దు.. కూలీల పేర్ల తొలగింపు

ఉమ్మడి మెదక్ జిల్లాలో కొత్త జాబ్‌కార్డులివ్వడం కంటే రద్దు చేస్తున్నవే అధికంగా ఉన్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 5.39 లక్షల జాబ్‌కార్డులుండగా ఇందులో పని కోసం రావట్లేదన్న నెపంతో సంగారెడ్డి జిల్లాలో యాక్టివ్‌గా లేని కుటంబాలు 89 వేలు ఉన్నట్లు గుర్తించారు. అదే విధంగా 2.30 లక్షల మంది కూలీలు యాక్టివ్‌గా లేరన్న పేరుతో పని కల్పించడంలేదు.

జాబ్‌కార్డుల తొలగింపు, జోడింపు అనేది గ్రామ సభలో చర్చించి ఆమోదం పొందాలి. కానీ..! నకిలీ జాబ్‌కార్డులు, పని చేయడానికి ఇష్టపడకపోవడం, గ్రామం నుంచి వలస వెళ్లిపోవడం వంటి కారణాలు చూపి జాబ్‌కార్డుల్ని తొలగిస్తున్నారు. సిద్దిపేట జిల్లాల్లోనూ ఇదే విధంగా సగం జాబ్‌కార్డుల్ని ఇన్‌యాక్టివ్ పేరిట పని కల్పించకుండా రద్దు చేసే పరిస్థితి ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 3.50 లక్షల వరకు జాబ్‌కార్డులకు పని కల్పించని పరిస్థితి నెలకొంది. వరుసగా పనికి రాని కుటుంబాల్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి తర్వాత వాటిని రద్దు చేస్తున్నందున ఏటేటా జాబ్‌కార్డుల కుదింపు జరుగుతోంది. జాబ్‌కార్డుల్ని కుదించడంతో పాటు కూలీల పేర్లను కూడా తొలగిస్తున్నారు.

అందని ద్రాక్ష.. వంద రోజుల పని

ఒక్కో ఊరిలో జాబ్ కార్డులున్న కుటుంబాలన్నింటికీ కనీసం వంద రోజుల పాటు పని కల్పించాల్సి ఉంది. ఈ నాలుగేళ్ల కాలంలో వంద రోజుల పని దినాలు కల్పించిన లెక్కల్ని పరిశీలిస్తే... పట్టుమని పది కుటుంబాలకు కూడా వంద రోజుల పని చూపలేదు. సంగారెడ్డి జిల్లాలో యాక్టివ్‌గా ఉన్న కూలీలుగా గుర్తించిన 2.30 లక్షల మందిలో 2023-24 సంవత్సరంలో వంద రోజుల పాటు పని కల్పించిన కూలీలే లేరు. ఇక మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

గ్రామీణ పేదల పట్ల పాలకుల కుట్ర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ పేదల పట్ల కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయి. ఏటా ఈజీఎస్‌కు బడ్జెట్‌లో కోత పెడుతున్నారు. పని చేయట్లేదనే పేరుతో జాబ్‌కార్డుల్ని రద్దు చేస్తున్నారు. ఇతర పథకాలకు నిధుల్ని మళ్లించడం వల్ల కూలీలకు పనిదినాలు దొరకట్లేదు. అరకొర పనిదినాలు కల్పించినా ఐదారు నెలల వరకు వేతనాలివ్వడలేదు. కూలీలు రోజంతా కష్టపడి పనిచేసినా రూ.150 కూలి కూడా ఇవ్వడంలేదు. ఉమ్మడి మెదక్‌లో మున్సిపాలిటీల ఏర్పాటు పేరిట వందల గ్రామాలను విలీనం చేశారు. ఆ గ్రామాల్లో పట్టణీకరణ జరగలేదు. పేదలకు మాత్రం మున్సిపాలిటీ గ్రామాల పేరిట ఉపాధి పనుల్ని కల్పించడంలేదు.

ఎం.నర్సింహులు, వ్యకాస జిల్లా కార్యదర్శి

తెలంగాణలో టీడీపీ బలపడింది

- పోటీ అనివార్యం :

యనమల, అచ్చెన్నాయుడుతో నేతల భేటీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పోటీ చేసే విషయంలో సందిగ్ధత నెలకొన్న నేపథ్యంలో శుక్రవారం పలువురు టీడీపీ నేతలు జాతీయ నాయకత్వాన్ని కలిశారు. ఈ మేరకు పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర నాయకుల బందం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకష్ణుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ అశోక్ బాబును కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బరిలో నిలబడటానికి గతంలో కంటే సానుకూల పరిస్థితులు ఉన్నాయని వివరించారు. పార్టీ క్యాడర్‌ను కాపాడుకునేందుకు ఎన్నికల్లో పోటీ చేయడం అనివార్యమని చెప్పారు. పోటీలో ఉండకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో టీడీపీ పోటీలో ఉండటం లేదని మీడియాలో కథనాలు వస్తున్నాయనీ, దీంతో పార్టీ శ్రేణుల్లో ఇప్పటికే అయోమయం నెలకొందన్నారు. దీంతో యనమల, అచ్చెన్నాయుడు సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణ ఎన్నికల్లో పోటీకి సంబంధించిన అంశాలను పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకుపోతామని హామీ ఇచ్చారు. అన్ని స్థానాల్లో కాకుండా పార్టీకి బలమున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తే బాగుంటుందని వారు సూచించడం జరిగిందని నేతలు చెప్పారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొలంపల్లి అశోక్, బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీపతి సతీష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు మేకల భిక్షపతి, ప్రకాష్, రవీంద్రా చారి, నల్లగొండ పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.


29న చంద్రబాబు మద్దతుగా 'కాన్సర్ట్'

చంద్రబాబుకు మద్దతుగా గచ్చిబౌలిలో ప్రత్యేక కాన్సర్ట్‌ను తెలుగు ప్రొఫెషనల్స్ నిర్వహించ నున్నారు. హెటెక్‌సిటీ నిర్మించి 25 ఏండ్లు పూర్తవుతున్న నేపథ్యంలో చంద్రబాబుకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. చంద్రబాబు ద్వారా లబ్దిపొందిన అందరూ ఈకార్యక్రమానికి ఆహ్వానితులేనని తెలుగు ప్రొఫెషనల్స్ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కార్యక్రమం సాయంత్రం ఈనెల 29న(ఆదివారం) నాలుగు గంటలకు జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రారంభమవుతుందన్నారు.

అరుణాచల్ ప్రదేశ్‌లో 400 ప్రభుత్వ పాఠశాలలు మూసివేత

న్యూఢిల్లీ : జీరో అటెండెన్స్‌తో వున్న 400 ప్రభుత్వ పాఠశాలలు మూసివేస్తున్నట్లు అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ప్రకటించారు. బాలెక్‌లోని ప్రభుత్వ సెకండరీ స్కూల్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఖాండూ విద్యారంగం పట్ల తన దార్శనికతను వెల్లడించారు. 'రాశి కన్నా వాశి మిన్న' అని నొక్కి వక్కాణించారు. బుజ్జగింపు రాజకీయాల కారణంగా అనేక ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల లేమి, సిబ్బంది కొరత నెలకొందంటూ ఖాండూ వ్యాఖ్యానిం చారు. రాజకీయాలను పరిగణనలోకి తీసుకోవడం కన్నా విద్యారంగ చొరవలు, ప్రాజెక్టుల నాణ్యతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. విద్యను చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని, వాస్తవానికి జీరో అటెండెన్స్ వున్న 400 ప్రభుత్వ పాఠశాలలను మూసివేశామని తెలిపారు. ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతోందన్నారు. ఎక్కువ పాఠశాలలు మనకు అవసరం లేదు, వున్న స్కూళ్ళ నుండి మంచి నాణ్యత గల విద్య వస్తే చాలు, దానికే ప్రభుత్వం అన్ని రకాలుగా తోడ్పాటునందిస్తుందని చెప్పారు. స్వాతంత్ర్యానికి ముందు ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలలను హెరిటేజ్ స్కూల్సుగా ప్రకటించేందుకు బృహత్తర ప్రణాళికను ప్రకటించారు

ఏజెన్సీ అభ్యర్థుల్లో అంతర్మథనం..!!



- ప్రజలకు ఏం చెప్పి ఓట్లడుగాలో తెలియని పరిస్థితి..
- ఏజెన్సీ అభివృద్ధి శూన్యం
- నిధులివ్వకపోతే నేనేమీ చేసేది
- అవకాశం ఇస్తే నిధులు పట్టుకొస్తానంటున్న అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి
- ఆనాటి సీపీఐ(ఎం) ఎమ్మెల్యేల పోరాటాలు గుర్తు చేసుకుంటున్న స్థానికులు
- ఈసారి అంతు చిక్కని ఏజెన్సీ ఓటరు నాడి

నవతెలంగాణ-భద్రాచలం

అసెంబ్లీ ఎన్నికల వేడి రాష్ట్ర వ్యాప్తంగా ఉక్కిరి బిక్కిరికి గురి చేస్తుండగా భద్రాచలంలో మరింత హీట్ ఎక్కింది. ఈసారి ఇక్కడే ఓటర్ నాడి అంతుచిక్కని విధంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా డా.తెల్లం వెంకట్రావు, కాంగ్రెస్ పార్టీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, బీజేపీ నుంచి కుంజా ధర్మా బరిలో నిలుస్తున్నట్టు ఆయా పార్టీలు ప్రకటించాయి. ఇప్పటికే బీఆర్ఎస్, కాంగ్రెస్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తుండగా, బీజేపీ అభ్యర్థి కుంజా ధర్మ నియోజకవర్గంలో పర్యటించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోదెం వీరయ్య దాదాపు పదివేలకు పైగా మెజార్టీతో డాక్టర్ తెల్లంపై గెలుపొందారు. అయితే ఐదేండ్లుగా భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధికి నిధులు తెచ్చేందుకు ఈ ఎమ్మెల్యే ప్రయత్నం గానీ, అధికార పార్టీ నుంచి ఆశించినంత సహాయం గానీ తగినంత లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. దాంతో ఈ ఎమ్మెల్యేని ప్రజలు మరోసారి ఆశీర్వదిస్తారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. కాగా, సీఎం ప్రకటించిన హామీలను ఎందుకు నెరవేర్చలేకపోయారని ప్రతిపక్ష పార్టీలు ప్రధాన అస్త్రంగా సంధిస్తున్నాయి. అలాగే, ఈ పదేండ్లు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉంది కదా.. భద్రాచలంకు ఈ ప్రభుత్వం ఏం చేసిందని స్థానిక ప్రజలూ నిలదీస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం ఓటర్లు ఈ సారి ఎన్నికల్లో ఎవరికి పట్టం కట్టనున్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

తెల్లం వెంకట్రావు ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వెళ్లటం, నాటకీయ పరిణామంలో మళ్లీ ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లోకి రావటం, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్‌ను దక్కించుకోవటం చక చకా జరిగిపోయింది. తనకు ఒక్క అవకాశం ఇస్తే భద్రాచలం ఏజెన్సీ అభివృద్ధి చేస్తానంటూ డాక్టర్ తెల్లం తన ఎన్నికల ప్రచారంలో నొక్కి వక్కాణిస్తున్నారు. భద్రాచలం పుణ్యక్షేత్ర ప్రగతిపై నీలినీడలు కమ్ముకున్న నేపథ్యంలో రామ భక్తులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముంపు విభజన పేరుతో ఇప్పటికే భద్రాచలం రూపురేఖలు కోల్పోయిందని, జిల్లాల పునర్విభజనతో అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన చెందుతున్న ప్రజలు.. ఆనాటి సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థుల పోరాటాన్ని గుర్తు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, భద్రాచలం నియోజకవర్గంలో గతంలో సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు కుంజా బుజ్జి, సున్నం రాజయ్య, ఎంపీ డాక్టర్ మీడియం బాబురావు.. ప్రభుత్వాల నుంచి కోట్లాడి కోట్లాది రూపాయల నిధులను తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని చర్చించుకుంటున్నారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు ఉండి, సమస్య పరిష్కారానికి ఎంతగానో పాటుపడ్డారని ఎన్నికలవేళ ప్రజలు బహిరంగంగానే స్మరించుకుంటున్నారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదని, ప్రజల గోడు పట్టించుకునే నాధుడే కరువయ్యాడని, ఎన్నికలవేళ హడావుడి తప్ప, సాధారణ రోజుల్లో ఏజెన్సీ వాసులను ఏ నాయకుడూ పలకరించిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపుపై దీమా ప్రకటిస్తున్నప్పటికీ, అంతర్గతంగా ఆందోళన చెందుతున్నారు. ఎవరు గెలిచినా తమ పరిస్థితి ఇంతేనని స్థానిక ఓటర్లు కలత చెందుతున్నారు

బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు ఆ నిబంధనను వెనక్కి తీసుకోవాలి


- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఎస్సీ నర్సింగ్‌లో 2023-24 విద్యాసంవత్సరంలో చేరాలంటే మేనేజ్‌మెంట్ ప్రవేశాలకు నీట్, ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశాలకు ఎంసెట్‌లో 50 శాతం మార్కులు ఉండాలన్న నిబంధనను వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కానీ 63 వేల ర్యాంకు వరకు విద్యార్థులకు మాత్రమే కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రవేశాల్లో అవకాశం కల్పించిందని తెలిపారు. దీనివల్ల ఎంసెట్‌లో అర్హత సాధించినా, వర్సిటీ నిర్ణయం వల్ల ఎంతోమంది విద్యార్థులకు నర్సింగ్ చదవాలని ఉన్నా అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఎంతో మంది విద్యార్థులు 63 వేల కంటే ఎక్కువ ర్యాంకు వచ్చినవాళ్లు ఉన్నారనీ, వర్సిటీ కోటాలో అవకాశం లేదని తెలిపారు. వాళ్ల భవిష్యత్తు కోసం కనీసం ప్రయివేట్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటాలో సీటు కోసం వాటి చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. వర్సిటీ ఆమోదం లేకుండా తీసుకోలేమంటూ ప్రయివేట్ కాలేజీలు చెప్తున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు ప్రయివేట్ కాలేజీల్లో భర్తీ కావాల్సిన సీట్లు 3,257 మిగిలే ఉన్నాయని గుర్తు చేశారు. రెండు విడతల కౌన్సెలింగ్ ప్రక్రియ అయ్యాక కూడా అన్ని సీట్లు మిగిలే ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత పొంది ర్యాంకు వచ్చిన విద్యార్థులకు అవకాశం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం తుదివిడత కౌన్సెలింగ్‌లో పర్సెంటైల్‌తో సంబంధం లేకుండా ఏపీ తరహాలో ఎంసెట్ రాసి ఉత్తీర్ణత పొందిన వారందరికీ అవకాశమివ్వాలని కోరారు. ఏపీ ప్రభుత్వం మొదట 50 పర్సెంటైల్‌గా నిర్ణయించినా, తర్వాత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎంసెట్ రాసిన అందరికీ అవకాశమిచ్చారని గుర్తు చేశారు. కానీ తెలంగాణలో ఇంతవరకు దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. యాజమాన్య కోటా సీటుకు నీట్‌లో అర్హత పొందడానికి 137 మార్కులు లేదా 50 పర్సెంటైల్ రావాలి అంటున్నారని పేర్కొన్నారు. మెడికల్ పీజీ సీట్లకే సున్నా పర్సెంటైల్‌కె ప్రవేశాలు కల్పించినపుడు బీఎస్సీ నర్సింగ్‌కే ఆ నిబంధన ఎందుకని ప్రశ్నించారు. దాని వల్ల నర్సింగ్ చేయాలనే కోరిక ఉన్నా నీట్ అర్హత లేక విద్యాసంవత్సరాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, ఆరోగ్య విశ్వవిద్యాలయం, నర్సింగ్ కౌన్సిల్ తగు నిర్ణయం తీసుకోవాలనీ, విద్యార్థులు ప్రస్తుత విద్యాసంవత్సరం కోల్పోకుండా చూడాలని కోరారు.

రియల్ ఎస్టేట్‌లో మార్పు వస్తోంది

- 'రెరా' రిజిస్ట్రేషన్లు పెరిగాయి
- బిల్డర్లలో జవాబుదారీతనం
- అయినా అప్రమత్తత అవసరం :చార్టెడ్ అక్కౌంటెంట్స్ సదస్సులో 'రెరా' చైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్‌రంగంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయనీ, దానివల్ల కొనుగోలుదారులకు భద్రత, విశ్వాసం పెరుగుతాయని తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీఎస్‌రెరా) చైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ అన్నారు. బిల్డర్లు తమ వెంచర్లను తప్పనిసరిగా 'రెరా' రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనీ, వారిలో జవాబుదారీతనం పెరిగిందని చెప్పారు. అయినా వినియోగదారులు ఆస్తుల క్రయవిక్రయాలు, వ్యాపార లావాదేవీలపట్ల అప్రమత్తంగానే ఉండాలని సూచించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో 'రెరా లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారంనాడాయన ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, జవాబుదారితనం లోపిస్తే, కుటుంబసభ్యులు కష్టపడి కూడబెట్టిన సొమ్మును నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో 'రెరా' చట్టం అమలుతో ఎన్నో మంచి మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. బిల్డర్లు, ప్రమోటర్లు, డెవలపర్లలో మార్పులు వచ్చి 'రెరా' రిజిస్ట్రేషన్ లేకుండా ప్రకటనలు, మార్కెటింగ్ చేయడం వంటి చర్యలు గణనీయంగా తగ్గాయని వివరించారు. 'రెరా' వెబ్‌సైట్‌లో రియల్ ఎస్టేట్ కంపెనీల నిర్మాణ వివరాలను పొందుపర్చడం వల్ల న్యాయపరంగానూ లబ్ది చేకూరుతుందన్నారు. సంస్థలో ఫిర్యాదుల విభాగంతోపాటు మధ్యవర్తిత్వం కోసం ఇటీవలే ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)తో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. 'రెరా' నిబంధనలు ఉల్లంఘించిన పలు రియల్ ఎస్టేట్ కంపెనీలకు నోటీసులు జారీ చేశామన్నారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు సర్టిఫికేట్ ప్రోగ్రాం నిర్వహించి వారికి రియల్ ఎస్టేట్ చట్టంతో పాటు వ్యాపార మెళకువలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. చార్టర్ అకౌంటెంట్లు సరైన సమాచారాన్ని 'రెరా'కు అందిస్తూ, సహకారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐసీఏఐ అధ్యక్షులు ఏ సునీల్ తలాట్, ఉపాధ్యక్షులు రంజిత్‌కుమార్ అగర్వాల్, నారెడ్కో అధ్యక్షులు జీ హరిబాబు, 'రెరా' సభ్యాలు కే శ్రీనివాసరావు, జే లక్ష్మీనారాయణతో పాటు ఒరిస్సా, పంజాబ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల రెరా సభ్యులు కూడా పాల్గొన్నారు.



16ఏళ్ల శీతల్‌కు మరో స్వర్ణం

ఆసియా పారా క్రీడలు

హాంగ్జౌ: ఆసియా పారా క్రీడల్లో జమ్ము-కాశ్మీర్‌కు చెందిన 16ఏళ్ల శీతల్ దేవి సంచలనం సృష్టిస్తోంది. శుక్రవారం జరిగిన మహిళల కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణం సాధించింది. అలాగే మహిళల డబుల్స్‌లోనూ రజత పతకం చేజిక్కించుకొని ఆర్చరీలో మూడు పతకాలు సాధించిన తొలి పారా క్రీడాకారిణిగా నిలిచింది. గత వారం సింగిల్స్ విభాగంలో స్వర్ణం నెగ్గిన షీతల్.. నేడు సాధించిన పతకాలతో హ్యాట్రిక్ పతకాలను సొంతం చేసుకుంది. రెండు చేతుల్లేని శీతల్ ఆర్చరీలో కాళ్లతోనే విల్లంబులను సంధించి పతకాలను కొల్లగొట్టడం విశేషం. శుక్రవారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో శీతల్ 144-142పాయింట్ల తేడాతో సింగపూర్‌కు చెందిన అలీమ్-నూర్, సయాహిదాను ఓడించింది. ఇక ఎస్‌ఎల్-3 పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ప్రమోద్ భగత్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఫైనల్లో ప్రమోద్ 22-20, 21-19తో భారత్‌కే చెందిన నితీశ్‌కుమార్‌ను చిత్తుచేశాడు. ఇక ఎస్‌ఎల్-3, ఎస్‌ఎల్‌ఎఫ్-4 నితీశ్-తరుణ్ జోడీ స్వర్ణ పతకాన్ని ముద్దాడగా.. ప్రమోద్ భగత్-సుకాంత్ జోడీ కాంస్య పతకానికే పరిమితమైంది. పారాలింపిక్ ఛాంపియన్ కృష్ణ నగర్ ఎస్‌హెచ్-6లో 10-21, 21-8, 11-21తో ఫైనల్లో హాంకాంగ్‌కు చెందిన ఛు-మన్-కి చేతిలో ఓడి రజత పతకంతో సంతృప్తి చెందాడు.

1500మీ. పరుగులో రమన్ శర్మ రికార్డు

పురుషుల టి-38 1500మీ. పరుగులో రమన్ శర్మ ఆసియా గేమ్స్ రికార్డు నెలకొల్పాడు. రమన్ 4నిమిషాల 20:80సెకన్లలో గమ్యానికి చేరి ఈ ఫీట్‌ను సాధించాడు. ఇక జావెలిన్ ఎఫ్-54లో ప్రదీప్ కుమార్ (25.94మీ.), లక్షిత్(21.20మీ.) ఈటెలను విసిరి రజత, కాంస్య పతకాల్ని చేజిక్కించుకోగా... మహిళల డిస్కస్ త్రో ఎఫ్-37.38లో లక్ష్మి 22.55మీ. విసిరి కాంస్య పతకాన్ని ముద్దాడింది. పురుషుల ఆర్చరీ షూట్ ఆఫ్‌లో రాకేశ్ కుమార్ 144(10)-144-(9)తో ఇరాన్‌కు చెందిన అలిసిన్ చేతిలో ఓడి రజత పతకానికే పరిమితమయ్యాడు. దీంతో భారత్ 99 పతకాలతో 6వ స్థానంలో ఉంది.


ఉత్కంఠ పోరులో దక్షిణాఫ్రికా గెలుపు

- మార్‌క్రమ్ ఒంటరి పోరాటం
- బాబర్, షాద్ షకీల్ అర్ధసెంచరీ వృధా

సెమీస్ రేసునుంచి పాకిస్తాన్ ఔట్..

చెన్నై: ఐసిసి వన్డే ప్రపంచకప్ సెమీస్ రేసునుంచి పాకిస్తాన్ దూరమైంది. సెమీస్ రేసులో నిలవాలంటే దక్షిణాఫ్రికాపై తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు వికెట్ తేడాతో ఓటమిపాలైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు 46.4ఓవర్లలో 270పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో దక్షిణాఫ్రికా జట్టు 47.2ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 271పరుగులు చేసి విజయం సాధించింది. ఈ గెలుపులో దక్షిణాఫ్రికా జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. తొలుత కెప్టెన్ బాబర్ అజామ్(50), సౌద్ షకీల్(52) మాత్రమే అర్ధ శతకాలతో రాణించారు. షాదాబ్ ఖాన్(43) ఫర్వాలేదనిపించాడు. తొలుత ఓపెనర్లు అబ్దుల్లా షఫీక్(9), ఇమామ్ అల్ హక్(12) శుభారంభం అందించలేకపోయారు. వీరిద్దరినీ జెన్సన్ పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత బాబర్, మహ్మద్ రిజ్వాన్ (31) మధ్య చక్కటి పార్ట్‌నర్ షిప్ దొరికింది. జట్టు స్కోరు 86 పరుగుల వద్ద రిజ్వాన్‌ను కొయిట్జీ బోల్తాకొట్టించి పెవిలియన్‌కు పంపాడు. ఇఫ్తికార్ అహ్మద్ (21)తో కలసి బాబర్ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. వీరి భాగస్వామ్యం భారీ స్కోరువైపు వెళ్తోంది అనుకునేలోపే 12 పరుగుల తేడాతో ఇద్దరూ పెవిలియన్‌కు చేరారు. ఈ రెండు వికెట్లు షంసీ ఖాతాలో చేరాయి. ఆ తర్వాత షాదాబ్ ఖాన్, సౌద్ షకీల్ జట్టును భారీ స్కోరు వైపు తీసుకెళ్లారు. షాట్‌లతో షాదాబ్ విరుచుకుపడితే, సౌద్ నిలకడగా బ్యాటింగ్ చేశాడు. అయితే ఈ ఇద్దరూ కీలక సమయంలో ఔటైపోయారు. ఆ తర్వాత వచ్చిన మహ్మద్ నవాజ్ (24) కొన్ని భారీ షాట్లు కొట్టినా... లోయర్ ఆర్డర్ నుంచి సరైన సహకారం అందలేదు. దీంతో పాక్ 270 పరుగులకు సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో తబ్రైజ్ షంసీ 4 వికెట్లు, మార్కో జాన్సన్ 3 వికెట్లు, గెరాల్డ్ కొయిట్జీ 2, లుంగి ఎంగిడి ఒక వికెట్ తీశారు.

ఛేదనలో భాగంగా దక్షిణాఫ్రికా స్టార్ ఓపెనర్ డికాక్ (24), బవుమా(28) నిరాశపరిచారు. డుస్సెన్(21), క్లాసెన్(21), డేవిడ్ మిల్లర్(29) నిరాశపరచడంతో దక్షిణాఫ్రికా జట్టు 206పరుగుల వద్ద 5వ వికెట్ కోల్పోయింది. చివర్లో విజయానికి 9పరుగుల దూరంలో ఉండగా సఫారీజట్టు 9వికెట్లు కోల్పోయి దశలో ఉత్కంఠ నెలకొంది. చివర్లో కేశవ్ మహరాజ్ ఫోర్ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. దక్షిణాఫ్రికా గెలుపులో మార్క్‌క్రమ్(91) టాప్ స్కోరర్. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షంసీకి లభించింది.





స్కోర్‌బోర్డు..

పాకిస్తాన్ ఇన్నింగ్స్: షఫీక్ (సి)ఎన్గిడి (బి)జాన్సెన్ 9, ఇమామ్-ఉల్-హక్ (సి)క్లాసెన్ (బి)జాన్సెన్ 12, బాబర్ అజమ్ (సి)డికాక్ (బి)షాంసీ 50, రిజ్వాన్ (సి)డికాక్ (బి)కొర్జే 31, ఇఫ్తికార్ అహ్మద్ (సి)క్లాసెన్ (బి)షాంసీ 21, షాద్ షకీల్ (సి)డికాక్ (బి)షాంసీ 52, షాదాబ్ ఖాన్ (సి)మహరాజ్ (బి)కొర్జే 43, నవాజ్ (సి)మిల్లర్ (బి)జాన్సన్ 24, షాహిన్ అఫ్రిది (సి)మహరాజ్ (బి)షాంసీ 2, మహ్మద్ వాసిం జూనియర్ (సి)డికాక్ (బి)ఎన్గిడి 7, హరీస్ రవూఫ్ (నాటౌట్) 0, అదనం 19. (46.4ఓవర్లలో ఆలౌట్) 270పరుగులు.

వికెట్ల పతనం: 1/20, 2/38, 3/86, 4/129, 5/141, 6/225, 7/240, 8/259, 9/268, 10/270

బౌలింగ్: జాన్సెన్ 9-1-43-3, ఎన్గిడి 7.4-0-45-1, మార్‌క్రమ్ 4-0-20-0, మహరాజ్ 9-0-56-0, కొర్జే 7-0-42-2, షాంసీ 10-0-60-4.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: బవుమా (సి)షాద్ షకీల్ (బి)మహ్మద్ వాసిం జూనియర్ 28, డికాక్ (సి)మహ్మద్ వాసిం జూనియర్ (బి)షాహిన్ అఫ్రిది 24, డుస్సెన్ (ఎల్‌బి)ఉస్మా మిర్ 21, మార్‌క్రమ్ (సి)బాబర్ (బి)ఉస్మా మీర్ 91, క్లాసెన్ (సి)ఉస్మా మిర్ (బి)మహ్మద్ వాసిం జూనియర్ 12, డేవిడ్ మిల్లర్ (సి)రిజ్వాన్ (బి)షాహిన్ అఫ్రిది 29, జాన్సెన్ (సి)బాబర్ (బి)హరీస్ రవూఫ్ 20, కొర్జే (సి)రిజ్వాన్ (బి)షాహిన్ అఫ్రిది 10,

మహరాజ్ (నాటౌట్) 7, ఎన్గిడి (సి అండ్ బి)రవూఫ్ 4, షాంసీ (నాటౌట్) 4, అదనం 21. (47.2 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 271పరుగులు.

వికెట్ల పతనం: 1/34, 2/67, 3/121, 4/136, 5/206, 6/235, 7/250, 8/250, 9/260

బౌలింగ్: ఇఫ్తికార్ అహ్మద్ 3-0-23-0, షాహిన్ అఫ్రిది 10-0-45-3, మహ్మద్ నవాజ్ 6.2-0-40-0, హరీస్ రవూఫ్ 10-0-62-2, మహ్మద్ వాసిం జూనియర్ 10-1-50-2, ఉస్మా మీర్ 8-0-45-2.





భారత్-పాక్ హాకీ మ్యాచ్ డ్రా

సుల్తాన్ జొహోర్ కప్

కౌలాలంపూర్: 11వ సుల్తాన్ జొహోర్ కప్‌లో భారత పురుషుల హాకీజట్టును పాకిస్తాన్ జట్టు నిలువరించింది. గ్రూప్-బిలో భాగంగా శుక్రవారం జరిగిన భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన లీగ్‌మ్యాచ్ నిర్ణీత సమయం ముగిసే సరికి 3-3గోల్స్‌తో డ్రా అయ్యింది. తొలి క్వార్టర్‌లో ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలం కాగా.. రెండోక్వార్టర్‌లో భారత్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచింది. దీంతో భారత్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో పాకిస్తాన్ ఒక గోల్ చేయగా.. నాల్గో క్వార్టర్‌లో ఇరుజట్లు రెండేసి గోల్స్‌తో రాణించాయి. ఇందులో ఒక్కో ఫీల్డ్ గోల్, మరోటి పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచాయి. ఈ టోర్నీలో భారత హాకీ జూనియర్ జట్టు ప్రాతినిధ్యం వహిస్తోంది. టోర్నీలో మొత్తం 8జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. గత ఏడాది 6జట్ల మధ్య ఈ టోర్నీ జరగ్గా ఈసారి మరో రెండుజట్లు అదనంగా వచ్చి చేరాయి. మరో పోటీలో న్యూజిలాండ్ జట్టు 3-2గోల్స్ తేడాతో ఆతిథ్య మలేషియాను చిత్తుచేసింది. ఇక గ్రూప్-ఎలో ఆస్ట్రేలియా 3-0తో గ్రేట్ బ్రిటన్‌ను ఓడించింది.

మళ్లీ ఓడిన ఆంధ్ర



రాంచీ: సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టు మరో ఓటమిని చవిచూసింది. జార్ఖండ్‌లోని జెఎసిఏ ఇంటర్నేషనల్ స్టేడియంలో రైల్వేస్‌తో శుక్రవారం జరిగిన పోటీలో ఆంధ్రజట్టు 53పరుగుల తేడాతో పరాజయం పాలైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన రైల్వేస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 171పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఉపేంద్ర యాదవ్(51నాటౌట్), అశుతోష్ శర్మ(43), ప్రథమ్ సింగ్(32) బ్యాటింగ్‌లో రాణించారు. విజయ్‌కు రెండు, మనీష్, సాయితేజకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో ఆంధ్రజట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 9వికెట్లు కోల్పోయి 118పరుగులే చేసింది. శ్రీకర్ భరత్(31), తపస్వి(19), రషీద్(19) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. రాజ్ చౌదరికి నాలుగు, యువరాజ్‌సింగ్‌కు మూడు వికెట్లు దక్కాయి. దీంతో గ్రూప్-సిలో ఆంధ్రజట్టు 6మ్యాచ్‌లు ముగిసేసరికి 12పాయింట్లతో 6వ స్థానంలో ఉంది.

వరుసగా 6అర్ధసెంచరీలతో రియాన్ రికార్డు..

అస్సాం బ్యాటర్ రియాన్ పరాగ్ నయా చరిత్ర సృష్టించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో వరుసగా 6మ్యాచుల్లో 6అర్ధసెంచరీలు కొట్టిన తొలి బ్యాటర్‌గా రికార్డుపుటల్లోకెక్కాడు. శుక్రవారం కేరళ నిర్దేశించిన 128 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రియాన్ 33బంతుల్లో 57(నాటౌట్) బ్యాటింగ్‌లో మెరిసి కేరళ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. దీంతో కేరళ 19.3ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.



విక్రమ్

రంగంలోకి దిగిన తంగలాన్

విక్రమ్ నటిస్తున్న కొత్త సినిమా 'తంగలాన్'. దర్శకుడు పా రంజిత్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. పార్వతీ, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్థ ఘటనల ఆధారంగా పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమాని పా రంజిత్ నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలసి స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు.

ఈ సినిమాను జనవరి 26న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. పాన్ ఇండియా స్థాయిలో హిందీతో పాటు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో విక్రమ్ డిఫరెంట్ గెటప్‌లో పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఈ పాత్రలోని నటనతో విక్రమ్ సర్‌ప్రైజ్ చేయబోతున్నట్లు పోస్టర్ చెప్పకనే చెబుతోంది. నవంబర్ 1న టీజర్‌ను రిలీజ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. పశుపతి, హరికృష్ణన్, అన్బు దురై తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం - జీవీ ప్రకాష్ కుమార్, ఆర్ట్ - ఎస్ ఎస్ మూర్తి, ఎడిటింగ్ - ఆర్కే సెల్వ, స్టంట్స్ - స్టన్నర్ సామ్.

నవచిత్రం

నవంబర్ 4న రీ రిలీజ్



చిరంజీవి

చిరంజీవి నటించిన 'శంకర్ దాదా ఎంబీబీఎస్' సినిమా 2004లో బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అలాంటి కల్ట్ క్లాసిక్ హిట్‌ను మళ్లీ థియేటర్లోకి తీసుకొస్తున్నారు. మెగా ప్రొడక్షన్స్ ద్వారా ఈ చిత్రం నవంబర్ 4న భారీ ఎత్తున రీ రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో గురువారం నాగబాబు, హీరో శ్రీకాంత్ ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

నాగబాబు మాట్లాడుతూ,'ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తుండటం ఆనందంగా ఉంది. ఈ మూవీ వచ్చి 19 ఏళ్లు అవుతోంది. అప్పుడు అన్నయ్య ఎంతో అందంగా ఉన్నారు. పవన్ కళ్యాణ్‌తో ఓ చిన్న సీన్ చేయించారు. వైష్ణవ్ చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేశాడు. నా ఫ్రెండ్ ఆహుతి ప్రసాద్ ఇప్పుడు లేరు. ట్రైలర్ చూశాకా ఇవన్నీ నాకు గుర్తొచ్చి బాధ, సంతోషం కలిగాయి' అని తెలిపారు.

'2004ని నేను ఎప్పుడూ మరిచిపోలేను. అన్నయ్యతో కలసి నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఆయనది ఎంతో కష్టపడేతత్త్వం. ఇప్పటికీ నన్ను ఏటీఎం అని పిలుస్తుంటారు. ఈ సినిమా ఇప్పుడు రీ రిలీజ్ అవుతోంది' అని హీరో శ్రీకాంత్ చెప్పారు. సురేష్ కొండేటి, ధర్మేంద్ర తదితరులు రీ రిలీజ్ అవుతున్న ఈ సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.



కమల్‌హాసన్ మణిరత్నం

నాయకుడు తర్వాత..

కమల్ హాసన్, మణిరత్నం కాంబినేషన్‌లో 1987లో విడుదలైన కల్ట్ యాక్షన్ డ్రామా చిత్రం 'నాయకుడు'. 36 సంవత్సరాల తర్వాత ఈ లెజెండ్స్ ఇద్దరు ఓ కొత్త సినిమా కోసం పని చేయబోతున్నారు. శుక్రవారం ఈ సినిమా షూటింగ్ ఘనంగా ప్రారంభమైంది.

ఈ సినిమా ఆరంభోత్సవం సందర్భంగా విడుదల చేసిన 'బిగిన్ ది బిగిన్' అనే ప్రోమోలో కమల్ హాసన్, ప్రదీప్ శక్తి మధ్య నాయకన్ ఐకానిక్ సీక్వెన్స్ చూపించారు. ఇది సినిమా గ్రాండ్ లాంచింగ్ వేడుక విజువల్స్ కూడా చూపిస్తుంది. కమల్ హాసన్, మణిరత్నం, ఆర్.మహేంద్రన్, శివ అనంత్‌లు తమ రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఉదయనిధి స్టాలిన్ రెడ్ జెయింట్ మూవీస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ లెజెండ్స్ మ్యాజికల్ కాంబినేషన్‌కి ఏఆర్ రెహమాన్ సంగీతం సమకూరుస్తున్నారు.

ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: రవి కె చంద్రన్, యాక్షన్: అన్బరివ్, ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: శర్మిష్ఠ రాయ్.

అంతకు మించి..



సిద్ధు జొన్నలగడ్డ

కల్ట్ బ్లాక్‌బస్టర్ 'డీజే టిల్లు'లో టిల్లు వంటి వినోదాత్మక పాత్రతో సిద్ధు అలరించారు. టిల్లు పాత్రలో సిద్ధుని మరోసారి చూడాలని ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుం డటంతో.. సిద్ధు, సితార ఎంటర్ టైన్‌మెంట్స్ కలిసి 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్'ని తెరకెక్కిస్తున్నారు.

ఈ సినిమా గురించి నిర్మాత సూర్యదేవర నాగ వంశీ మాట్లాడుతూ, 'టిల్లూ స్క్వేర్' కల్ట్ స్టేటస్‌ను అందుకుంటుంది. ఆ దిశగా కృషి చేస్తున్నాం. అలాగే సినిమాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి రెడీ చేస్తున్నాం' అని తెలిపారు. 'టిల్లు స్క్వేర్'లో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్నారు. 'డీజే టిల్లులో' నేహా శెట్టి పోషించిన రాధిక పాత్ర తరహాలో ఈ పాత్ర కూడా గుర్తుండిపోయేలా ఉంటుందని మేకర్స్ చెప్పారు. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాల్లో అనుపమ కనిపిస్తున్న తీరు హాట్ టాపిక్‌గా మారటం విశేషం. రామ్ మిరియాల స్వరపరిచి, పాడిన 'టికెటే కొనకుండా..' పాట భారీ హిట్ అయ్యింది. మల్లిక్ రామ్ ఈ చిత్రానికి దర్శకుడు. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సాయి సౌజన్య సహ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది.



వరుణ్ సందేశ్

నయా సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం చూడర..

హీరో వరుణ్ సందేశ్, ఆర్‌ఎన్ హర్షవర్ధన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'చిత్రం చూడర'.

ధనరాజ్, కాశీ విశ్వనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని బిఎమ్ సినిమాస్ బ్యానర్‌పై శేషు మారం రెడ్డి, బోయపాటి భాగ్యలక్ష్మి నిర్మిస్తున్నారు. శీతల్ భట్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను ప్రొడ్యూసర్ టీజీ విశ్వప్రసాద్ లాంచ్ చేశారు.

ఇంటి గోడపై కూర్చున్న వరుణ్ సందేశ్, ధనరాజ్, కాశీ విశ్వనాథ్‌ల సస్పెన్స్ ఫేస్‌లని ప్రజెంట్ చేయడంతో టీజర్ ప్రారంభమవుతుంది. పవన్ కళ్యాణ్‌కి వీరాభిమానిగా వరుణ్ సందేశ్ కనిపించారు. వరుణ్ క్రైమ్‌లో ధన్‌రాజ్, కాశీ విశ్వనాథ్ భాగస్వాములు. కోర్ పాయింట్‌ను రివీల్ చేయకుండానే టీజర్ సస్పెన్స్, యాక్షన్ అంశాలతో సినిమాపై క్యూరియాసిటీ క్రియేట్ చేసింది. అల్లరి రవిబాబు, తనికెళ్ల భరణి, రాజా రవీంద్ర, శివాజీరాజా, మీనా కుమారి, అన్నపూర్ణమ్మ కీలక పాత్రలు పోషిస్తుండగా, 'నేనింతే' ఫేమ్ అదితి గౌతమ్ ఓ ప్రత్యేక పాత్రలో అలరించనుంది. ఈ చిత్రానికి సహ నిర్మాత- ధన తుమ్మల, సంగీతం- రథన్, ఎడిటర్ - మార్తాండ్ కె వెంకటేష్, డీఓపీ- జవహర్ రెడ్డి, ఆర్ట్ డైరెక్టర్ - రవి కుమార్ గుర్రం.

నవ్వుల నవంబర్..



చైతన్యరావు

తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'కీడా కోలా'. విజి సైన్మా బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.1గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని కె. వివేక్ సుధాంశు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మిస్తున్నారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్న ఈ చిత్రం నవంబర్ 3న విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్రంలో ఓ ప్రధాన పాత్ర పోషిస్తున్న హీరో చైతన్య రావు మదాడి మీడియాతో మాట్లాడుతూ, 'ఇందులో వాస్తు అనే పాత్ర చేశాను. ఈ పాత్రకి టూరెట్ సింద్రోమ్ ఉంటుంది. మాటల్ని నత్తిలా పలకడం, మాటలు మధ్య ఆగిపోవడం.. వంటి లక్షణాలు ఉంటాయి. ఈ పాత్రని చాలా సహజసిద్ధంగా చేశాను. తరుణ్ చాలా మంచి నటుడు. ఇక బ్రహ్మానందం లాంటి లెజెండరీతో నటించే అవకాశం రావడం నాలాంటి అప్ కమింగ్ యాక్టర్‌కి మంచి లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్. ఇదొక డిఫరెంట్ కంటెంట్ మూవీ. కీడా కోలాతో రిలీజ్‌తో నవ్వుల నవంబర్ స్టార్ట్ కాబోతుంది. 'షరతులు వర్తిస్తాయి' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే 'పారిజాత పర్వం, హనీమూన్ ఎక్స్‌ప్రెస్ చిత్రాలతో పాటు మరో కొత్త సినిమా ఉంటుంది' అని తెలిపారు.



వినోదం + సందేశం

కంచర్ల ఉపేంద్ర హీరోగా, సావిత్రి కృష్ణ హీరోయిన్‌గా ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో ఎస్.ఎస్.ఎల్.ఎస్. క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ఓ ప్రత్యేక వేడుకలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంగీత దర్శకురాలు ఎం.ఎం.శ్రీలేఖ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, 'మా అబ్బాయి ఉపేంద్ర హీరోగా ఐదవ సినిమాగా మొదలు పెట్టిన ఈ సినిమాలోని చివరి పాటను ఊటీలో చిత్రీకరించడంతో షూటింగ్ కంప్లీట్ అయ్యింది. ఈ నెల 29న మా అబ్బాయి పుట్టినరోజున ప్రీ రిలీజ్ వేడుకను భారీగా నిర్వహించబోతున్నాం. అదేరోజున ట్రైలర్‌నూ విడుదల చేస్తాం. నవంబర్‌లో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం'అని చెప్పారు.

'75 శాతం వినోదంతోపాటు మాస్ అంశాలు అందర్నీ అలరిస్తాయి. సోషల్ మీడియా నేపథ్యంలో సందేశాత్మక పాయింట్‌ను కూడా ఇందులో ఆవిష్కరించాం' అని దర్శకుడు అన్నారు.

హీరో కంచర్ల ఉపేంద్ర మాట్లాడుతూ, 'ఈ రోజు మా అమ్మ, నాన్న పెళ్లిరోజు. వారికి కానుకగా ఈ టీజర్‌ని రిలీజ్ చేశాం. టీజర్ మీ అందరికీ కచ్చితంగా నచ్చుతుంది' అని చెప్పారు.

వినూత్న కథ, కథనాలు..

సత్యం రాజేష్, డా.కామాక్షి భాస్కర్ల హీరో, హీరోయిన్‌గా నటించిన చిత్రం 'మా ఊరి పొలి మేర-2'. గౌరు గణబాబు సమర్పణలో గౌరికృష్ణ నిర్మాతగా రూపొందుతున్న ఈ చిత్రానికి డా.అనిల్ విశ్వనాథ్ దర్శకుడు. 'మా ఊరి పొలిమేర' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రం నవంబరు 3న విడుదల కానుంది.



సత్యం రాజేష్, డా.కామాక్షి భాస్కర్ల

ప్రముఖ పంపిణీదారుడు వంశీకృష్ణ నందిపాటి ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలోని పాత్రల పరిచయ కార్యక్రమం గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమానికి చిత్రంలో కనిపించే పాత్రల గెటప్‌లతోనే సత్యం రాజేష్, కామాక్షి భాస్కర్ల, రాకేందు మౌళి, బాలాదిత్య తదితరులు హాజరు కావడం విశేషం.

ఈ సందర్భంగా సత్యం రాజేష్ మాట్లాడుతూ,'కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను కొత్త లోకానికి తీసుకెళ్తుంది' అని తెలిపారు.

"పొలిమేర -1'కు మించి 20 రెట్లు బాగుంటుందీ సినిమా. త్వరలో 'పొలిమేర -3' పనులు మొదలుపెడతాం' అని దర్శకుడు చెప్పారు.

నిర్మాత మాట్లాడుతూ,'వంశీ నందిపాటి సహకారంతో చాలా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం' అని అన్నారు.

అదుపు చేయండి...

టీనేజ్‌లో పిల్లలు వివిధ రకాల భావోద్వేగాలకు లోనవుతారు. ఆనందం, ఒంటరితనం, చికాకు, కోపం.. వంటి మూడ్ స్వింగ్స్ వారి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఒక్కోసారి చిన్న విషయాలకే తీవ్రంగా స్పందిస్తూ కోపంగా మాట్లాడతారు. ఇలాంటి సమయాల్లో తల్లిదండ్రులు వారికి అండగా నిలవాలి. వారిని అర్థం చేసుకుంటూ, ప్రవర్తన మార్చుకునేలా సర్ది చెప్పాలి. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవటానికి పెద్దవాళ్లు కొన్ని పద్ధతులు పాటించాలి. అవేంటంటే...

కోప్పడకుండా... : అప్పటికే కోపంగా ఉన్న టీనేజర్లను తిట్టడం, కొట్టడం వల్ల వారు మరింత తీవ్రంగా స్పందిస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు వారిపై ప్రతాపం చూపించకుండా పిల్లల కోపాన్ని బయట పెట్టనివ్వండి. అవసరమైతే వారితో విడిగా మాట్లాడండి. లేదంటే కొంత సమయం తర్వాత ఏం జరిగిందని ప్రశాంతంగా అడగండి. ఇలా చేయడం వల్ల వారిని అర్థం చేసుకున్న భావన కల్పిస్తూ, పిల్లల కోపాన్ని తగ్గించవచ్చు.

అడిగినవన్నీ ఇవ్వొద్దు... : చిన్నప్పటి నుంచి పిల్లలు అడిగినవన్నీ ఇస్తుంటే ఆ ప్రభావం టీనేజ్‌లో వారిపై పడుతుంది. వారు కోరిన వాటికి అడ్డు చెబితే పెద్దయ్యాక కూడా కోప్పడతారు. ఈ పరిస్థితి ఎదురుకాకుండా ఉండాలంటే పిల్లలకు అడిగినవన్నీ ఇవ్వకూడదు. చిన్నప్పటి నుంచి పెద్దవాళ్లు వారికి అన్ని విషయాలూ అర్థమయ్యేలా చెబితే ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా జాగ్రత్త పడవచ్చు.

సందర్భానుసారం మాటలు : పిల్లలు మీతో ఏదైనా విషయంపై కోపంగా వాదిస్తున్నప్పుడు దానికి ఎక్కడ, ఎలా ముగింపు పలకాలో తెలుసుకోవాలి. ఇలా చేయడం వల్ల వారు శాంతిస్తారు. ఆ తర్వాత మరోసారి అదే అంశం గురించి వివరణ అడగాలి. మరోసారి ఇలాంటివి ఎదురుకావని వారి నుంచి హామీ తీసుకోవాలి.



చెప్పేది వినాలి : టీనేజర్లు పెద్దవాళ్లపై కోపంతో, ఎక్కువగా మాట్లాడకుండా తమ పని తాము చేసుకుపోతుంటే ఏం జరిగిందో తెలుసుకోవాలి. వారితో మనసు విప్పి మాట్లాడాలి. కోపానికి కారణాలను అడగాలి. ఆపద సందర్భాల్లో వారికి అండగా ఉంటామనే భరోసానివ్వాలి. కోపాన్ని అరికట్టడానికి ఉపాయాలు, మార్గాలను ఉపయోగించాలి. పెద్దవాళ్ల పనుల్లో సాయం చేయమని సావధానంగా చెప్తూ ఉండటంతో పాటు, చేసేలా ప్రేరేపించాలి. వారితో కలిసి వ్యాయామం చేయడం, ఆటలు ఆడటం వంటివి చేయడం వల్ల సంబంధాలు బలోపేతమవుతాయి.

పరిమితి : పిల్లలను సరైన మార్గంలో పెట్టడానికి మామూలుగా తిట్టడం, కొట్టడం మంచిదే. కానీ ఎలాంటి సందర్భాల్లో వారిపై కోపం మంచిదో పెద్దవాళ్లు తెలుసుకోవాలి. తల్లిదండ్రులు కోపానికి పరిమితులను విధించుకోవాలి. అకారణంగా పదేపదే యుక్త వయసుకు వచ్చిన వారిని తిడుతూ ఉంటే, వారు మీకు ఏ మాత్రం విలువ ఇవ్వకుండా తయారవుతారు. సరైన సమయంలో సరైన విధంగా పిల్లలతో ప్రవర్తించడం వల్ల వారి కోపాన్ని అదుపులో ఉంచవచ్చు. అన్ని విషయాలు అర్థమయ్యేలా వారికి వివరించవచ్చు.


ఆలూతో మేలు

ఆహారపు అలవాట్లలో తేడా నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం కారణంగా జుట్టు రాలిపోవడం సహజం. అలాగే రసాయనాలు కలిపిన షాంపులు వాడటం ద్వారా కేశాలకు ముప్పు తప్పదు. అయితే ఆలూ రసంతో కేశాలను సంరక్షించుకోవచ్చని అంటున్నారు నిపుణులు.

- కేశాల సంరక్షణకు ఇది మెరుగ్గా పని చేస్తుంది. ఇందులోని పోషకాలు జుట్టు పెరుగుదలకు తోడ్పడతాయి. ఆలూ రసాన్ని మాడుకు పట్టించి మసాజ్ చేయడం ద్వారా జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.



- ఆలును శుభ్రం చేసుకుని తురుముకోవాలి. తర్వాత ఆ తురుమును మిక్సీలో రుబ్బుకుని వడగట్టు కోవాలి. ఆ జ్యూస్‌కు మాడుకు పట్టిస్తే జుట్టుకు మంచిది.
- ఆలూ రసాన్ని, నిమ్మరసాన్ని చేర్చి మాడుకు రాస్తే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. మాడుపై తేమ నిలుస్తుంది. జుట్టు రాలే సమస్య వుండదు.
- ఆలూ రసాన్ని 15 నిమిషాల పాటు మాడుకు పట్టించి మసాజ్ చేస్తే రక్తప్రసరణ మెరుగవుతుంది.



నేను ఆమెతోనే ఉంటాను

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

రెండు జీవితాలను కలపాలన్నా, విడదీయాలన్నా అది ఒక్క ప్రేమతోనే సాధ్యం. సాధారణంగా ప్రేమంటే ఆడా మగా మధ్యనే పుడుతుందనుకుంటాం. కానీ ఇద్దరు అబ్బాయిల మధ్య అయినా, ఇద్దరు అమ్మాయిల మధ్య అయినా ప్రేమ పుట్టొచ్చు. వారే జీవితాంతం కలిసి బతకాలని కోరుకోవచ్చు. అలాంటి బంధాలు కూడా ఈ మధ్య కాలంలో చాలా చూస్తున్నాము. ప్రేమకు వయసే కాదు లింగ భేదం కూడా లేదని నేటి పరిస్థితులు చెబుతున్నాయి. అలాంటి ఓ ప్రేమ కథనే ఈ వారం ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది. ఆ వివరాలేంటో చదువుదాం...

జ్యోతికి 25 ఏండ్లు ఉంటాయి. బీఎస్సీ చేసింది. ఇప్పుడు ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. ఆమెకు 23 ఏండ్లు ఉన్నప్పుడు తల్లిదండ్రులు పెండ్లి చేశారు. పెండ్లయిన నెలకే ఉద్యోగంలో చేరింది. ఆమె భర్త రాజుకు మంచి ఉద్యోగం. చిన్న కుటుంబం. ఇంట్లో వారిద్దరితో పాటు అత్త, మామ మాత్రమే ఉంటారు. ఆడపడుచుకు పెండ్లి అయిపోయింది. అయితే వాళ్ళకు కొన్ని అప్పులు ఉన్నాయి. జ్యోతి ఉద్యోగం చేసి వచ్చిన జీతం మొత్తం వాళ్ళ మామయ్యకి ఇవ్వాలి. లేకపోతే గొడవ చేయడం మొదలు పెడతారు. అందుకే జ్యోతి బస్సు చార్జీల వరకు మాత్రమే తన దగ్గర వుంచుకుని మిగిలిన డబ్బు ఇంట్లో ఇచ్చేది. పెండ్లయిన ఆరు నెలల వరకు అంటే ఆమె ఉద్యోగం చేసినన్ని రోజులు అంతా బాగానే ఉంది. కరోనా కాలంలో ఆమె ఉద్యోగం పోయింది. ఇక అప్పటి నుండి జ్యోతికి కష్టాలు మొదలయ్యాయి.

అత్త,మామలు సూటిపోటి మాటలతో మానసికంగా హింసించే వారు. భర్త పక్కనే ఉన్నా ఒక్క మాట కూడా మాట్లాడేవాడు కాదు. జ్యోతి తల్లిదండ్రులను ఇంటికి రానిచ్చేవారు కాదు. ఒక సారి అల్లుడి పుట్టిన రోజు అని వాళ్ళు కేకు తీసుకొచ్చారు. దానికి కూడా పెద్ద గొడవ చేశారు. 'కేవలం కేకు మాత్రమే తీసుకు వస్తారా?' అని తాగొచ్చి రాజు గొడవ చేశాడు. అప్పటి నుండి జ్యోతితో సరిగా మాట్లాడేవాడు కాదు. ఆమెని దూరం పెట్టడం ప్రారంభించాడు. జ్యోతికి ఆరోగ్యం బాగా దెబ్బ తిన్నది. ఇంట్లో బాధలు మర్చిపోవడానికి ఫోన్‌లో గంటల తరబడి స్నేహితులతో మాట్లాడేది. ఆమెకు కాలేజ్‌లో క్లాస్‌మెట్ అయిన కమల అంటే జ్యోతికి విపరీతమైన ప్రేమ. జ్యోతి ఫోన్‌లో మొత్తం కమల ఫోటోలు, విడియోలే ఉండేవి. జ్యోతి డీపీ, వాల్‌పేపర్‌లో కూడా ఆమె ఫోటోలే. దీనిపై ఇంట్లో చాలా సార్లు గొడవ జరిగింది. 'ఎందుకు ఆమె ఫోటోలు పెట్టుకుంటావు, ఇంట్లో చాలా మంది ఉన్నారు కదా? వాళ్ల ఫోటో పెట్టుకోవచ్చు, మావి నచ్చక పోతే నీ ఫోటోలు పెట్టుకోవచ్చు కదా!' అనేవారు.

రాజు మాత్రం 'నీవు ఆమెతో మాట్లాడటం, ఆమె ఫోటోలు నీ ఫోన్‌లో పెట్టుకోవడం నాకు ఏ మాత్రం ఇష్టం లేదు' అనేవాడు. ఇలా కమల గురించి అత్తింట్లో ఒత్తిడి బాగా పెరిగింది. కొన్ని రోజులకు జ్యోతి ఆరోగ్యం బాగోలేదని రాజు అమెను వాళ్ళ ఇంట్లో వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. ఇక తిరిగి రాలేదు. ఆరు నెలలు గడిచి పోయాయి. అయినా అతను గానీ, వాళ్ళ కుటుంబ సభ్యులు గానీ ఎవరూ రాలేదు. జ్యోతి పుట్టింటి వాళ్ళే రాజుకు ఫోన్ చేసి 'మా అమ్మాయి ఆరోగ్యం ఇప్పుడు బాగానే వుంది. వచ్చి తీసుకు వెళ్ళండి' అని చెప్పారు. దానికి వాళ్ళు 'మీరే తీసుకువచ్చి వదిలిపెట్టి వెళ్ళండి' అన్నారు. కానీ జ్యోతికి అక్కడికి వెళ్ళడం ఇష్టం లేదు. 'వెళ్ళినప్పటి నుండి మళ్ళీ కమల గురించి గొడవ చేస్తారు. నేను వెళ్ళను' అంది. ఇలాగే దాదాపుగా తొమ్మిది నెలలు గడిచిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో అర్థం కాక ఐద్వా దగ్గరకు వచ్చారు.



మేము రాజును పిలిపించి మాట్లాడితే 'ఆమె నాతో సరిగ్గా ఉండదు. నాతో మాట్లాటం గానీ, ఫిజికల్‌గా కలవడం గానీ ఆమెకు ఇష్టం ఉండదు. భర్త వున్నాడా అంటే సమాజంలో చెప్పుకోవడాన్నికి మాత్రమే ఉండాలి. అంతే గానీ నా భార్యగా ఆమెను దగ్గరకు తీసుకునే హక్కు నాకు లేదు. ఆమెకు నాకంటే కూడా ఆమె స్నేహితురాలు కమలతో ఉండటమే ఇష్టం. తన ప్రవర్తనతో నన్ను చాలా ఇబ్బంది పెడుతుంది. ఏమైనా అంటే నాకు మీతో కంటే కమలతో మాట్లాడటం అంటేనే ఇష్టం అంటుంది. ఇదే విషయం వాళ్ళ కుటుంబ సభ్యులకు చెప్పినా అర్థం చేసుకోవడం లేదు' అన్నాడు.

జ్యోతితో మాట్లాడితే 'అవును మేడం నాకు రాజుతో ఉండటం కంటే కమలతో ఉండటమే చాలా ఇష్టం. ఆమెతో ఎన్ని గంటలు మాట్లాడినా, ఆమెతో రోజుల తరబడి గడిపినా తక్కువే అనిపిస్తుంది. నేను రాజుతో కంటే కమలతోనే సంతోషంగా ఉంటాను' అంది. అదే విషయం జ్యోతి కుటుంబ సభ్యులతో చెబితే 'అవును ఆమెకు మొదటి నుండి కమల అంటే చాలా ఇష్టం. పెండ్లి చేస్తే అయినా మార్పు వస్తుందని చేశాము. కానీ జ్యోతిలో మార్పు రాలేదు. రాజు ఆమెను బాగా చూసుకుని వుంటే కమలను పూర్తిగా మర్చిపోయేది. కానీ వాళ్ళు అమెను చాలా ఇబ్బంది పెట్టారు. దాంతో కమల గురించే ఎక్కువగా ఆలోచిస్తుంది' అన్నారు.

మా దగ్గరకు ఇలాంటి కేసు రావడం ఇదే మొదటిసారి. ఒక అమ్మాయి మరొక అమ్మాయిని ఇష్ట పడటమే కాదు. ఆమెను పెండ్లి చేసుకోవాలి అనుకోవడం మొదట్లో మాకు కాస్త విచిత్రంగా అనిపించింది. బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చి రాజుతో 'మీరు జ్యోతిని పెండ్లి తర్వాత చాలా ఇబ్బంది పెట్టారు. ఆమె ఉద్యోగం చేసినన్ని రోజులు ఇద్దరూ బాగానే ఉన్నారు. ఉద్యోగం పోయేసరికి హింసించడం మొదలుపెట్టారు. దాంతో ఆమెకు మీపై కోపం, అసహ్యం పెరిగిపోయాయి. మొదటి నుండి ఇష్టపడే కమలతో చనువు పెంచుకుంది. ప్రస్తుతం సమాజంలో ఇలాంటి బంధాలు కూడా ఏర్పడుతున్నాయి. ఇప్పుడు ఎంత చెప్పినా ఆమె మీతో ఉండటానికి ఇష్టపడటం లేదు. మీకు కూడా ఆమెంటే ఎలాగో ఇష్టం లేదు. కాబట్టి విడాకులు తీసుకోండి. తర్వాత ఎవరి జీవితాలు వారు చూసుకోండి' అని చెప్పాము.

> **మీరు జ్యోతిని పెండ్లి తర్వాత చాలా ఇబ్బంది పెట్టారు. ఆమె ఉద్యోగం చేసినన్ని రోజులు ఇద్దరూ బాగానే ఉన్నారు. ఉద్యోగం పోయేసరికి హింసించడం మొదలుపెట్టారు. దాంతో ఆమెకు మీపై కోపం, అసహ్యం పెరిగిపోయాయి. మొదటి నుండి ఇష్టపడే కమలతో చనువు పెంచుకుంది. ప్రస్తుతం సమాజంలో ఇలాంటి బంధాలు కూడా ఏర్పడుతున్నాయి. ఇప్పుడు ఎంత చెప్పినా ఆమె మీతో ఉండటానికి ఇష్టపడటం లేదు. మీకు కూడా ఆమెంటే ఎలాగో ఇష్టం లేదు. కాబట్టి విడాకులు తీసుకోండి. తర్వాత ఎవరి జీవితాలు వారు చూసుకోండి**

జ్యోతి 'నీకు కమలంటే ఇష్టం, ప్రేమ ఉన్నాయి. మరి ఆమెకు కూడా నువ్వంటే ఇష్టం, ప్రేమ, అభిమానం లాంటివి వున్నాయా? లేవా? నీలాగే ఆమె ఆలోచిస్తుందో లేదో ముందు తెలుసుకో. ఎందుకంటే ఆమె వల్ల మీ ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి ఆమె నీకు కాస్త దూరంగా ఉంటుందని మీ అమ్మానాన్న చెప్పారు. నీ మనసులో ఏముందో ఆమెకు చెప్పావో లేదో తెలియదు. ఇవన్నీ ముందే మాట్లాడుకోవడం మంచిది. లేదంటే తర్వాత ఇంకా ఇబ్బంది పడతావు. ఒక వేళ మీరు పెండ్లి చేసుకున్నా మీ బంధాన్ని సమాజం అంత త్వరగా అర్థం చేసుకోలేదు. కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఎలాంటి సమస్య వచ్చినా ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉంటే అడుగు ముందుకు వేయండి. నీకు ఏమైనా సహాయం కావాలంటే మేము చేస్తాము. ఏది ఏమైనా బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో' అని చెప్పి పంపించాము.

- వై. వరలక్ష్మి, 9948794051

బీజేపీ గెలిస్తే బీసీని సీఎం చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

రూపాయలు కేటాయిస్తామని చెప్పిన కేసీఆర్ మాట ఏమయ్యిందని ప్రశ్నించారు. తెలంగాణలో పసుపు రైతుల కోసం పసుపు బోర్డు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఇటీవలే మంజూరు చేసిన ట్రైబల్ వర్సిటీకి 'సమ్మక్క - సారక్క' పేరు నిర్ణయించామన్నారు. ఈ ఘనత మోదీకే దక్కుతుందన్నారు. కృష్ణా జలాల సమస్య కోసం ఇటీవల కొత్త ట్రిబ్యునల్‌ను ప్రకటించామని చెప్పారు. జల జీవన్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మంచి నీటిని అందిస్తున్నామని తెలిపారు. పేద వారి కోసం కేంద్ర ప్రభుత్వం నాలుగేండ్లుగా నెలకు 5 కిలోల చొప్పున ప్రతి వ్యక్తికి ఉచిత బియ్యం ఇస్తున్నదన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతుకు ఎకరాకు రూ.6వేలు ఇస్తున్నామన్నారు. మహిళా ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ముప్పై లక్షల మరుగుదొడ్లు నిర్మించామన్నారు. తెలంగాణ అభివృద్ధికి అన్ని విధాల కట్టుబడి ఉన్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకుని వస్తే హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు రహదారిని ఆరు లైన్లుగా విస్తరింపచేస్తామని ప్రకటించారు. ఇండస్ట్రీయల్ కారిడార్‌ని ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. సభలో సూర్యాపేట, తుంగతుర్తి, భువనగిరి, నాగార్జునసాగర్, మహబూబ్‌నగర్ అభ్యర్థులు సంకినేని వెంకటేశ్వరావు, కడియం రామచంద్రయ్య, గూడూరు నారాయణరెడ్డి, నివేదితరెడ్డి, హుస్సేన్‌నాయక్, ఎమ్మెల్యే రాజాసింగ్, నాయకులు ప్రేమ్‌చందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, బొబ్బ భాగ్యరెడ్డి, బూర నర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాట్ బిఫోర్ మీ

(మొదటిపేజీ తరువాయి)

వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ తప్పుకున్నారు. దసరా సెలవుల ప్రత్యేక బెంచ్ (వెకేషన్ కోర్టు బెంచ్) ఎదుట శుక్రవారం ఆ పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఈ పిటిషన్లలో వకాలత్ వేసిన న్యాయవాది, ఒక న్యాయాధికారి భర్త అని, ఆ న్యాయవాది దాఖలు చేసిన కేసులను తను విచారించలేనని జస్టిస్ ప్రకటించారు. నాట్ బిఫోర్ మీ అంటూ ఇంతకుమించి తానేమీ చెప్పలేనన్నారు. మనస్సాక్షి అంగీకరించడం లేదన్నారు. పిటిషనరు చంద్రబాబు అనారోగ్య పరిస్థితులను వివరిస్తూ దాఖలు చేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ ఎదుట ఉంచాలని, ఈ నెల 30న విచారణకు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు.

సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్ కల్పించుకుని, చంద్రబాబు అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా అత్యవసర విచారణకు వీలుగా రిజిస్ట్రీకి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ నెల 30లోపే అత్యవసర విచారణకు అనుమతించేలా హైకోర్టు జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌ను కోరతామని, ఉత్తర్వుల్లో ఈ నెల 30.. అని లేకుండా సవరణ చేయాలని కోరారు. ఉత్తర్వుల్లో ఈ నెల 30న.. అని ఉంటే తాము రిజిస్ట్రార్‌ను అభ్యర్థించేందుకు అవరోధం ఏర్పడుతుందని చెప్పారు. రూల్స్ ప్రకారం పిటిషన్‌ను తగిన బెంచ్‌కు పోస్ట్ చేసేందుకు తామిచ్చిన ఉత్తర్వులు అడ్డంకి కాబోదని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

ఎన్నారై ప్రతినిధులతో నేడు కేటీఆర్ వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచ వ్యాప్తంగా 52 దేశాల్లో ఉన్న బీఆర్‌ఎస్ ఎన్నారై శాఖల ప్రతినిధులతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎన్నారై శాఖల కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల ఒక ప్రకటనలో తెలిపారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ తరపున విస్తృత ప్రచారం నిర్వహించామని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే తరహాలో కృషి చేయాలని కోరారు. వీడియో కాన్ఫరెన్సులో కేటీఆర్‌తోపాటు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ అనిల్ కూర్మాచలం తదితరులు పాల్గొంటారు.

కార్డులు సరే...ఓట్లేవీ?

(మొదటిపేజీ తరువాయి)

లేవనెత్తిన పలు అంశాలకు అధికారులు సమాధానాలు చెప్పలేకపోయారు. దొంగ ఓట్లు, బోగస్ ఓట్లపై రాజకీయపార్టీలు లేవనెత్తిన అభ్యంతరాలపై 'అలాంటివి ఏవైనా మీకు తెలిస్తే...మా దృష్టికి తెస్తే పరిశీలిస్తాం' అని ముక్తసరి సమాధానంతో సరిపుచ్చారు. ముఖ్యంగా హైదరాబాద్ పాతబస్తీలో లక్షల సంఖ్యలో దొంగ ఓట్లు ఉన్నాయని రాజకీయపార్టీలు ప్రస్తావించాయి. అలాగే చిరునామా, నియోజకవర్గం మార్పులు కోరుతూ ఓటర్లు దరఖాస్తులు చేసుకుంటే, పాత నియోజకవర్గంలో ఓట్లు తొలగించకుండా, కొత్త నియోజకవర్గంలో ఓటుహక్కు కల్పిస్తున్నారు. దీనితో సదరు ఓటరుకు రెండుచోట్లా ఓట్లు ఉంటున్నాయి. అలాగే ఒకే ఇంటినెంబర్‌తో ఉన్న కుంటుంబ సభ్యులకు వేర్వేరు పోలింగ్ బూత్‌ల్లోకి ఓట్లు డివైడ్ చేస్తున్నారు. దీనితో తమ ఓట్లు లేవనే ఆందోళనలు పెరుగుతున్నాయి. పోలింగ్‌కు ఐదు రోజుల ముందు పోల్ చిట్స్ ఇస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది. అయినా ప్రతిసారీ పోలింగ్ రోజు ఓటర్లకు తిప్పలు తప్పట్లేదు.

ఓటరు గుర్తింపు కార్డులు ఇచ్చేదీ...ఓటర్ల జాబితా రూపొందించేదీ ఎన్నికల సంఘమే అయినప్పుడు ఈ రెండింటికీ మధ్య సంబంధం లేదనడం ఏంటనేది కామన్‌మ్యాన్ ప్రశ్న! అలాగే డూప్లికేట్, బోగస్, దొంగ ఓట్లు తొలగించకుండా, ఆ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతాన్ని ప్రకటించడంపైనా సవాలక్ష సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరణించిన వారి ఓట్లను పురపాలక సంఘాలు జారీ చేసిన మరణ ధృవీకరణ పత్రాల ఆధారంగా తొలగిస్తున్నారు. ఎక్కడా క్షేత్రస్థాయి విచారణ లేదు. ఈ ఏడాది ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు ఈ విధంగా దాదాపు 2.60 లక్షల ఓట్లు తొలగించినట్టు సమాచారం. ఓ గ్రామంలో ఓటు హక్కు ఉండి, మరో ప్రాంతంలో మరణిస్తే, సదరు వ్యక్తి ఓటు ఆ జాబితాలో అలాగే ఉండిపోతున్నది. దీనితో ఓటర్ల సంఖ్య తగ్గట్లేదు. ఆ ప్రభావం పోలింగ్ శాతంపై పడుతున్నది. ఈ సారైనా ఎన్నికల సంఘం ఈ సమస్యలపై దృష్టి పెడుతుందో...లేదో...!!

కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాంరాం

పథకాలు కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. రైతుబంధు అనే పదాన్ని పుట్టించిందే కేసీఆర్ అన్నారు. ఈ పథకాన్ని వ్యవసాయ నిపుణులు స్వామినాథన్, ఐక్యరాజ్యసమితి ప్రశంసించాయని గుర్తు చేశారు. కానీ రైతుబంధు దుబారా..!, వేస్టు అని మాజీ టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటుంటే.. ప్రస్తుత టీపీసీసీ అధ్యక్షులు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలంటున్నారు.. ఇది కరెక్టేనా అని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు వస్తే కరువు తొంగిచూడదన్నారు. ఇన్నాళ్లు ఎవరైనా దళితబంధు ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. ప్రతి తండాను పంచాయతీని చేయడంతో వాళ్ల తండాల్లో వాళ్లే రాజ్యం చేస్తున్నారని చెప్పారు. గిరిజనులకు పోడుపట్టాలు పంపిణీ చేసి, వాళ్లపై పెట్టిన కేసులు ఎత్తివేశామన్నారు. అలాంటిది కాంగ్రెస్ నాయకులు రూ.వెయ్యి ఇచ్చి, గుడుంబా పోస్తే లంబాడోళ్లు ఓట్లు వేస్తారని గిరిజనులను చులకన చేసి మాట్లాడు తున్నారన్నారు. గత రెండు పర్యాయాలు ఖమ్మం జిల్లా ప్రాతినిధ్యం లేకుండానే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, ఈసారి అలాకాకుండా బీఆర్‌ఎస్ అన్ని స్థానాల్లో గెలిచేలా కృషి చేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఇంటి మనిషిలా మీలో ఒక్కడిగా ఉన్న కందాల ఉపేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సభలో బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, వైరా బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్, ఎమ్మెల్యే రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు. హన్మకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామంలో జరిగిన 'ప్రజా ఆశీర్వాద సభ'లో సీఎం మాట్లాడారు. 24 గంటల కరెంటు కావాలన్నవాళ్లు చేతులు ఎత్తాలని ప్రజలకు చెప్పిన సీఎం.. కెమెరాలన్నింటినీ ఆ చేతుల వైపు తిప్పాలని కోరారు. రాష్ట్రంలో అధికారం కోసమే కాంగ్రెస్ నేతలు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో వర్ధన్నపేటలో ఎస్సారెస్పీ కాలువల్లో చెట్లు మొలిచి అధ్వాన్నంగా ఉండేవని, ఇప్పుడు ఐనవోలు, హసన్‌పర్తి మండలాలకు దేవాదుల ప్రాజెక్టు నీరు తీసుకొచ్చామని తెలిపారు. రింగ్ రోడ్డు కోసం ల్యాండ్ పూలింగ్ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, అరూరి రమేష్‌ను నేరుగా ఓడించడం చేతకాని వాళు చేస్తున్న పనని, ల్యాండ్ పూలింగ్ ఏమి ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఫించన్‌ను మార్చి నెల అనంతరం సంవత్సరానికి రూ.500ల చొప్పున పెంచుతూ రూ.5,016కు పెంచుతామన్నారు. వచ్చే మార్చి తరువాత రేషన్‌కార్డులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ఉన్న 42 విలీన గ్రామాల్లో సాదాబైనామాలను రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఎన్నికల అనంతరం ఇస్తామని హామీనిచ్చారు. రైతు, సంక్షేమ రాజ్యాంగా రాష్ట్రాన్ని తీర్చి దిద్దుకున్నామన్నారు. మంత్రి దయాకర్‌రావు, మాజీ మంత్రి కడియం శ్రీహరిలది కూడా వర్ధన్నపేట నియోజకవర్గమేనని, వారిద్దరి ఆశీస్సులు అరూరి రమేష్‌కు ఉన్నాయన్నారు. కాగా, సీఎం కేసీఆర్ ప్రసంగం సభికులను ఆకట్టుకోలేకపోవడంతో ప్రజలు తిరిగి వెళ్లిపోవడం గమనార్హం. దాంతో సభ 15 నిమిషాల్లోనే ముగించారు.

మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు రహదారిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆశీర్వాద సభలో సీఎం మాట్లాడుతూ.. ధరణి, రైతుబంధు వద్దంటున్న ఆ నలుగురు రాహుల్‌గాంధీ, ఉత్తమ కుమార్ రెడ్డి, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలను బంగాళాఖాతంలో కలిపేయాలన్నారు. ఎవరో వచ్చారని ఏదో చెప్పారని, లీడర్ చెప్పారని, బామ్మర్ది చెప్పాడని ఓటు వేయ వద్దని, గాబరా పడొద్దని, గోల్‌మాల్ కావొద్దని ఆలోచించి ఓటు వేయండని, తెలంగాణను దళార్లపాలు పైరవీకార్ల పాలు చేయొద్దని, పనిచేసే ప్రభుత్వానికి పట్టంకట్టాలని కోరారు. రైతుబంధు 4000తో స్టార్ట్ చేసి భవిష్యత్తులో 16,000 ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశారని అన్నారు. సభలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర గిరిజన సంక్షేమం, మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఛీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ దయాకర్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యే నరేందర్, డీసీసీబీ చైర్మెన్ మార్నేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభకు వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తా మహిళ మృతి.. 10మందికిపైగా గాయాలు

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్ళచెరువు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు వస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఒక మహిళ మృతి చెందగా 10 మందికి పైగా గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గైగొల్లపల్లి గ్రామానికి చెందిన 20 మంది కేసీఆర్ సభకు ట్రాక్టర్‌పై బయలుదేరగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి మండలంలోని నాన్ తండా దగ్గర రోడ్డు పక్కన ఉన్న వరి పొలంలో బోల్తా పడింది. ట్రాక్టర్ ట్రక్కు తిరగలపడటంతో వరి పొలంలో జనం కూరుకుపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు ట్రాక్టర్‌ను వెంటనే పైకి లేపి జనాలను బురదలో నుంచి ఒడ్డుకు తీసుకువచ్చారు. అల్లి అనసూర్య (55) అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు 10 మందికి కాళ్లకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 ద్వారా ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

చనిపోయిన మహిళ కుటుంబానికి రూ. 50లక్షలు ఇవ్వాలి : పొంగులేటి

ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి చెందిన సంఘటన బాధాకరమని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మెన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంఘటనకు సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ నైతిక బాధ్యత వహించాలన్నారు. చనిపోయిన వ్యక్తి కుటుంబానికి రూ. 50లక్షలు, గాయపడిన వారికి రూ. 10లక్షల చొప్పున పార్టీ తరుపున ఆర్థిక సాయం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ రనవుట్..బీజేపీ డకవుట్...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనసభకు నిర్వహించబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ రనవుట్.. బీజేపీ డకవుట్ కావటం ఖాయమని రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. సీఎం కేసీఆర్ సెంచరీ కొట్టి (వంద సీట్లు గెలవటం) హ్యాట్రిక్ నమోదు చేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ మాజీ కార్యదర్శి సింగిరెడ్డి సోమశేఖరరెడ్డి, ఆయన భార్య, ఏఎస్‌రావు నగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష, చేవెళ్ల రవి కుమార్ (బిత్తిరి సత్తి) తదితరులు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ అంటేనే మాటలు, ముఠాలు, మంటలంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బలమైన నాయకత్వం ఉండాలా..? లేక బలహీనమైన నాయకత్వం ఉండాలా..? అని ప్రశ్నించారు. తమ వైపు బలమైన కేసీఆర్ ఉన్నారు..? మరి కాంగ్రెస్, బీజేపీల వైపు ఎవరున్నారంటూ ప్రశ్నించారు. ఎవరెన్ని ట్రిక్కులు వేసినా హ్యాట్రిక్ కొట్టేది మాత్రం కేసీఆరేనని అన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని చెప్పారు. ఇక్కడ జరిగిన అభివృద్ధిని అగ్ర హీరోలు రజనీకాంత్, సన్నీ డియోల్ ప్రశంసించారని గుర్తు చేశారు. 'మన రాష్ట్రం అభివృద్ధి చెందిందనే విషయం పక్కనున్న రజనీలకు తెలిసింది.. కానీ ఇక్కడున్న గజనీలకు మాత్రం అర్థం కావటం లేదు...' అని విమర్శించారు. కేసీఆర్ అధికారంలోకి రాకపోతే వ్యాపారాలు దెబ్బ తింటాయి.. హైదరాబాద్ మరో అమరావతిలాగా మారిపోతుందని చాలా మంది భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో జీహెచ్‌ఎమ్‌సీ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ బీఆర్‌ఎస్‌ను గెలిపించాలంటూ ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

ఉల్లి మంట

(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో అధికారం కోల్పోయింది. దేశంలో స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన తొలి కాంగ్రెసేతర జనతా పార్టీ ప్రభుత్వం కూడా ఉల్లి ధరల ధాటికి 1980 సార్వత్రిక ఎన్నికల్లో పతనమైంది. ఇప్పుడు అదే కమలదళాన్ని కలవరపెడుతోంది. దేశంలో సగటు ఉల్లి చిల్లర ధరలు ఏకంగా 57% పెరగడంతో రిటైల్ మార్కెట్లలో కిలో ఉల్లిని పాతిక రూపాయలకు విక్రయించాలని కేంద్రం శుక్రవారం నిర్ణయించింది. వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపిన సమాచారం ప్రకారం దేశంలో సగటున కిలో ఉల్లి ధర రూ.47కి చేరింది. గత సంవత్సరం ఇదే సమయంలో ఉల్లి ధర రూ.30 పలికింది. దేశ రాజధానిలో శుక్రవారం కిలో ఉల్లిని రూ.40కి విక్రయించారు. ఆగస్ట్ మధ్య నుండే ఉల్లిని కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నామని, ధరలు మరింత పెరగకుండా ఇప్పుడు రిటైల్ మార్కెట్లలో వినియోగదారులకు తక్కువ ధరకే వాటిని అందుబాటులో ఉంచామని వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ చెప్పారు. ఆగస్ట్ మధ్య నుంచి 1.7 లక్షల టన్నుల ఉల్లిని 22 రాష్ట్రాలలోని వేర్వేరు ప్రాంతాలలో నిల్వ చేసి ఉంచారు. ఆ నిల్వలను రిటైల్ మార్కెట్లలో ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ వంటి సహకార సంస్థలు, వాహనాల ద్వారా కిలో రూ.25కి సబ్సిడీ రేటుపై వినియోగదారులకు అందజేస్తున్నారు. రాజధాని ఢిల్లీలో కూడా సబ్సిడీ రేటుపై ఉల్లిని విక్రయిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఉల్లి సాగు ఆలస్యమైందని, దీంతో పంట ఆలస్యంగా చేతికి వచ్చిందని వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఖరీఫ్ పంట ఇప్పటికే మార్కెట్‌కు చేరాల్సి ఉండగా ఇంకా రాలేదు. మరోవైపు నిల్వ చేసిన రబీ ఉల్లి నిల్వలు ఖాళీ అవుతున్నాయి. దీంతో సరఫరా పరిస్థితి సంక్లిష్టంగా మారింది. ఫలితంగా అటు హోల్‌సేల్ మార్కెట్‌లోనూ, ఇటు రిటైల్ మార్కెట్‌లోనూ ఉల్లి ధరలు పెరిగాయి. ఈ సంవత్సరం ఉల్లిని రెట్టింపు పరిమాణంలో నిల్వ చేశామని, దీనివల్ల దేశీయంగా ఉల్లి లభ్యత పెరిగి రాబోయే రోజుల్లో ధరలు అందుబాటులోకి వస్తాయని ఆ అధికారి ఆశాభావం వ్యక్తం చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ ద్వారా వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఐదు లక్షల టన్నుల ఉల్లిని నిల్వ చేసింది. రాబోయే రోజుల్లో మరో రెండు లక్షల టన్నులు సేకరించాలని భావిస్తోంది.

కరీంనగర్ కలెక్టర్, పోలీసు కమిషనర్‌లపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేశారు. వీరిద్దరిపై ఆ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.వేటు అయిన అధికారులు ఇద్దరూ తమ క్రింది అధికారులకు బాధ్యతలు అప్పగించి, జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో రిపోర్టు చేయాలని సీఎస్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ఎలక్షన్ వార్ 2023





విజన్ ఉన్న నాయకుడు ప్రతిపక్షంలో ఒక్కరూ లేడు

- ఎన్నికల్లో పైసలు, మందు పంచను : మంత్రి కె.తారక రామారావు

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

విజన్ ఉన్న నాయకుడు ప్రతిపక్షంలో ఒక్కరూ లేడని, ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి ఏ క్షణంలోనైనా జైలుకు వెళ్లడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడారు. 55ఏండ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా రాష్ట్రానికి ఏం చేయలేదన్నారు. 2014లో మోడీ జన్ దన్ యోజన ఖాతాలు తీస్తే రూ.15లక్షలు ఖాతాల్లో వేస్తానని చెప్పి ఇప్పటి వరకు వేయలేదని విమర్శించారు. బండి సంజయ్.. మాట మాటకి మోడీని దేవుడని సంభోదిస్తుంటారని, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచినందుకా, ప్రతి ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇవ్వనందుకా దేనికి మోడీ దేవుడో చెప్పాలని ప్రశ్నించారు. ఒక్క వందే భారత్ రైలుకు వంద సార్లు జెండా ఉపిండని, సిరిసిల్లకు ఒక్క పవర్ లూమ్ క్లస్టర్ అడిగితే ఇవ్వలేదని, కనీసం బండి సంజయ్ ప్రయత్నం కూడా చేయలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ పైసలు పంచాలని చూస్తున్నాయని, తాను మాత్రం ఎన్నికల్లో పైసలు, మందు పంచనని స్పష్టం చేశారు. సిరిసిల్ల దయతో తనకంటూ ఒక గుర్తింపు వచ్చిందని, సిరిసిల్ల రుణం తీర్చుకుంటానన్నారు. పాయలాగా ఉన్న మానేరు వాగులో ఇప్పుడు 365 రోజులూ నీళ్ల ఉంటున్నాయని, సజీవ జలధార మాదిరిగా మార్చింది కేసీఆర్ ప్రభుత్వం కాదా అని గుర్తు చేశారు. 400 కోట్లతో వర్కర్ టూ ఓనర్ షెడ్లు కడుతున్నామని, 375 ఎకరాల్లో అక్వాహబ్ ఏర్పాటు కాబోతుందని చెప్పారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తెస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమంలో సిరిసిల్ల గణనీయంగా మారిందన్నారు. ప్రజలు ఓటు అనే అస్త్రాన్ని వాడి మంచి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. 2014 ముందు సిరిసిల్ల ఎట్లా ఉండేదో, ఇప్పుడు ఎట్లా ఉందో పాత ఫోటోలు కొత్త ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు సుంకపాక మనోజ్ సభ్యుని హరీష్, సికిందర్, మున్సిపల్ కౌన్సిలర్లు, యువత పాల్గొన్నారు.


సింగరేణిలో గండర గండ్రలు

భూపాలపల్లిలో 'గండ్ర'ల మధ్యే పోటీ..

- మారుతున్న రాజకీయ సమీకరణలు
- బీఆర్ఎస్‌లో ప్రకంపనలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూపాలపల్లి నియోజకవర్గానికి ప్రత్యేక స్థానముంది. ప్రతి ఎన్నికల్లో అభ్యర్థుల మధ్య పోటీ అత్యంత ఉత్కంఠభరితంగా జరుగుతోంది. ప్రతిసారీ ఇక్కడి ఎన్నికలు నువ్వా? నేనా? అన్నట్టుగా జరుగుతుండటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచాక బీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఇదిలావుంటే కాంగ్రెస్ తొలి జాబితాలోనే కాంగ్రెస్ అభ్యర్థిగా గండ్ర సత్యనారాయణరావు, బీజేపీ అభ్యర్థిగా చందుపట్ల కీర్తిరెడ్డి పేర్లు ఖరారయ్యాయి. దాంతో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారవడంతో ఎవరికివారు తమదైన శైలిలో ఎత్తులు పైఎత్తులు వేస్తూ ప్రచారాన్ని ఉరకలెత్తిస్తున్నారు. తొలి నుంచే బీఆర్ఎస్ ఇతర పార్టీల నేతలను చేర్చుకోవడం షురూ చేయగా, తాజాగా గండ్ర సత్యనారాయణరావు బీఆర్ఎస్‌కు భారీ షాక్ ఇచ్చారు. భూపాలపల్లి మున్సిపాలిటీలోని ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దాంతో ఈసారి 'గండ్ర'ల మధ్య రసవత్తరపోరు జరుగనున్నట్టు తెలుస్తోంది.



గండ్ర వెంకటరమణారెడ్డి　గండ్ర సత్యనారాయణరావు

ఆ ఇద్దరి మధ్యే

భూపాలపల్లి నియోజకవర్గంలో అటు బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరమణారెడ్డి, ఇటు కాంగ్రెస్ అభ్యర్థి సత్యనారాయణరావు ఇంటి పేర్లు 'గండ్ర'నే కావడం గమనార్హం. ఈసారి పోటీ ఈ ఇద్దరు నేతల మధ్యనే ఉండనున్నది. 2009లో భూపాలపల్లి నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గండ్ర వెంకటరమణారెడ్డి, తన సమీప టీఆర్ఎస్ ప్రత్యర్థి సిరికొండ మధుసూదనాచారిపై 11,972 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి సిరికొండ మధుసూదనాచారి, కాంగ్రెస్ ప్రత్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డిపై 7,214 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ పొత్తులో భాగంగా బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన గండ్ర సత్యనారాయణరావు గట్టి పోటీనిచ్చారు.

2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గండ్ర వెంకటరమణారెడ్డి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున పోటీ చేసిన గండ్ర సత్యనారాయణరావుపై 15,635 ఓట్లతో విజయం సాధించారు. ఇలా పలు ఎన్నికల్లో గండ్ర వెంకటరమణారెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, సిరికొండ మధుసూదనాచారి మధ్య ఉత్కంఠభరితంగా పోటీ సాగింది. ఈసారి ఇద్దరు 'గండ్ర'లు పోటీలో ఉండగా 'సిరికొండ' పోటీలో లేరు. బీఆర్ఎస్‌లో కీలక నేతగా వ్యవహరిస్తున్న 'సిరికొండ' మద్దతుపై బీఆర్ఎస్ శ్రేణుల్లో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి.

భూపాలపల్లిలో తాజా చేరికలతో నియోజకవర్గంలో రాజకీయం మరింత వేడెక్కింది. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరమణారెడ్డి తరపున ఆయన సతీమణి, వరంగల్ రూరల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతితోపాటు కుమారుడు గౌతంరెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు ఒంటరి పోరాటంతో ప్రచారం ముమ్మరం చేశారు. ఏదేమైనా ఈసారి సింగరేణి కోటలో ఇద్దరు 'గండ్ర'ల మధ్య మరోమారు ఉత్కంఠపోరు తప్పదని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

నియోజకవర్గ తొలి ఎన్నిక నుంచి...

2009లో పరకాల నియోజకవర్గం నుంచి వేరుపడి భూపాలపల్లి నియోజకవర్గం ఏర్పడింది. తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగిన గండ్ర వెంకటరమణారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో వెంకటరమణారెడ్డి ఓడిపోయి, 2018 ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. తాజాగా జరగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా గత మూడు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన గండ్ర సత్యనారాయణరావు ఈసారీ రంగంలోకి దిగుతున్నారు. కాగా, ఒకవైపు మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి గ్రూపు, మరోవైపు పార్టీలోని అసమ్మతి, అసంతృప్తితో ఉన్న ప్రజాప్రతినిధులు, నేతలు పక్క చూపులు చూడకుండా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొంతమంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడం బీఆర్ఎస్ నేతలకు తలనొప్పిగా మారింది.

ఒకేసారి మూడు చోట్ల విజయం...



ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1957 ఎన్నికల్లో చిలుపూర్ మండలంలోని చిన్న పెండ్యాల గ్రామానికి చెందిన పెండ్యాల రాఘవరావు మూడు చోట్ల విజయం సాధించారు. పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా వరంగల్ లోక్‌సభ, హన్మకొండ, వర్ధన్నపేట శాసనసభ స్థానాలకు పోటీ చేశారు. ఆయనకు మూడు స్థానాల్లోనూ ప్రజలు పట్టం కట్టారు. హన్మకొండ, వర్ధన్నపేట శాసనసభ స్థానాలకు రాజీనామా చేసి వరంగల్ లోకసభ సభ్యుడిగా ఐదేండ్లపాటు పని చేశారు.



ఏ నేత ఎక్కువ డబ్బు ఇస్తాడో పోల్చుకొని ఓటు వేయకండి. ఏ నేత చేతిలో మీ భవిష్యత్ సురక్షితంగా ఉంటుందని భావిస్తున్నారో వారికే ఓటు వేయండి. కొద్దిపాటి నగదు కోసం మీ ఆత్మగౌరవాన్ని, భవిష్యత్‌ను అమ్ముకోవద్దు.

– కమల్‌హాసన్, ప్రముఖ సినీనటుడు

ప్రచారంలో 'పల్లా'కు సమస్యల సెగ

గ్రామ సమస్యలపై ఫ్లెక్సీ ఏర్పాటు

నవతెలంగాణ-కొమురవెల్లి

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డికి నిరసన సెగ తగిలింది. శుక్రవారం గ్రామానికి ప్రచారం కోసం వెళ్లడంతో గ్రామస్తులు 26 అంశాలతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు. తొమ్మిదిన్నర ఏండ్ల కేసీఆర్ పాలనలో స్థానిక ఎమ్మెల్యే గ్రామంలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని, కనీసం ఒక్కరికి కూడా డముల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వ భూమి ఉన్నా ఒక్క దళిత కుటుంబానికి భూమి ఇవ్వలేదని, గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు అయినాపూర్ నుంచి నడిచి వస్తున్నారనీ, మిషన్ భగీరథ నీళ్లు తాగే పరిస్థితి గ్రామస్తులకు లేదని పల్లాను నిలదీశారు. ఫ్లెక్సీలో ఏర్పాటు చేసిన సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ గతంలో ఉన్న ఎమ్మెల్యే ఏం చేశాడో తనకు తెలువదన్నారు. మరోసారి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత గ్రామానికి చేయాల్సిన పనులన్నీ చేస్తామని, ప్రచారానికి వచ్చిన అభ్యర్థిని నిలదీసే హక్కు గ్రామస్తులకు లేదని పల్లా సమాధానం చెప్పారు.





సంగారెడ్డి జిల్లాలో పట్టుబడిన బంగారు నగలు

భారీగా బంగారం, నగదు పట్టివేత

నవతెలంగాణ-విలేకరులు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి ఆధారాలు లేకుండా భారీ ఎత్తున నగదు, బంగారాన్ని తరలిస్తున్న వారిని తనిఖీలు చేసి పట్టుకున్న ఘటనలు శుక్రవారం పలు జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం మాడ్గి వద్ద గల అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద రూ.4.55కోట్లు విలువ చేసే 6,986.30 గ్రాముల బంగారు నగలు పట్టుబడ్డాయి. గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ స్కార్పియో వాహనంలో సరైన ఆధారాలు లేకుండా ఆ నగలును తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీలో మధ్యాహ్నం వాహన తనిఖీలు చేపట్టగా జహంగీర్‌పీర్ దర్గా వైపు అనుమానాస్పదంగా స్కూటీపై వెళ్తున్న శ్రీనివాస శాస్త్రి అనే వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. అతని వద్ద రూ.7 లక్షలు పట్టుబడ్డాయి. నగదుకు ఎలాంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్టు సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. తాండూరు పట్టణంలో నిర్వహించిన తనిఖీల్లో శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద రూ.2.50లక్షలు పట్టుకున్నట్టు సీఐ రాజేందర్ తెలిపారు.

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఇన్నోవాలో తీసుకెళ్తున్న రూ.3లక్షలు నగదును పట్టుకున్నామని హెడ్ కానిస్టేబుల్ నాందేవ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ భగత్‌సింగ్ నగర్ ప్రాంతంలో సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.3లక్షల నగదును పట్టుకున్నట్టు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. బెల్లంపల్లి వన్‌టౌన్ పరిధిలోని కాంటా ఏరియా సమీపంలో జరిగిన వాహన తనిఖీల్లో స్టేషన్ రోడ్డుకు చెందిన ఎండీ రాజ్‌మొహమ్మద్ వద్ద పోలీసులు రూ.2లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ బన్సీలాల్ తెలిపారు.

పంచ్ తంత్రం!

బీసీకుల నాయకుడినే
చేస్తారట ముఖ్యమంత్రి
బీసీ కులగణన ఏది
ఆపండిక మీ భజంత్రి !!
చెప్పేవాడికి ఎపుడూ
వినేవాడు లోకువ
అబద్దాల అర్ధరాత్రి
అరుదెంచదు వేకువ !!



– సత్యానంద్

రైతు బాంధవుడు బోడేపూడి

నీతి, నిజాయితీకి మారుపేరు

- ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు దిగ్గజం
- మధిర ప్రజల ఆత్మీయ మిత్రుడు
- ఎమ్మెల్యేగా మూడు సార్లు విజయం
- అలాంటి వారు చట్టసభల్లో ఉండాలనేది ప్రజల ఆకాంక్ష



బోడేపూడి వెంకటేశ్వరరావు



వైరా రిజర్వాయర్ లో నిర్మించిన బోడేపూడి సుజల స్రవంతి పథకం

ఆణిముత్యాలు..

నవతెలంగాణ - బోనకల్

రైతులు పండించిన పంటలకు సాగు నీరందించేందుకు అహర్నిశలూ కృషి చేసి తన జీవితాన్ని ప్రజా సమస్యల పరిష్కారం కోసం అంకితం చేసిన కమ్యూనిస్టు యోధులు బోడేపూడి వెంకటేశ్వరరావు. మరణించే వరకు ప్రజా సేవలోనే గడిపారు. 1985, 1989, 1994 ఎన్నికల్లో వరుసగా సీపీఐ(ఎం) అభ్యర్థిగా బోడేపూడి వెంకటేశ్వరరావు విజయం సాధించారు. అంతకుముందు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, ఇండిపెండెంట్ అభ్యర్థులు విజయం సాధించారు. కానీ మధిర నియోజకవర్గ అభివృద్ధి బోడేపూడి నుంచే ప్రారంభమైంది. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా నందమూరి తారక రామారావు, నారా చంద్రబాబు నాయుడు ఉన్న సమయాల్లో బోడేపూడి ఎమ్మెల్యేగా, సీపీఐ(ఎం) శాసనసభాపక్ష నాయకులుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే అంటే ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు. శాసనసభలో అధికార ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు జరిగిన సమయంలో ఆ రెండు పార్టీల నేతలు బోడేపూడి చెప్పిన సూచనలకు కట్టుబడి ఉండేవారు. ఆ విధంగా శాసనసభలో ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి సంధానకర్తగా కూడా వ్యవహరించి ప్రజా నాయకుడిగా పేరు సంపాదించారు. మధిర నియోజకవర్గ సమస్యలపై మాట్లాడుతున్న సమయంలో ఎన్‌టీఆర్, చంద్రబాబు వెంటనే స్పందించేవారు. బోడేపూడి వెంకటేశ్వరరావు ప్రస్తావించిన అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించేవారు. శాసనసభలో తన వాగ్దాటితో ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటడమే కాదు. వాటికి పరిష్కారాలనూ సాధించేవారు.

రైతు బాంధవుడు బోడెపూడి

ఆనాడు ప్రభుత్వం రెండు మంచినీటి పైలెట్ ప్రాజెక్టులను మంజూరు చేయగా.. అందులో మధిర నియోజకవర్గం ఉండటం విశేషం. మధిర నియోజకవర్గ ప్రజలు మంచినీటి సమస్యతో ప్రధానంగా ఫ్లోరైడ్ నీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శాసనసభలో బోడేపూడి ప్రస్తావించారు. ఫ్లోరైడ్ నీటిని తాగటం వల్ల కాళ్లు వాపులు వస్తున్నాయని స్వయంగా తన కాళ్లను శాసనసభలో చూపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మధిర నియోజకవర్గానికి మంచినీటి పైలెట్ ప్రాజెక్టును మంజూరు చేసింది. ఆ వెంటనే నిర్మాణ పనులు కూడా ప్రారంభించింది.

మధిర నియోజకవర్గంలో ఆనాడు ఎర్రుపాలెం, మధిర, బోనకల్, వైరా, తల్లాడ మండలాలు ఉన్నాయి. ఈ మండలాలకు ప్రధాన కేంద్రంగా వైరా ఉండటంతో వైరా చెరువులో పైలెట్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి మధిర నియోజకవర్గంలోని 104 గ్రామాలకు మంచినీటి సరఫరా చేశారు.

బోడేపూడి మరణాంతరం మంచినీటి పైలెట్ ప్రాజెక్టుకు బోడేపూడి సుజల స్రవంతి పథకంగా నామకరణం చేశారు. నియోజకవర్గంలో సాగు నీటి సమస్య ఏర్పడినప్పుడు మధిర నియోజకవర్గ రైతులు అధికారులకు కాకుండా బోడేపూడికే ఫోన్ చేసేవారు. ఇంటికి వెళ్లి తమ గోడును వివరించేవారు. రైతుల సమస్యలు విన్న వెంటనే ఆయన కాలువల మీద పర్యటించేవారు.

వయసు మీద పడినా లెక్కచేయకుండా రైతుల కోసం రాత్రి, పగలు తేడా లేకుండా కృషి చేసి నీటిని విడుదల చేయించడంలో, పంటలను కాపాడటంలో బోడేపూడి నిర్విరామంగా కృషి చేశారు. ఆయన ఎక్కువగా రైతులతోనే గడిపారు. నిత్యం కాలువలు బాగున్నాయా లేదా అని చూసి మరమ్మతులు చేయించేవారు. అందుకే ప్రజలు బోడేపూడికి రైతు బాంధవుడుగా నామకరణం చేశారు. అంతర్గత రోడ్లు, రోడ్ల ఫార్మేషన్, సాగు, తాగునీటి సమస్య పరిష్కారంలో ప్రధాన భూమిక వహించారు.

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా..

మధిర నియోజకవర్గంలో ఆనాడు అనేక గ్రామాలకు రోడ్ల సౌకర్యం లేదు. కరెంటు సమస్య తీవ్రంగా ఉండేది. ఆయన ఎమ్మెల్యే కాగానే ప్రధానంగా రోడ్లు, కరెంటు సమస్య, సాగునీటి, తాగునీటి సమస్య పరిష్కారం చేసి నియోజకవర్గ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. జన్మభూమి కార్యక్రమం సందర్భంగా మధిర నియోజకవర్గంలో బోనకల్ మండలం ముష్టికుంట గ్రామంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. బోడేపూడి మరణించిన సమయంలోనూ చంద్రబాబు దగ్గర ఉండి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ప్రజలకు, పార్టీకి నిబద్ధుడు

సీపీఐ(ఎం) నిబంధనలకు కట్టుబడి తూ.చా తప్పకుండా పాటించేవారు. ఏ సమస్య వచ్చినా పార్టీ నిబంధనలకు లోబడే పని చేసేవారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నా దానిని ప్రజల కోసమే ఉపయోగించారు. ఆడంబరాలకు పోకుండా సాధారణ జీవితాన్ని గడేపేవారు. మధిర నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. సాగర్ నీరు అనగానే రైతులందరికీ గుర్తుకు వచ్చేది నేటికీ బోడేపూడి వెంకటేశ్వరరావే కావడం విశేషం. నీటి సమస్య రాగానే బోడేపూడి లేకపోవడం వల్లే మనకి ఈరోజు ఈ పరిస్థితి ఏర్పడిందని, అదే ఆయన ఉంటే ఈ సమస్య ఉండేది కాదని రైతులు స్మరించుకుంటున్నారంటే ఆయన రైతులకు ఏ విధంగా సేవలు చేశారో అర్థం అవుతుంది. అటువంటి నాయకుడు చట్టసభల్లో ఉండాలని రైతులు, ప్రజలు కోరుకుంటున్నారు. జనం గుండెల్లో ఆయన చిరంజీవి.



ఆనాటి జన్మభూమి కార్యక్రమంలో మాట్లాడుతున్న బోడేపూడి, వేదికపై అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు

పది సార్లు కమ్యూనిస్టు పార్టీలదే హవా

భద్రగిరి ప్రత్యేకం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం మన్యం ఒక ప్రత్యేక నియోజకవర్గం. తెలంగాణ రాష్ట్రానికి చిట్టచివరి నియోజకవర్గం. నాలుగు రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతంగా భద్రాచలం ఏజెన్సీ ఉంది. పూర్తిస్థాయిలో ఆదివాసీ జీవన విధానం కలిగిన ఏజెన్సీ ప్రాంతం. దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన రామాలయం, పర్ణశాల, బొగత జలపాతంతో పాటు పూర్వపు నియోజకవర్గంలో మోతుగూడెం, సీలేరు, పొల్లూరు, పాపికొండల అందాలకు నెలవు. అవి భద్రాచలం నియోజకవర్గంలో ప్రత్యేక పర్యాటక ప్రదేశాలుగా ఉండేవి. 1952లో అతిపెద్ద నియోజకవర్గంగా ఏర్పడిన భద్రాచలం నియోజకవర్గం 2018 వచ్చేసరికి అతి చిన్న నియోజకవర్గంగా మారింది. 2014 వరకు 9 మండలాలతో ఎన్నికల బరిలో నిలిచిన నియోజకవర్గం.. తర్వాతి కాలంలో పోలవరం ముంపు పేరుతో వీఆర్‌పురం, కూనవరం, చింతూరు, భద్రాచలం మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో కలిసిపోగా వాజేడు, వెంకటాపురం, చెర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం పట్టణం మాత్రమే భద్రాచలం నియోజకవర్గంగా తెలంగాణ రాష్ట్రంలో మిగిలాయి. ప్రస్తుతం భద్రాచలం నియోజక వర్గంలో 1,45,964 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 70,051, మహిళలు 75909, ఇతరులు నలుగురు ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 176 పోలింగ్ కేంద్రాలతో 17వ సారి పోలింగ్ జరగనుంది. ఇప్పటికే 16 సార్లు నియోజకవర్గానికి ఎన్నికలు జరగ్గా, అందులో 1985 నుంచి 1994 వరకు మూడుసార్లు వరుసగా గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా కుంజా బొజ్జి నిలిచారు. 1978లో ముర్ల ఎర్రయ్యరెడ్డి గెలుపుతో నియోజకవర్గంలో సీపీఐ(ఎం) ప్రస్థానం మొదలైంది. 2009 వరకు ఆ పార్టీ వరుస విజయాలతో దూసుకుపోయింది. సీపీఐ(ఎం) తరపున ముర్ల ఎర్రయ్య రెడ్డి రెండు సార్లు, కుంజా బొజ్జి మూడు సార్లు, సున్నం రాజయ్య మూడు సార్లు గెలుపొందారు. నియోజకవర్గం కమ్యూనిస్టు పార్టీకి పెట్టనికోటగా నిలిచింది.

సంవత్సరం	ఎమ్మెల్యే..
1952 ఇద్దరు..	కె.వి దొర, కృష్ణారావు (కె ఎంపీపీ పార్టీ)
1955 ఇద్దరు..	ఎండి తాసిల్, ఎస్ సీతారామయ్య (సీపీఐ)
1957	ఉప ఎన్నిక.పివి రావు (కాంగ్రెస్)
1962	మహమ్మద్ తాసిల్ (సీపీఐ)
1967	కన్నయ్య దొర (కాంగ్రెస్)
1972	మట్ట రామచంద్రయ్య (కాంగ్రెస్)
1978	ముర్ల ఎర్రయ్య రెడ్డి (సీపీఐ(ఎం))
1983	ముర్ల ఎర్రయ్య రెడ్డి (సీపీఐ(ఎం))
1985	కుంజా బొజ్జి (సీపీఐ(ఎం))
1989	కుంజా బొజ్జి (సీపీఐ(ఎం))
1994	కుంజా బొజ్జి (సీపీఐ(ఎం))
1999	సున్నం రాజయ్య (సీపీఐ(ఎం)
2004	సున్నం రాజయ్య (సీపీఐ(ఎం)
2009	కుంజా సత్యవతి (కాంగ్రెస్)
2014	సున్నం రాజయ్య (సీపీఐ(ఎం)
2018	పోదెం వీరయ్య (కాంగ్రెస్)

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



హైదరాబాద్‌లో..
బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 61,960	---	---
22 క్యారెట్లు	- 56,800	---	---
కిలో వెండి	- 77,500	▼	500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 114
రిటైల్ (లైవ్)	రూ. 136
స్కిన్‌తో	రూ. 197
స్కిన్‌లెస్	రూ. 224

గాజా దురాక్రమణ

ప్రణాళికను ఆలస్యం చేస్తున్న నేతాన్యాహు



గాజాపై దురాక్రమణ చెయ్యాలనే ఇజ్రాయిలీ సైనిక ప్రణాళికను తక్షణమే ఆమోదించటానికి ప్రధాని నేతాన్యాహు సిద్ధంగా లేడని న్యూయార్క్ టైమ్స్ రాసింది. తన వార్ క్యాబినెట్ అంతా గాజా దురాక్రమణను ఆమోదించాలని ఆయన పట్టుపడుతున్నాడు.అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై హమస్ చేసిన మెరుపు దాడి తరువాత హమస్‌ను నిర్మూలిస్తామని ఇజ్రాయిలీ నాయకత్వం ప్రతిన పూనింది. అయితే అది ఎలా, ఎప్పుడు, మొత్తంగానా లేక కొంచం కొంచం గానా అనే విషయాల పట్ల నాయకత్వానికి ఏకాభిప్రాయం లేదని టైమ్స్ వివిధ వనరులను ఉటంకిస్తూ చెప్పింది. హమస్ దాడి తరువాత ఇజ్రాయిల్ 3 లక్షలా 60 వేలమంది రిజర్వ్ సైన్యాన్ని సమీకరించి గాజాపై ఎడ తెగకుండా బాంబుల వర్షం కురిపి స్తోంది. శుక్రవారంనాడే గాజా దురా క్రమణను మొదలెట్టాలనే ఇజ్రాయిల్ రక్షణ దళాల ప్రణాళికను నేతాన్యాహు ఆమోదించలేదని రెండు ప్రధాన వనరుల నుంచి అందిన సమాచారం ఆధారంగా న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ఇజ్రాయిలీ జాతీయ భద్రతకు గత ఐదు దశాబ్దాలలో ఎన్నడూ ఏర్పడని ముప్పు హమస్ దాడితో ఏర్పడింది. ఖతార్ మధ్యవర్తిత్వంతో హమస్ చేతుల్లో బందీలుగా వున్న కొందరినైనా విడుదల చేయించవచ్చనే ఆశ వల్లనే గాజా దురాక్రమణ ఆలస్యం అవుతున్నదని కొందరు పరిశీల కులు భావిస్తున్నారు. ఇజ్రాయిలీ ప్రభుత్వంలోని కొందరు ప్రముఖులు గాజాపై పూర్తి స్థాయిలో దురాక్రమణ చేయకుండా పరిమితంగా చేసే దాడులతో సరి పెట్టాలని భావిస్తున్నారు. గాజాపై పూర్తి స్థాయి దురాక్రమణ కష్టతరమైన పట్టణ గెరిల్లా తరహా యుద్ధానికి దారి తీయవచ్చని, అటు వంటి యుద్ధంలో లెబనాన్‌లోని హెజ్బొల్లా వంటి ప్రాంతీయ సైనిక శక్తులు పాల్గొనేందుకు దారితీయవచ్చని కొందరు ఆందోళన చెందుతున్నారు.


ఫ్రాన్స్‌లో పతనమౌతున్న డీజిల్ డిమాండ్



ఫ్రాన్స్‌లో డీజిల్ డిమాండ్ సంవత్సరం తరువాత సంవత్సరం పతనమౌతోంది. ఈ సంవత్సరం సెప్టెంబర్‌లో ఈ పతనం 13 శాతం దాకా వుందని ఇండస్ట్రీ డాటా ఆధారంగా బ్లూంబర్గ్ పేర్కొంది. ఒక దేశంలోని ఆర్థిక కార్యకాలాపాల స్థాయిని ఆ దేశం డీజిల్‌ను వినియోగించే స్థాయిని బట్టి ఉంటుంది. ఎందుకంటే ఆర్థిక వ్యవస్థలోని రవాణా, పారిశ్రామిక కార్యకలాపాలకు డీజిల్ చోదక శక్తిగా ఉంటుంది. ఫ్రెంచ్ రవాణా రంగంలో డీజిల్ వినియోగం వేగంగా పతనమవటం ఆ దేశంలో పారిశ్రామిక కార్యకలాపాలు, సరుకుల రవాణా మందగిస్తున్నదనటానికి సూచికగా ఉందని వుడ్ మెకంజీ కన్సల్టెన్సీలో రిసెర్చ్ ఎనలిస్టుగా పని చేస్తున్న ఎమ్మా హౌషామ్ బ్లూమ్ బర్గ్‌కి చెప్పింది.

ఫ్రెంచ్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు ఈ మధ్యకాలంలో బాగా మందగించింది. మూడవ త్రైమాసికంలో ఫ్రాన్స్ వృద్ధి రేటు కేవలం 0.1 శాతమే ఉంది. సెప్టెంబర్ దాకా వున్న మూడు నెలల కాలంలో ఉత్పత్తి పెరుగుదల శాతం అంతకు ముందటి త్రైమాసికంలోని 0.5 శాతంతో పోలిస్తే 0.1 శాతమే ఉంది. ఎస్అండ్‌పి గ్లోబల్ తాజా డాటాను అనుసరించి ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యానికి కొలబద్దగా భావించబడే ఫ్రాన్స్ తయారీ, కొనుగోలు మేనేజర్స్ సూచిక (పిఎమ్‌ఐ) 2020 మే తరువాత అత్యంత కనిష్ట స్థాయికి చేరింది. యూరో జోన్‌లో డీజిల్ డిమాండ్ పతనం ఒక్క ఫ్రాన్స్‌లో మాత్రమే లేదు. జర్మనీ, స్పెయిన్, ఇటలీ దేశాలలో కూడా సెప్టెంబర్ నెలలో అంతకు ముందటి సంవత్సరం అదే నెలతో పోల్చినప్పుడు డీజిల్ అమ్మకాలు క్షీణించాయి. ఐరోపాకు చెందిన ఒఇసిడి దేశాలలో డీజిల్ డిమాండ్ అంతకు ముందటి సంవత్సరం జనవరి, సెప్టెంబర్ నెలల మధ్య కాలంతో ఈ సంవత్సరం అదే కాలాన్ని పోల్చినప్పుడు రోజుకు 1,60,000 బ్యారెల్స్ తగ్గింది. ఇది 3శాతం క్షీణతకు సమానం. ఈ ప్రాంతంలో డీజిల్ డిమాండ్‌ను పరిశీలించే తాజా ఆయిల్ మార్కెట్ రిపోర్ట్ ప్రకారం ఈ ప్రాంతంలో 2023, 2024 సంవత్సరాలలో వర్తమానంలోకంటే అదనంగా డీజిల్ వినియోగం రోజుకు 1,50,000 బ్యారెల్స్ క్షీణిస్తుంది.

ఇండియా మొబైల్ కాంగ్రెస్ ప్రారంభం



న్యూఢిల్లీ : 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' ఏడో ఎడిషన్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సదస్సులో ప్రధాని మాట్లా డుతూ కాంగ్రెస్‌ను 'కాలం చెల్లిన ఫోన్'తో పోల్చుతూ విమర్శలు చేశారు. 2014లోనే ప్రజలు ఆ ఫోన్లను వదిలేసి.. దేశ గతిని మార్చే ప్రభుత్వాన్ని ఎంచుకున్నారని అన్నారు. 'కాలం చెల్లిన ఫోన్లలో స్తంభించిన స్క్రీన్లపై.. ఎన్నిసార్లు స్వైప్ చేసినా, ఎన్ని బటన్లు నొక్కినా ఫలితం ఉండదు. రీస్టార్ట్ చేసినా, బ్యాటరీకి ఛార్జింగ్ పెట్టినా.. చివరకు బ్యాటరీ మార్చినా ఆ ఫోన్లు పనిచేయవు. గత ప్రభుత్వం కూడా అలాంటి స్థితిలోనే ఉండేది. 2014లోనే ప్రజలు అలాంటి కాలం చెల్లిన ఫోన్లను వదిలించుకున్నారు. ఈ దేశానికి సేవ చేసేందుకు మాకు అవకాశం కల్పించారు. 2014 కేవలం తేదీ మాత్రమే కాదు. అదో పెను మార్పు' అని మోడీ తెలిపారు. అలాగే సాంకేతిక రంగంలో భారత్ సాధించిన విజయాలను ప్రధాని గుర్తుచేశారు. 'భారత్ ఇప్పుడు 6జీ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. బ్రాడ్‌బ్యాండ్ వేగంలో భారత్ గతంలో 118 ర్యాంక్‌లో ఉండగా.. ఇప్పుడు 43వ ర్యాంక్‌కు ఎగబాకింది. ఇటీవలే గూగుల్.. భారత్‌లో పిక్సెల్ ఫోన్‌ను తయారు చేయనున్నట్టు ప్రకటించింది. శామ్‌సంగ్ ఫోల్డ్ 5, యాపిల్ ఐఫోన్ 15 ఇప్పటికే దేశంలో తయారవుతున్నాయి' అని చెప్పారు. టెక్ విప్లవంలో యువత పాత్ర కీలకమని అన్నారు. అంతరిక్ష రంగంలో భారత్ వేగంగా వృద్ధి చెందుతోందని తెలిపారు.

జియో స్పేస్ ఫైబర్ ఆవిష్కరణ

ఈ సదస్సులో ముకేష్ అంబానికి చెందిన రిలయన్స్ జియో దేశంలో తొలి శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలను ప్రధాని మోడి లాంచనంగా ఆవిష్కరించారు. జియో స్పేస్ ఫైబర్ పేరుతో భారత్‌లో ఇప్పటి వరకు ఇంటర్నెట్ సదుపాయం లేని ప్రాంతాలకు, ప్రతి ఇంటికీ డిజిటల్ సేవలను చేరువ చేయడానికి జియో ఫైబర్, జియో ఎయిర్ ఫైబర్ వంటి బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులతో పాటు జియో స్పేస్ ఫైబర్‌ను కూడా ప్రారంభించామని సంస్థ తెలిపింది.

కేసీఆర్ గెలుపు కామారెడ్డికి శక్తినిస్తుంది..

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ గెలుపనేది కామారెడ్డి నియోజకవర్గానికి కొత్త శక్తినిస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తద్వారా ఆ ప్రాంతం ఊహించలేనంతగా అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. కామారెడ్డికి చెందిన రెడ్డి ఐక్య వేదిక నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కవితతో భేటీ అయ్యారు. అక్కడి నుంచి కేసీఆర్ పోటీ చేస్తున్న నేపథ్యంలో వారు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... సీఎం గెలవటం వల్ల ప్రత్యేకాభివృద్ధి నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. పరిశ్రమలు, సంస్థలు వస్తాయనీ, ఫలితంగా కామారెడ్డితోపాటు నిజామాబాద్ జిల్లా కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని వివరించారు.

51 నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు


వికలాంగుల సహకార సంస్థ చైర్మెన్ వాసుదేవరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికలాంగుల అభ్యున్నతి, సంక్షేమానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తామని వికలాంగుల సహకార సంస్థ చైర్మెన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా 27 రోజులపాటు 51 నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు, కృతజ్ఞత సభలను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. తద్వారా బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని వికలాంగులకు పిలుపునిచ్చారు.

అవి మళ్లీ నేరాలేనా?


- ఆ సెక్షన్ల పునరుద్ధరణకు పార్లమెంటరీ ప్యానెల్ సిఫారసు చేసే అవకాశం



న్యూఢిల్లీ : భారత్‌లో స్వలింగ సంపర్కం, వివాహేతర సంబంధాలు మళ్లీ నేరాల కిందకు రానున్నాయా? కేంద్రం అటు వైపుగా చర్యలు తీసుకుంటున్నదా? అంటే విశ్వసనీయ వర్గాల నుంచి అవుననే సమాధానాలు వినబడుతున్నాయి. దీంతో పై అంశాల గురించి చర్చించే భారతీయ శిక్షా స్మృతి (ఐపీసీ) నుంచి తొలగించబడిన సెక్షన్ 377, సెక్షన్ 497 ల పునరుద్ధరణపై ప్రస్తుతం చర్చ నడుస్తున్నది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. బీజేపీ ఎంపీ బ్రిజ్‌లాల్ నేతృత్వంలోని హెూం వ్యవహారాలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వివాహేతర సంబంధాలను నేరంగా పరిగణించే చట్టం (తొలగించబడిన సెక్షన్ 497) తిరిగి తీసుకురావాలనీ, ఇందులో లింగ తటస్థ నిబంధనను తేవాలని తన డ్రాఫ్ట్ నివేదికలో సిఫారసు చేసింది. అలాగే ప్రకృతి క్రమానికి వ్యతిరేకమైన లైంగిక కార్యకలాపాల (పురుషులు, మహిళలు, ట్రాన్స్‌పర్సన్స్ లలో స్వలింగ సంపర్కం) ను నేరంగా పరిగణించే సెక్షన్ 377 (ఇది ప్రస్తుతం నేరం కాదు) కూడా తీసుకురావాలని ప్రతిపాదించినట్టు సమాచారం. సెక్షన్ 377, సెక్షన్ 497 లు రాజ్యాంగ విరుద్ధం, స్వలింగ సంపర్క, వివాహేతర సంబంధాలు నేరాలు కావంటూ 2018లో భారత సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పులను వెలువరించిన విషయం విదితమే.

నన్ను అంతమొందించేందుకు కుట్ర

- ఏపీ ఏసీబీ కోర్టు జడ్జికి చంద్రబాబు లేఖ



అమరావతి : జైలులో తనను అంతమొందించేందుకు కుట్ర జరుగుతోందంటూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఏపీ ఏసీబీ కోర్టు జడ్జికి లేఖ రాశారు. తన భద్రత, ఆరోగ్య సమస్యలపై అనుమానం వ్యక్తం చేస్తూ చంద్రబాబు బుధవారం రాసిన మూడు పేజీల లేఖను జైలు అధికారులు శుక్రవారం ఏసీబీ కోర్టు జడ్జికి పంపారు. తనను అంతమొందించేందుకు వామపక్ష తీవ్రవాదులు కుట్ర పన్నుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కుట్రపై తూర్పుగోదావరి జిల్లా ఎస్పీకి కూడా లేఖ వచ్చిందని, దానిపై ఇప్పటి వరకు పోలీసు అధికారులు ఎలాంటి విచారణ చేపట్టలేదని వివరించారు. తనను చంపేందుకు రూ.కోట్లు చేతులు మారినట్లు తెలిసిందని పేర్కొన్నారు. జైలుకు వచ్చినప్పుడు తనను అనధికారికంగా వీడియోలు, ఫొటోలు తీశారని, ఆ ఫుటేజీని పోలీసులే లీక్ చేశారని లేఖలో వివరించారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ తరహా వీడియో ఫుటేజీని రిలీజ్ చేశారని పేర్కొన్నారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయన్నారు. జైలులో పెన్ కెమెరాతో డ్రగ్స్ కేసు నిందితుడు తిరుగుతున్నాడని తెలిపారు. ఆ ఖైదీ జైలు లోపల ఫొటోలు తీస్తున్నాడని పేర్కొన్నారు. ఈ నెల 6న జైలు ప్రధాన ద్వారం మీదుగా డ్రోన్ ఎగురవేసి తన కదలికలు తెలుసుకునే ప్రయత్నం చేశారని అన్నారు. ములాఖత్‌లో తనను కలిసిన వారి చిత్రాల కోసం కూడా డ్రోన్‌ను వినియోగిస్తున్నారన్నారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులకు కూడా ప్రమాదం పొంచి ఉందన్నారు. జైలుపై డ్రోన్ ఎగురవేసింది వైసిపి వారేనని అనుమానమని లేఖలో పేర్కొన్నారు. డ్రోన్ ఘటన ప్రధాన సూత్రధారి ఎవరో గుర్తించలేదని, జైలు అధికారుల నిస్సహాయతకు ఇది నిదర్శనమని అన్నారు. కొందరు గంజాయి ప్యాకెట్లు జైల్లోకి విసిరితే గార్డెనింగ్ విధుల్లోని ఖైదీలు వాటిని పట్టుకున్నారన్నారు. రాజమండ్రి జైలులో మొత్తం 2,200 మంది ఖైదీలు వుంటే, అందులో 750 మంది డ్రగ్స్ కేసు నిందితులని వివరించారు. కొంతమంది ఖైదీల వల్ల తన భద్రతకు తీవ్ర ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జడ్ ప్లస్ కేటగిరి రక్షణలో ఉన్న తన భద్రతకు ఇది తీవ్రమైన ముప్పు అని లేఖలో పేర్కొన్నారు. తనకు అనారోగ్య సమస్యలు వున్నాయని మెరుగైన వైద్యసేవలు అవసరమని తెలిపారు.

ఏపీ ప్రాజెక్టులపై కేఆర్ఎంబీకి తెలంగాణ ఫిర్యాదు

- పునర్వ్యీభవజన చట్టాన్ని ఉల్లంఘిస్తున్నది విమర్శ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులపై కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీకి) తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. పునర్వ్యీభజన చట్టం-2014ను ఉల్లంఘిస్తున్నదని అందులో పేర్కొంది. ఈమేరకు తెలంగాణ సాగునీరు,ఆయకట్టు అభివృద్ధి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్ ఇటీవల కేఆర్ఎంబీ చైర్మెన్‌కు లేఖ రాశారు. అనంతపురం జిల్లా రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 4100 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు అక్రమంగా చర్యలు తీసుకుంటున్నదని లేఖలో విమర్శించింది. గుమ్మగాట, రాయదుర్గం, డి.హిరేహాల్, కనెకల్ మండలాల పరిధిలోని 58 మధ్యతరహా ట్యాంకులను నింపేందుకు టెండర్లు పిలిచారని గుర్తు చేసింది. మొత్తం భైరవ-నతిప్ప ప్రాజెక్టు పరిధిలో సర్వే లెవెలింగ్ పనులు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలియజేసింది. సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ నుంచిగానీ ఎలాంటి అనుమతులు తీసుకోలేదని లేఖలో పేర్కొన్నారు. అపెక్స్ కౌన్సిల్ అనుమతి సైతం లేదని విమర్శించారు. వెంటనే ఏపీ అక్రమ ప్రాజెక్టులను ఆపాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీ లో ఓటర్లు 4,02,21,450

ముసాయిదా జాబితా విడుదల
మహిళా ఓటర్లు 2,03,85,851 మంది
పురుష ఓటర్లు 1,98,31,791 మంది
థర్డ్ జెండర్ ఓటర్లు 3,808 మంది

అమరావతి : రాష్ట్రంలో ప్రస్తుతం 4,02,21,450 మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ తెలిపారు.

ఈ మేరకు ముసాయిదా ఒటర్ల జాబితాను శుక్రవారం ఆయన విడుదల చేశారు. దీని ప్రకారం పురుషులు 1,97,66,013 మంది, మహిళలు 2,03,83,471 మంది, థర్డ్‌జెండర్ 3,808 మంది ఓటర్లుగా నమోదయ్యారు. సర్వీస్ ఓటర్లు పురుషులు 65,778 మంది, మహిళా ఓటర్లు 2,380 మంది ఉన్నారు. ఈ జాబితాపై డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు.

నీట్ వ్యతిరేక బిల్లుకు ఆమోదం తెలపండి

- రాష్ట్రపతి ముర్ముకు స్టాలిన్ విజ్ఞప్తి

చెన్నై : నీట్ వ్యతిరేక బిల్లుకు ఆమోదం తెలపాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. తమిళనాడు పర్యటనను ముగించుకుని ఢిల్లీ వెళుతున్న రాష్ట్రపతికి విమానాశ్రయంలో ఈ మేరకు ఆయన ఒక వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో అండర్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్‌లో అర్హత సాధించాలనే తొలగించాలని కూడా ముఖ్యమంత్రి ఆ వినతిపత్రంలో కోరారు. రాష్ట్రపతికి వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు గవర్నర్ ఆర్ఎన్ రవి, రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ మంత్రి కె. పొన్ముడి, ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు. తమిళనాడు అడ్మిషన్ టూ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ కోర్సెస్ బిల్లు 2021 రాష్ట్రపతి ఆమోదం కోసం సంవత్సరానికి పైగా పెండింగ్‌లో ఉందని స్టాలిన్ గుర్తు చేశారు. 'నీట్ ఆధారంగా వైద్య కోర్సుల ప్రవేశం పేద, వెనుకబడిన విద్యార్థులకు వ్యతిరేకంగా ఉందనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుని ఫేజ్ 2 ద్వారా ప్రవేశ ప్రక్రియను తమిళనాడు ఎంచుకుంది.

యూనియన్ ఏర్పాటు చేస్తారా?

- 127 మంది కార్మికుల తొలగింపు
- జపనీస్ ఆటోమొబైల్ కంపెనీ యూనిప్రెస్ నిర్వాకం : సీఐటీయూ ఆగ్రహం



చెన్నై : జపనీస్ ఆటోమొబైల్ విడిభాగాల ఉత్పత్తి సంస్థ యూనిప్రెస్ కార్పొరేషన్ 127 మంది శాశ్వత ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. దీంతో తమిళనాడులోని కాంచీపురం జిల్లా ఒరగడమ్‌లోని సిప్‌కాట్‌లో ఉన్న ఫ్యాక్టరీలోకి ఆగస్టు 24 నుంచి 60 రోజులకు పైగా కార్మికులకు ప్రవేశం లభించలేదు. సీఐటీయూకు అనుబంధంగా ఉన్న యూనిప్రెస్ ఇండియా తొళిలలార్ సంఘం ఫ్యాక్టరీ వెలుపల యూనియన్ జెండాను ఎగురవేసి ఆగస్టు 23న నేమ్ బోర్డును ఏర్పాటు చేసింది. అయితే, కార్మికులను లెక్కచేయకుండా సిప్‌కాట్, యూనిప్రెస్ యాజమాన్యం నేమ్‌ప్లేట్, జెండాను తొలగించింది.

ఇది జరిగిన 30 గంటల్లోనే కార్మికులు జెండాను ఎగురవేశారు. ర్యాలీకి పిలుపునిచ్చారు. చేనేత కార్మికులు, ఆటో రిక్షా సంఘాలు కూడా ఇందులో పాల్గొన్నాయి. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎ సౌందరరాజన్ జెండాను ఎగురవేశారు. అప్పటి నుంచి యూనియన్ ఏర్పాటు హక్కును పాటించినందుకు శిక్షగా యూనిప్రెస్ కంపెనీ సదరు ఉద్యోగులకు పనిని నిరాకరించింది. యూనిప్రెస్ యాజమాన్యం నిర్ణయంపై సీఐటీయూ స్పందించింది.

యూనిప్రెస్ యాజమాన్యం తీరుపై తమిళనాడు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేసింది. " కార్మిక శాఖలో చర్చలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా, నైపుణ్యం లేని కార్మికులను పనిలో పెట్టుకుని యూనిప్రెస్ అక్రమ ఉత్పత్తికి పాల్పడుతున్నది" అని సీఐటీయూ ఆరోపించింది. యూనిప్రెస్ కార్మికులను పనికి రాకుండా ఆపకూడదని రాష్ట్ర కార్మిక శాఖ పేర్కొన్నది. వారు పని చేయడానికి, సాధారణ రాజీ చర్చలలో పాల్గొనడానికి అనుమతించాలని ప్రకటించింది. అయితే సెప్టెంబర్ 27న లేబర్ కమిషనర్ పిలిచిన చర్చల్లో యూనిప్రెస్ పాల్గొనకపోవటం గమనార్హం. యాజమాన్యంతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామనీ, అయితే యూనియన్‌ను తుడిచిపెట్టేందుకు యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలను అంగీకరించలేమని సీఐటీయూ స్పష్టం చేసింది.

ఏడుస్థానాల్లో న్యూడెమోక్రసీ అభ్యర్థుల పోటీ

- మిగతా స్థానాల్లో ప్రజాస్వామ్యవాదులు, కమ్యూనిస్టు విప్లవకారులకు మద్దతు : న్యూడెమోక్రసీ పార్టీల నేతలు సాధినేని వెంకటేశ్వరరావు, ఎ.మధు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు స్థానాల్లో తమ అభ్యర్థులు పోటీ చేస్తారనీ, మిగతా స్థానాల్లో ప్రజాస్వామ్యవాదులకు, కమ్యూనిస్టు విప్లవకారులకు మద్దతు తెలుపుతామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రెండు పార్టీలు సంయుక్తంగా ప్రకటించాయి. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీల రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యులు ఆవునూరి మధు మాట్లాడారు. ఇల్లందు(ఎస్టీ)- మోకాళ్ల కృష్ణ, పినపాక(ఎస్టీ)-ఈసం కృష్ణ, మహబూబాబాద్(ఎస్టీ) బట్టు భిన్నమ్మ, ములుగు(ఎస్టీ)-సమ్మక్క, నర్సంపేట-మొగిలి ప్రతాప్‌రెడ్డి, మంచిర్యాల -అందె మంగ, నిజామాబాద్ అర్బన్-మసాల్కర్ శివకుమార్ తమ అభ్యర్థులుగా పోటీచేస్తారని తెలిపారు. వారిని గెలిపించాలని ప్రజలను కోరారు. తెలంగాణ వనరులను, సహజ సంపదలను కాపాడుకునేందుకు, దున్నేవాడికే భూమి దక్కాలని పోరాటం చేయడం తప్ప మరో మార్గం లేదని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ హిందుత్వ సర్కారు మత విద్వేషాన్ని రెచ్చగొడుతూ ప్రశ్నించే గొంతుల్ని నొక్కేస్తున్నదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించాలని చూస్తున్నదన్నారు. అటవీ సంరక్షణ నియమాల పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టి సహజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే పనిలో బీజేపీ ఉందని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేననీ, బిల్లులు, చట్టాల రూపకల్పన, కీలక సమయాల్లో ఆ రెండు పార్టీలూ పరస్పరం మద్దతు తెలుపుకున్నాయని పలు ఉదంతాలను వివరించారు. ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

బీఎల్ఎఫ్‌తోనే సామాజిక తెలంగాణ

- నల్లా సూర్యప్రకాశ్
- తొమ్మిది మందితో మూడో జాబితా విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సామాజిక తెలంగాణ బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)తోనే సాధ్యమని రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచకుండా ప్రజలను ఓట్లడిగే ధైర్యం బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకుందా?అని ప్రశ్నించారు. తొమ్మిది మంది అభ్యర్థులతో మూడో జాబితాను ఆయన శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూటికి 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జనాభా కనుగుణంగా అసెంబ్లీ సీట్లు కేటాయించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. మొదటి విడతలో 18 మంది, రెండో విడతలో 16 మంది, మూడో విడతలో తొమ్మిది మంది కలిపి 43 మంది అభ్యర్థులను ప్రకటించామని చెప్పారు. ఎంసీపీఐ(యూ) ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ తాము ప్రజా సమస్యలే ఎజెండాగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని అన్నారు. డబ్బు, మద్యం, ప్రలోభాలపైనే బూర్జువా పార్టీలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. తాము నిరుద్యోగం, అధిక ధరలు, ఉద్యోగాల కల్పన, రైతులు, వ్యవసాయ కార్మికులు, కూలీల సమస్యలే ప్రధానంగా ఎన్నికల్లో ప్రస్తావించి ప్రజల మన్ననలు పొందుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్, నాయకులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు పాండురంగాచారి, బీఎల్ఎఫ్ నాయకులు యస్ సిద్ధిరాములు, తుకారాం నాయక్, కుంభం సుకన్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మె హామీలు అమలు చేయాలి

- నల్లా పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల ముందు నిరసన
- నల్లా మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు, ఈసీఎఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ఎఎన్ఎంలు, వైద్య విధాన పరిషత్ ఎఎన్ఎంలు, హెచ్ఆర్డిఎఎన్ఎంలు, ఇతర అన్ని రకాల ఎఎన్ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఫసియుద్దీన్, కె యాదానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ హామీల అమలు కోసం, తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పీఆర్‌సీ, ఏరియర్స్ దసరా పండుగ లోపు ఇస్తామని చెప్పి, మాట తప్పారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పీఆర్‌సీ, ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రేషన్ స్కామ్‌లో బెంగాల్ మంత్రి అరెస్టు

కోల్‌కతా: పశ్చిమ్ బెంగాల్ అటవీ శాఖ మంత్రి, టిఎంసి నాయకులు జ్యోతిప్రియో మల్లిక్‌ను శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) అదుపులోకి తీసుకుంది. రేషన్ స్కామ్‌లో 20 గంటలు ప్రశ్నించిన ఇడి తర్వాత శుక్రవారం తెల్లవారుజామున మంత్రిని అరెస్టు చేసింది.

జ్యోతిప్రియో మమతా ప్రభుత్వంలో ఆహార మంత్రిగా ఉన్న సమయంలో రేషన్ పంపిణీ కుంభకోణం జరిగిందనే ఆరోపణలు వచ్చాయి.